www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



సింహగిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

సింహగిరి ప్రదక్షిణకు పోటెత్తారు

అప్పన్న పుష్పరథాన్ని ప్రారంభించిన అశోక్ గజపతిరాజు

3

ఆదివారం | 21-7-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 96 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం; తిథి: పౌర్ణమి మ. 3.47 తదుపరి పాడ్యమి; నక్షత్రం: ఉత్తరాషాఢ రా. 12.14 తదుపరి శ్రవణం; వర్జ్యం: ఉ. 9.17-10.47, తె. 3.55-5.23; దుర్ముహూర్తం: సా. 5.05-5.56; అమృతఘడియలు: సా. 6.15-7.45; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 5.54; సూర్యాస్తమయం: 6.48 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



నరసాపురం పరిధి రుస్తుంబాదలో నీట మునిగిన వరి చేలు



వరద ధాటికి కొట్టుకుపోయిన ఆంధ్ర నుంచి ఒడిసాకు వెళ్లే 326వ జాతీయ రహదారి

వరద గోదారి

పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు

జలదిగ్బంధంలో మరిన్ని గ్రామాలు

రేపు ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక?

అల్లూరి జిల్లా చింతూరులో 207 మి.మీ. వర్షం

వేల ఎకరాల్లో నీటమునిగిన పంటలు

పూర్తిగా మునిగిన గండిపోశమ్మ ఆలయం

సహాయ చర్యలకు 21.50 కోట్లు విడుదల

ఒడిసాలో తీరం దాటిన వాయుగుండం

నేడూ రాష్ట్రంలో పలుచోట్ల భారీ వర్షాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు గోదావరి, కృష్ణా, శబరి నదుల్లో వరద ప్రవాహం అంతకంతకూ పెరుగుతోంది. పంట పొలాల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. శనివారం కూడా పలు జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. ఛత్తీ‌స్‌గఢ్, తెలంగాణ, ఒడిసా రాష్ట్రాల్లోనూ భారీ వర్షాలు కురుస్తుండడంతో గోదావరి, శబరి నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సహాయ, పునరావాస చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.21.50 కోట్లు విడుదల చేసినట్లు విపత్తుల

మిగతా 11వ పేజీలో...

ప్రతి రూపాయీ రాబట్టండి

కేంద్రం పథకాలకు వచ్చే నిధులన్నీ తీసుకురండి

అమరావతి, పోలవరం, జల్ జీవన్ ఇతర ప్రాజెక్టులకు నిధులు అవసరం

వెనుకబడిన ప్రాంతాలకూ రాయితీ పథకాలు

వంద కోట్లు వచ్చేలా ఉన్నా వదలొద్దు

విభజన హామీల అమలు జరగాలి

పలు ప్రాజెక్టులపై కేంద్రంతో చర్చించాలి

ఎంపీలు, మంత్రులతో భేటీలో చంద్రబాబు

నిధులు రాబట్టడంపై మార్గదర్శకం

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని నిర్దేశం

ప్రతి 15 రోజులకూ సమీక్షిస్తానని వెల్లడి



ప్రజల నుంచి వినతిపత్రాలు తీసుకుంటున్న సీఎం చంద్రబాబు

అమరావతి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నుంచి వీలైనంత వరకూ రాష్ట్రానికి నిధులు రాబట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు... పార్టీ ఎంపీలు, కేంద్ర మంత్రులకు సూచించారు. కేంద్ర పథకాల కింద వచ్చే నిధులను వేటినీ వదలొద్దని, రాష్ట్రాభివృద్ధి కోసం కృషి చేయాలని అన్నారు. రాష్ట్రం తీవ్ర ఆర్థిక సమస్యల్లో కూరుకుపోయిన నేపథ్యంలో ముఖ్యమంత్రి కేంద్రంపై ఫోకస్ పెట్టారు. కేంద్ర పథకాల నిధులు రాబట్టడం కోసం

మిగతా 12వ పేజీలో...

జగన్ కుట్రలు సాగవు

ఉనికి కోసమే ఫేక్ రాజకీయం

ప్రవర్తనలో ఇంకా మార్పు రాలేదు

శాంతిభద్రతల అంశంలో రాజీలేదు

పోలీసులూ కఠినంగా ఉండాలి: బాబు

12



చంద్రబాబుతో సమావేశంలో టీడీపీ ఎంపీలు

ఎంపీలకు శాఖల బాధ్యతలు

కేంద్రంలో పనుల పరిష్కారం, నిధులు రాబట్టేందుకు పని విభజన

శాఖలు కేటాయించిన చంద్రబాబు

పట్టాలెక్కిన పాలన



64 మంది ఐఏఎస్‌లు బదిలీ

సీఎంవోలో శాఖల కేటాయింపు, జిల్లాలకు కలెక్టర్లు, ఎస్పీల నియామకం పూర్తి

జాయింట్ కలెక్టర్లకూ పోస్టింగులు ఖరారు

ఇక మళ్లీ ఏడాది దాకా బదిలీలు లేనట్టే

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి డైరెక్టరుగా కేరళ ఐఏఎస్ కృష్ణతేజ

రిజిస్ట్రేషన్ ఐజీగా శేషగిరి బాబు

కలెక్టర్‌గా అవకాశం దక్కని కీర్తికి ట్రాన్స్‌కో ఎండీగా నియామకం

అమరావతి, జూలై 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పరిపాలన పట్టాలెక్కింది. శనివారం 64 మంది ఐఏఎస్‌లను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఒకవైపు సీఎంవో అధికారులకు శాఖలు కేటాయించడంతోపాటు జిల్లాల్లో పని చేసే అధికారులందరినీ ప్రభుత్వం నియమించేసింది. ఇప్పటికే కలెక్టర్లు, ఎస్పీలను, జాయింట్ కలెక్టర్ల నియామక ప్రక్రియ పూర్తయింది. రెగ్యులర్ అడ్మినిస్ట్రేషన్‌కు ఇబ్బంది లేకుండా జిల్లాలకు అధికారులను కేటాయించింది. తాజా ఉత్తర్వులతో అఖిల భారత సర్వీసు అధికారుల బదిలీలు కూడా

మిగతా 2వ పేజీలో...

విషం చిమ్మడమే నైజం!

అదే విద్వేషపు రాత.. నిజాల ఊచకోత

రోత పత్రికలో టీడీపీపై అడ్డగోలు దాడులు

అధికారంలో ఉన్న ఐదేళ్లూ అరాచకపర్వం

విపక్షంలోకి వచ్చిన 5 వారాలకే జగన్ గగ్గోలు

నాడు వివేకా హత్య, కోడికత్తి చంద్రబాబుపైకే

ఇప్పుడు వినుకొండ ఘటన టీడీపీపైనే

అసలు నిజాలు మరిచి రోత రాతలు



వివేకా హత్య సమయంలో జగన్ పత్రికలో ప్రచురించిన వికృత కథనం

నిజాలు ఏవైనా సరే... విషం చిమ్మాలి! 'రోత పత్రిక'లో నీచ రాతలు రాయాలి! అక్షరాలకు రక్తం పులిమి... అదంతా టీడీపీ ఖాతాలో వేయాలి! ఇదీ... జగన్ నైజం! టీడీపీ అధికారంలోకి వచ్చి రాగానే ఆయనకు 'అరాచకాలు, అన్యాయాలు, రక్త చరిత్రలు' గుర్తుకు వస్తాయి. ఐదేళ్లు అధికారంలో ఉండగా తన పార్టీ పరివారం చేసిన నడిరోడ్డు హత్యలు, దాడులపై నోరు మెదిపిన దాఖలాలే లేవు. ఇప్పుడు... కూటమి సర్కారు కొలువుదీరిన ఐదు వారాలకే 'రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలి' అని జగన్ గగ్గోలు పెడుతున్నారు.

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

వ్యక్తిగత గొడవలు, ఫ్యాక్షన్ మర్డర్లు, ఇతరత్రా కారణాలవల్ల జరిగే హత్యలు... ఏం జరిగినా టీడీపీపైన తోసేయడమే! 2014-19లో జగన్ అనుసరించిన విష వ్యూహం ఇదే. చిన్నాన్న వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగినప్పుడు.. అది చంద్రబాబు పనేనంటూ 'నారాసుర రక్త చరిత్ర' పేరిట తన రోతపత్రికలో నీచ రాతలు రాశారు. కోడికత్తి ఘటన జరిగినప్పుడు కూడా టీడీపీని ఒక హంతక పార్టీలా చూపించేందుకు చేతిలోని అన్ని ప్రచార అస్త్రాలను యథేచ్ఛగా వాడుకున్నారు. చివరికి.. ఆ తర్వాత ఈ రెండు ఘటనల్లోనూ ఉన్నది వైసీపీకి సంబంధించిన వ్యక్తులే అని తేలడం గమనార్హం. ఇప్పుడు కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి.. పూర్తిగా కుదురుకోకముందే

మిగతా 11వ పేజీలో...



రాష్ట్రపతి పాలనకు పార్లమెంటులో నినదించండి

24న ఢిల్లీలో ధర్నాకు అన్ని పార్టీలనూ పిలవండి

వైసీపీ ఎంపీలకు జగన్ ఆదేశం

నీట్ ఫలితాల్లో.. రాజ్‌కోట్ రహస్యం!

ఈ ఒక్క నగరంలో 85% మందికి అర్హత

ఒకే కేంద్రంలో 789 మందికి 550-720 మార్కులు

రాజస్థాన్ కేంద్రాల్లోనూ చిత్రవిచిత్రాలు

సీకర్‌లో 2,037 మందికి 650కిపైన..

కేంద్రాల వారీగా నీట్ ఫలితాల వెల్లడి

న్యూఢిల్లీ, జూలై 20: గుజరాత్‌లోని రాజ్‌కోట్..! ఆ నగరంలోని వేర్వేరు పరీక్ష కేంద్రాల్లో 22,701 మంది నీట్-యూజీ పరీక్ష రాశారు. వారిలో కనీవినీ ఎరగని రీతిలో.. రికార్డు స్థాయిలో 85% మంది ఎంబీబీఎస్‌లో చేరేందుకు అర్హత మార్కులను సాధించారు..! ఈ నగరంలోని ఆర్కే యూనివర్సిటీ అనుబంధ కళాశాల– స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ కేంద్రంలో పరీక్ష రాసినవారి ఫలితాలను పరిశీలిస్తే.. 700-720 మధ్య స్కోరు వచ్చిన వారు 12 మంది ఉన్నారు. 115 మందికి 650-699 మధ్య, 259 మందికి 600-649 మధ్య, 403 మందికి 550-599 మధ్య స్కోర్లు వచ్చాయి..! రాజ్‌కోట్‌లోని మిగతా కేంద్రాల్లోనూ ఇలాంటి ఫలితాలే

మిగతా 2వ పేజీలో...



2

యూపీఎస్సీ చైర్మన్ రాజీనామా

వ్యక్తిగత కారణాలతో వైదొలగిన మనోజ్ సోనీ

మరో ఐదేళ్ల పదవీకాలం ఉండగానే నిర్ణయం

15 రోజుల కిందటే రాజీనామా

తాజాగా వెలుగులోకి

ఇకపై సామాజిక, ఆధ్యాత్మిక సేవలో పయనం

పూజా ఖేద్కర్ ఉదంతంతో సంబంధం లేదు: యూపీఎస్సీ!

ఆ 5 మెడికల్ కాలేజీల్లో అడ్మిషన్లకు

అనుమతివ్వండి

నిర్మాణాలు పూర్తి చేస్తాం.. సిబ్బందిని పెడతాం

ఎన్ఎంసీకి లేఖ రాసిన కాలేజీల ప్రిన్సిపాళ్లు

ఎన్ఎంసీ సరేనంటే కొత్తగా 500 సీట్లు

గత సర్కారు తప్పిదాలతో నిలిచిన అనుమతి

3



రేపటి నుంచి పార్లమెంటు

2

తొలిరోజు ఆర్థిక సర్వే.. ఎల్లుండి కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి నిర్మల

64 మంది ఐఏఎస్‌లు బదిలీ

(మొదటి పేజీ తరువాయి)

పూర్తయినట్టే! ఇకపై బదిలీలు అనే మాటెత్తేకుండా, ప్రభుత్వం భారీ ఎత్తున మార్పులు చేసింది. ప్రభుత్వం నిర్దేశించుకున్న దానిప్రకారం అందరికీ కీలకమైన బాధ్యతలు అప్పగించింది. కలెక్టర్‌గా అవకాశం కోల్పోయిన కీర్తికి ట్రాన్స్‌కో ఎండీగా అవకాశం కల్పించింది. ఎన్నికల సమయంలో సమాచారలోపంతో సస్పెన్షన్‌కు గురైన గిరీశ్‌షాను సివిల్ సప్లయిస్ ఎండీగా నియమించింది. కార్మిక శాఖ కమిషనర్‌గా ఉన్న శేషగిరి బాబును ఐజీ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌కి బదిలీ చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సిఫారసు మేరకు కేరళ నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన కృష్ణతేజకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి డైరెక్టర్‌గా నియమించింది.

ఐఏఎస్ అధికారుల బదిలీల వివరాలు...

అధికారి పేరు	ప్రస్తుతం స్థానం	బదిలీ స్థానం
సీహెచ్ శ్రీధర్	పోస్టింగ్ కోసం ఎదురుచూపు	మైనారిటీ వెల్ఫేర్ కమిషనర్
ఎంవీ శేషగిరిబాబు	కార్మిక శాఖ కమిషనర్	స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజీ
జి.రేఖారాణి	పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెక్రటరీ	హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ కమిషనర్
సీహెచ్ హరికిరణ్	పోస్టింగ్ కోసం ఎదురుచూపు	ఆరోగ్యశాఖ డైరెక్టర్
జి. వీరపాండియన్	పౌర సరఫరాల ఎండీ	సెర్ప్ సీఈవో
ఎం. హరినారాయణ	పోస్టింగ్ కోసం ఎదురుచూపు	మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్
శ్రీకేశ్ లత్కర్ బాలాజీ	పోస్టింగ్ కోసం ఎదురుచూపు	సర్వే సెటిల్‌మెంట్స్ డైరెక్టర్
మల్లిఖార్జున్	పోస్టింగ్ కోసం ఎదురుచూపు	బీసీ వెల్ఫేర్ డైరెక్టర్
వి. ప్రసన్న వెంకటేశ్	పోస్టింగ్ కోసం ఎదురుచూపు	సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ సెక్రటరీ
పీఎస్ గిరీ షా	హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ	సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఎండీ
ఎస్ మంజీర్ గిలానీ	పోస్టింగ్ కోసం ఎదురుచూపు	మార్క్‌ఫెడ్ ఎండీ, శాప్ ఎండీగా (అదనం)
కృత్తికా శుక్లా	పోస్టింగ్ కోసం ఎదురుచూపు	ఇంటర్ మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్
పట్టణంశెట్టి రవి సుభాశ్	పోస్టింగ్ కోసం ఎదురుచూపు	సిపిడిసిఎల్ ఎండీ
జి. లక్ష్మీ షా	ఎన్టీఆర్ వైద్య సేవ సీఈవో	ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ
ఎం.వేణుగోపాల్ రెడ్డి	పోస్టింగ్ కోసం ఎదురుచూపు	మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్
పి.రాజాబాబు	స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ	హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ
నిశాంత్ కుమార్	పోస్టింగ్ కోసం ఎదురుచూపు	ఎక్సైజ్ డైరెక్టర్
జీసీ కిషోర్‌కుమార్	పోస్టింగ్ కోసం ఎదురుచూపు	కృష్ణా, గోదావరి క్లీనింగ్ ఎండీ
ఎం.విజయ సునీత	పోస్టింగ్ కోసం ఎదురుచూపు	అగ్రికల్చర్ డైరెక్టర్
కె.శ్రీనివాసులు	పోస్టింగ్ కోసం ఎదురుచూపు	హార్టికల్చర్ డైరెక్టర్
పి.లావణ్య వేణి	ఏలూరు జాయింట్ కలెక్టర్	సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్
ఎం. అభిషిక్త్ కిషోర్	పోస్టింగ్ కోసం ఎదురుచూపు	ఏపీఐఐసీ ఎండీ, ఏపీటీడీసీ ఎండీ(అదనం)
డా.ఎ.సిరి	స్వమిత్వా స్పెషల్ కమిషనర్	సెకండరీ హెల్త్ డైరెక్టర్
ఎస్.రామసుందర్ రెడ్డి	కాకినాడ జాయింట్ కలెక్టర్	సీఆర్‌డీఏ ఆర్ అండ్ ఆర్ కమిషనర్
కీర్తి చేకూరి	గుంటూరు మున్సిపల్ కమిషనర్	ఏపీ ట్రాన్స్‌కో ఎండీ
జి. గణేశ్ కుమార్	కడప జాయింట్ కలెక్టర్	స్కిల్ డెవలప్‌మెంట్, సాంకేతిక విద్య ఎండీ
సంపత్ కుమార్	ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్	విశాఖపట్నం మున్సిపల్ కమిషనర్
పి.నవ్య	ఎంప్లాయిమెంట్, ట్రైనింగ్స్ డైరెక్టర్	ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్
కె. దినేశ్‌కుమార్	రాజమండ్రి మున్సిపల్ కమిషనర్	గుంటూరు మున్సిపల్ కమిషనర్
హెచ్ఎం ధ్యానచంద్ర	తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్	విజయవాడ మున్సిపల్ కమిషనర్
సీవీ ప్రవీణ్ ఆదిత్య	పశ్చిమగోదావరి జాయింట్ కలెక్టర్	మ్యారిటైమ్ బోర్డ్ సీఈవో
టి. నిశాంతి	సిసిఎల్ జాయింట్ సెక్రటరీ	కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్
హిమాన్షు కౌశిక్	ఏపీ భవన్ అదనపు రెసిడెన్షియల్ కమిషనర్	తూ.గో. జాయింట్ కలెక్టర్
ఎ.భార్గవ్ తేజ	కర్నూలు మున్సిపల్ కమిషనర్	గుంటూరు జాయింట్ కలెక్టర్
నారపురెడ్డి మౌర్య	కర్నూలు జాయింట్ కలెక్టర్	తిరుపతి మున్సిపల్ కమిషనర్
ఎస్.అజయ్‌కుమార్	కోనసీమ జాయింట్ కలెక్టర్	సిసిఎల్ జాయింట్ సెక్రటరీ
జి.సూరజ్ ధనంజయ్	రంపచోడవరం పీవో	పల్నాడు జాయింట్ కలెక్టర్
కల్పనా కుమారి	పోస్టింగ్ కోసం ఎదురుచూపు	గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ ఎండీ
కేతన్ గార్గ్	అనంతపురం జాయింట్ కలెక్టర్	రాజమండ్రి మున్సిపల్ కమిషనర్
ఆర్.గోవింద రావు	సీసీఎల్ఏ అదనపు డైరెక్టర్	కాకినాడ జాయింట్ కలెక్టర్
ఎన్. తేజ్‌భరత్	తూ.గో. జాయింట్ కలెక్టర్	కడప మున్సిపల్ కమిషనర్
డి.హరిత	ఏపీయుఎఫ్ఐడీసి ఎండీ	కె.ఆర్.పురం పీవో
జి.సూర్యసాయి	కడప మున్సిపల్ కమిషనర్	సీఆర్‌డీఏ అదనపు కమిషనర్
భావన	అల్లూరి జాయింట్ కలెక్టర్	కాకినాడ మున్సిపల్ కమిషనర్
ఎం.నవీన్ కుమార్	శ్రీకాకుళం జాయింట్ కలెక్టర్	సీఆర్‌డీఏ అదనపు కమిషనర్
సి.విష్ణు చరణ్	పార్వతీపురం పీవో	నంద్యాల జాయింట్ కలెక్టర్
నిధి మీనా	వయోజన విద్య డైరెక్టర్	ఎన్టీఆర్ జాయింట్ కలెక్టర్
కట్టా సింహాచలం	సీఆర్‌డీఏ అదనపు కమిషనర్	రంపచోడవరం పీవో
శుభమ్ బన్సల్	సీతంపేట పీవో	తిరుపతి జాయింట్ కలెక్టర్
ఎం.సూర్యతేజ	కేఆర్‌పురం పీవో	నెల్లూరు మున్సిపల్ కమిషనర్
టి.రాహుల్‌కుమార్ రెడ్డి	నంద్యాల జాయింట్ కలెక్టర్	సీతంపేట పీవో
నూరుల్ ఖమర్	టెక్కలి సబ్ కలెక్టర్	ఆర్థిక శాఖ డిప్యూటీ సెక్రటరీ
ఎఫ్.ఆహ్మద్ ఖాన్	అన్నమయ్య జాయింట్ కలెక్టర్	శ్రీకాకుళం జాయింట్ కలెక్టర్
అదితి సింగ్	తిరుపతి మున్సిపల్ కమిషనర్	కడప జాయింట్ కలెక్టర్
సెధు మాధవన్	నెల్లూరు జాయింట్ కలెక్టర్	పార్వతీపురం పీవో
పెద్దింటి ధాత్రిరెడ్డి	పాడేరు సబ్ కలెక్టర్	ఏలూరు జాయింట్ కలెక్టర్
ఆదర్శ్ రాజేంద్రన్	ఎంఎస్ఎంఈ సీఈవో	అన్నమయ్య జాయింట్ కలెక్టర్
ఎంజే అభిషేక్ గౌడ	విలేజ్, వార్డు సెక్రటేరియట్ అదనపు డైరెక్టర్	అల్లూరి జాయింట్ కలెక్టర్
వై మేఘాస్వరూప్	అనంతపురం మున్సిపల్ కమిషనర్	మదనపల్లె సబ్ కలెక్టర్
డబ్ల్యూఎస్ దేవి	జెడ్పీ సీఈవో, అనంతపురం	రాజంపేట సబ్ కలెక్టర్
వీఆర్ కృష్ణతేజ	కేరళ నుంచి ఏపీకి డిప్యుటేషన్	పంచాయతీరాజ్,రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్
డోలా శంకర్ తమ్ము	లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్	ఫిషరీస్ కమిషనర్
కేఎస్ విశ్వనాథన్	జీవీఎంసీ అడిషనల్ కమిషనర్	వీఎంఆర్‌డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్

నీట్ ఫలితాల్లో.. రాజ్‌కోట్ రహస్యం!

(మొదటి పేజీ తరువాయి)

కనిపించాయి. సుప్రీంకోర్టు ఆదేశాలతో కేంద్రాలు, నగరాల వారీగా జాతీయ పరీక్షల నిర్వహణ సంస్థ(ఎన్‌టీఏ) శనివారం నీట్ ఫలితాలను విడుదల చేసింది. ఈ ఫలితాల్లో.. గుజరాత్‌లోని రాజ్‌కోట్, రాజస్థాన్‌లోని సీకర్ నగరాల్లోని కేంద్రాల్లో దిమ్మదిరిగే ఫలితాలు కనిపించాయి. సీకర్ నగరంలోని విద్యాభారతి సీకర్ కేంద్రంలో 8 మంది 700-720 మధ్య, 69 మంది 650-699 మధ్య, 155 మంది 600-649 మధ్య, 241 మంది 500-599 మధ్య మార్కులను సాధించారు. సీకర్‌లోని మిగతా కేంద్రాల్లోనూ దాదాపు ఇలాంటి ఫలితాలే కనిపించాయి. ఎంతలా అంటే.. ఈ నగరంలోని కేంద్రాల్లో పరీక్షలు రాసిన వారిలో 650-720 మధ్య స్కోరును ఏకంగా 2,037 మంది సాధించారు. ఇక్కడ ఫలితాలు జాతీయ సగటు కంటే చాలా ఎక్కువగా ఉన్నాయి. నీట్‌లో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీట్లు సాధించాలంటే.. 720 స్కోరుకు గాను.. 650కి పైనే సాధించాల్సి ఉంటుంది. ఈ కోవలో దేశవ్యాప్తంగా టాప్ 30 వేల ర్యాంకులు ఉంటాయి. ఒక్క సీకర్ నగరంలోనే 15 శాతం(2,037 మంది) అభ్యర్థులు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీటుకు అర్హత సాధించడం గమనార్హం..! ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్‌కు అర్హులయ్యే మిగతా 85% మంది దేశవ్యాప్తంగా అన్ని కేంద్రాలకు చెందినవారని భావిస్తే.. తప్పులో కాలేసినట్లే..! హరియాణా, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లోని విద్యార్థులు ఆ స్థాయిలో మార్కులను సాధించారని తాజా ఫలితాలు చెబుతున్నాయి. గతంలో విడుదలైన ఫలితాల్లో హరియాణాలోని హర్‌దయాళ్ పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో ఏడుగురికి ఏకంగా 100 పర్సంటైల్ వచ్చిన విషయం తెలిసిందే..! గత నెల నిర్వహించిన రీటెస్ట్ తర్వాత.. తాజా ఫలితాల్లో మాత్రం ఆ కేంద్రంలో అత్యధిక స్కోరు 682 మాత్రమే..! అది కూడా కేవలం ఒక్క విద్యార్థి ఈ ఘనతను సాధించారు. మరో 13 మంది 600కుపైగా మార్కులు తెచ్చుకున్నారు. హర్‌దయాళ్ పబ్లిక్ స్కూల్‌లో గతంలో నీట్ పరీక్ష రాసిన ఏడుగురు విద్యార్థులు 720 స్కోరు సాధించటం, మరో ఇద్దరికి 718, 719 స్కోర్లు రావడం(నీట్ మూల్యాంకనం ప్రకారం ఈ స్కోర్లు సాధ్యం కానేకాదు) పలు అనుమానాలు రేకెత్తించిన విషయం తెలిసిందే. పలు రాష్ట్రాల్లో పేపర్‌లీక్ అయిందని వార్తలు రావటం, కొందరు విద్యార్థులకు వివాదాస్పద రీతిలో అదనపు



మార్కులు కలపటం వంటి చర్యల నేపథ్యంలో.. నీట్ అంశం మీద సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. 1,563 విద్యార్థులకు మళ్లీ పరీక్ష నిర్వహించాలని ఆదేశించింది. ఈ మేరకు గత నెల 24న నిర్వహించిన నీట్ రీటెస్ట్‌లో 1,563 మందికిగాను దాదాపు 800 మంది మాత్రమే హాజరయ్యారు. సుప్రీంకోర్టు తదుపరి విచారణ సోమవారం జరగనుంది. కాగా.. మే 5న నీట్ పరీక్షకు 24 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు.

ఇకపై రెండంచెలుగా నీట్?

ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ పలు వివాదాలకు కేంద్రంగా మారుతుండటంతో.. ఆ పరీక్ష నిర్వహణలో కీలకమార్పులు చేపట్టాలని కేంద్రప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఇక మీదట ప్రిలిమ్స్, ఫైనల్స్ పద్ధతిలో రెండంచెలుగా ఈ పరీక్షను నిర్వహించటం, రెండింటినీ ఒకే సంస్థకు అప్పగించకుండా.. వేర్వేరు సంస్థలకు బాధ్యతలు ఇవ్వటం వంటి ఆలోచనలు జరుగుతున్నట్లుగా తెలుస్తోంది. దీనిపై కేంద్రానికి చెందిన ఓ సీనియర్ అధికారి మాట్లాడుతూ, "సీట్ల సంఖ్య, ప్రిలిమినరీ స్కోరు ఆధారంగా కటాఫ్‌ను నిర్ణయించటం, సీట్ల సంఖ్యకు నాలుగైదు రెట్ల సంఖ్యలో ఫైనల్‌కు అభ్యర్థులను ఎంపిక చేయటం వంటి అంశాలపై కసరత్తు జరుగుతోంది. ప్రిలిమ్స్‌ను రాతపరీక్షలాగే నిర్వహించినా, ఫైనల్స్‌ను కంప్యూటర్ ఆధారితంగా (సీబీటీ) జరపటం వంటి ప్రత్యామ్నాయాలూ చర్చకు వస్తున్నాయి. ప్రిలిమ్స్‌ను ఎన్టీఏకు అప్పగిస్తే ఫైనల్స్‌ను సీబీఎస్‌ఈ, ఎయిమ్స్ వంటి ఇతర సంస్థలకు అప్పగించటాన్నీ పరిశీలిస్తున్నారు" అని వెల్లడించారు. దీనివల్ల అక్రమాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవటానికి అవకాశం ఉంటుందన్నారు.

యూపీఎస్సీ చైర్మన్ రాజీనామా


- పూజ ఉదంతంతో సంబంధం లేదని యూపీఎస్సీ ప్రకటన

న్యూఢిల్లీ, జూలై 20: యూపీఎస్సీ చైర్మన్ మనోజ్ సోనీ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. మరో ఐదేళ్ల పదవీ కాలం ఉండగానే ఆయన బాధ్యతల నుంచి తప్పుకొన్నారు. వ్యక్తిగత కారణాలతో పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. నకిలీ పత్రాలతో ఉద్యోగానికి ఎంపికైనట్లుగా మహారాష్ట్రకు చెందిన ప్రొబేషనరీ ఐఏఎస్ పూజా ఖేద్కర్‌పై పెద్దఎత్తున ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో.. మనోజ్ సోనీ రాజీనామా చర్చనీయాంశం అయింది. అయితే, పూజా ఉదంతంతో చైర్మన్ నిర్ణయానికి ఏ సంబంధమూ లేదని అధికార వర్గాలు



పేర్కొన్నాయి. మనోజ్ 15 రోజుల కిందటనే నిర్ణయం తీసుకున్నారని, రాష్ట్రపతికి రాజీనామా లేఖ పంపారని, అది ఇంకా ఆమోదం పొందలేదని చెప్పాయి. 59 ఏళ్ల సోనీకి ప్రముఖ విద్యావేత్తగా పేరుంది. 2005-08 మధ్యన గుజరాత్ బరోడాలోని మహరాజా శాయాజీరావ్ యూనివర్సిటీకి, 2009-15 కాలంలో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీకి ఉప కులపతిగా వ్యవహరించారు. దేశంలో అత్యంత చిన్న వయసులో ఉప కులపతి అయిన వ్యక్తిగా రికార్డు సృష్టించారు. 2017లో యూపీఎస్సీ సభ్యుడిగా నియమితులయ్యారు. గత ఏడాది మే 16న చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. అయితే, సోనీ బాధ్యతల పట్ల సంతృప్తిగా లేరని, తనను రిలీవ్ చేయాలని కోరినట్లు సమాచారం. ఇకపై ఆయన సమాజ సేవ, ఆధ్యాత్మిక బాటలో పయనించాలని నిర్ణయించుకున్నట్లు చెబుతున్నారు. కానీ, వరుస కుంభకోణాలతో యూపీఎస్సీ ప్రతిష్ఠ దెబ్బతిన్నదని.. ఇటీవలి కుంభకోణాలలో కమిషన్ ప్రమేయం ఉండడంతో ఆయనను బలవంతంగా తప్పించారని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు. సోనీ ఎప్పుడో రాజీనామా చేస్తే ఇప్పుడా బయటపెట్టేదని ప్రశ్నించారు.

లోకం తీరు



శంషాబాద్‌లో రెండో రోజూ.. 24 విమానాల రద్దు

- విశాఖలో మరో 9 విమానాలు
- మైక్రోసాఫ్ట్ ఎర్రర్‌కు పరిష్కారం లభించినా.. మారని పరిస్థితి

శంషాబాద్ రూరల్/విశాఖపట్నం, న్యూఢిల్లీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మైక్రోసాఫ్ట్ విండోస్ 'బ్లూస్క్రీన్ ఎర్రర్ సమస్యకు పరిష్కారం లభించినా.. శంషాబాద్ విమానాశ్రయంలో రెండో రోజు కూడా పలు విమాన సర్వీసులకు అంతరాయమేర్పడింది. 24 దేశీయ విమానాలు రద్దయ్యాయి. శుక్రవారం ఇదే సమస్యతో 36 దేశీయ, అంతర్జాతీయ విమానాలు రద్దయిన విషయం తెలిసిందే. శుక్రవారం రాత్రే మైక్రోసాఫ్ట్ సమస్య పరిష్కారమైనా.. శనివారం శంషాబాద్‌లో పలు విమానాలు రద్దుకావడం గమనార్హం..! ఇందుకు కొన్ని విమానయాన సంస్థలే కారణమని ఎయిర్‌పోర్ట్ అధికారులు వివరించారు. హైదరాబాద్ రావాల్సిన పలు దేశీయ విమానాలు కూడా రద్దవ్వడంతో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. అటు విశాఖపట్నంలో కూడా 9 విమానాలు రద్దయ్యాయి. మరోవైపు దేశవ్యాప్తంగా విమాన సర్వీసుల సేవల పునరుద్ధరణ పూర్తిస్థాయిలో జరిగినట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ ప్రకటించింది.

క్రౌడ్‌స్ట్రైక్ నకిలీ ఉద్యోగి హల్‌చల్

మైక్రోసాఫ్ట్ బ్లూస్క్రీన్ ఎర్రర్‌కు తానే కారణమంటూ విన్సెంట్ ఫ్లిబస్టియర్ అనే యువకుడు నెట్టింట హల్‌చల్ చేశాడు. తనను తాను క్రౌడ్‌స్ట్రైక్ సైబర్ సెక్యూరిటీ సంస్థ ఉద్యోగిగా పేర్కొంటూ.. ఆ సంస్థ ముందు దిగిన ఓ ఫొటోను ఎక్స్‌లో షేర్ చేశాడు. అతని పోస్టుకు గంటల వ్యవధిలో 4 లక్షలకు పైగా లైక్‌లు వచ్చాయి. ఆ తర్వాత కాసేపటికే.. తనను క్రౌడ్‌స్ట్రైక్ విధుల్లోంచి తొలగించిందని పేర్కొన్నాడు. అయితే.. అతను నకిలీ ఉద్యోగి అని క్రౌడ్‌స్ట్రైక్ సంస్థ వర్గాలు పేర్కొన్నాయి.

మోదీకి మస్క్ అభినందనలు!

న్యూయార్క్, జూలై 20: ప్రముఖ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో 10 కోట్ల మంది ఫాలోవర్లను సంపాదించుకున్న సందర్భంగా ప్రధాని మోదీకి ఆ సంస్థ అధిపతి, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ శుభాకాంక్షలు తెలిపారు. "అత్యధికులు అనుసరించే ప్రపంచ నాయకుడిగా నిలిచిన నరేంద్రమోదీకి అభినందనలు" అంటూ శుక్రవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. గతవారమే మోదీ ఈ మైలురాయిని చేరుకోగా తాజాగా మస్క్ శుభాకాంక్షలు చెప్పారు. కాగా, మోదీ తర్వాత ఎక్స్‌లో అత్యధికులు అనుసరిస్తున్న దేశాధినేతల జాబితాలో... అమెరికా అధ్యక్షుడు జో బైడెన్(38 లక్షలు) ఉన్నారు.

వీధి వ్యాపారుల రిజిస్ట్రేషన్ ఫీజు రద్దు చేయండి: నడ్డా



న్యూఢిల్లీ, జూలై 20: వీధుల్లో ఆహార పదార్థాలు విక్రయించే చిరు వ్యాపారులకు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పి.నడ్డా శుభవార్త చెప్పారు. వారు ప్రతి ఏటా ఆహార సురక్ష, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ)కి చెల్లించాల్సిన నూరు రూపాయల రిజిస్ట్రేషన్ ఫీజును రద్దు చేయాలని ఆ సంస్థకు సూచించారు. శనివారం ఇక్కడి విజ్ఞాన్ భవన్‌లో జరిగిన 1,350 మంది వీధి ఆహార వ్యాపారుల సమావేశంలో ఈ విషయాన్ని ప్రకటించారు. ఏటా రూ.12 లక్షలలోపు టర్నోవర్ ఉన్నవారు వంద రూపాయల రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉండగా దాన్ని మాఫీ చేయాలని సూచించారు. కాగా, దేశ వ్యాప్తంగా స్ట్రీట్ ఫుడ్ వెండర్స్ హబ్‌లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని నడ్డా తెలిపారు. యువత పీఎం స్ట్రీట్ వెండర్స్ ఆత్మనిర్భర్ నిధి (పీఎం స్వానిధి) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

2020లో భారత్‌లో కొవిడ్ కల్లోలం!

- అదనంగా 11.9 లక్షలమంది మృతి
- అంతర్జాతీయ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ, జూలై 20: కొవిడ్ మహమ్మారి కారణంగా 2020లో భారత్‌లో లక్షలాది మంది మరణించారని అంతర్జాతీయ పరిశోధన నివేదిక వెల్లడించింది. 2019తో పోలిస్తే 2020 కొవిడ్ సమయంలో భారత్‌లో 17% ఎక్కువగా అంటే.. 11.9 లక్షల మంది అధికంగా చనిపోయారని తెలిపింది. ఆ ఏడాది దేశంలో అధికారిక కొవిడ్ మరణాల సంఖ్య కంటే 8 రెట్లు, ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా కంటే 1.5 రెట్లు ఈ సంఖ్య ఎక్కువని పేర్కొంది. బ్రిటన్‌లోని ఆక్స్‌ఫర్డ్ వర్సిటీతో పాటు పలు యూనివర్సిటీలకు చెందిన పరిశోధకులు అధ్యయనం చేశారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 డేటాను విశ్లేషించి పరిశోధకులు నివేదిక రూపొందించారు. అయితే కేంద్ర ఆరోగ్య శాఖ దీన్ని కొట్టి పారేసింది. లోపభూయిష్టమైన పద్ధతిలో చేసిన ఈ అధ్యయనం ఆమోదయోగ్యం కాదని పేర్కొంది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నుంచి సేకరించిన సమాచారాన్ని మొత్తం దేశానికి ఆపాదించలేమంది. దేశంలో సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ విశ్వసనీయమైనదని, దీనిప్రకారం 2019లో కంటే 2020లో 4,74,000 మరణాలు ఎక్కువగా నమోదయ్యాయని తెలిపింది.

ఉగ్ర వేటకు పారా కమాండోలు

- 500మందితో ప్రత్యేక కమాండో దళం
- జమ్మూలోని ముష్కరులపై ముట్టడికి సిద్ధం
- 50మంది ఉగ్రవాదులు ఉన్నట్టు గుర్తింపు

జమ్మూ, జూలై 20: ఒక్క నెలలోనే ఆరు ఉగ్ర దాడులు జమ్మూను కుదిపేశాయి. 20 మందికిపైగా ఆర్మీ జవాన్లను పొట్టనబెట్టుకున్న ఈ దాడులను రక్షణ శాఖ సవాల్‌గా తీసుకుంది. జమ్మూ పరిధిలోని దట్టమైన అడవుల్లో దాగి, ఆర్మీపై దొంగ దాడులు చేస్తున్న ముష్కరుల పని పట్టేందుకు 500 మందితో కూడిన పారా కమాండో దళాన్ని రంగంలోకి దించింది. జమ్మూలో యాభైమంది ఉగ్రవాదులు చురుగ్గా ఉన్నట్లు రక్షణ శాఖ ఇప్పటికే గుర్తించింది. వారిని ఏరివేసే ఆపరేషన్‌ను మొదలుపెట్టింది. ముఖ్యంగా ఉగ్రవాదులకు అందుతున్న సహకారంపై దృష్టి పెట్టింది. నిర్మాణ పనులు చేసే కూలీల ద్వారా నెట్‌వర్క్‌ను పెంచుకున్న ఉగ్రవాదులకు ఏఏ మార్గాల్లో ఆహారం, వసతి సౌకర్యాలు లభిస్తున్నాయనేది గుర్తించే పనిలో పడింది. మరోవైపు తాజా ఉగ్ర దాడుల వెనుక ఎవరు ఉన్నారనేదీ రక్షణ శాఖ కూపీ లాగుతోంది. ఈ క్రమంలో...ఉగ్ర కార్యకలాపాల ప్రధాన కేంద్రం కశ్మీర్ నుంచి జమ్మూకు మారిన విషయం బయటపడింది. జమ్మూ,



ఆ ప్రాంత పరిధిలోని రజౌరీ, పూంచ్, రేసీ, కథువా పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాద సంస్థలకు ప్రధాన లక్ష్యాలుగా మారాయి. ఉగ్ర దాడుల్లో కశ్మీర్‌లో గత ఏడాది ఏడుగురు జవాన్లు చనిపోగా, రజౌరీ, పూంచ్‌లో ఇరవై మంది మరణించడం.. జమ్మూకు పెరిగిన ఉగ్ర తాకిడికి నిదర్శనం. పాక్ రెగ్యులర్ విభాగంలో పనిచేసిన ఓ అధికారి శిక్షణలోనే దాడులకు ముష్కరులు తెగబడ్డారని నిఘా విభాగం నివేదికలు వెల్లడిస్తున్నాయి.

ముష్కరుల చేతికి ఆధునిక ఆయుధాలు

తాజా దాడుల్లో అమెరికా తయారీ ఆయుధాలను ఉగ్రవాదులు వాడినట్టు నిఘా వర్గాలు గుర్తించాయి. అఫ్ఘానిస్థాన్‌ను వదిలి వెళ్లేటప్పుడు అక్కడ అమెరికా వదిలిపెట్టిన ఆయుధాలు పాకిస్థాన్ సరిహద్దుల గుండా జమ్మూకశ్మీర్‌లోకి ప్రవేశిస్తున్నాయి. కథువా సహా కొన్ని ప్రాంతాల్లో జరిపిన దాడుల్లో ఉగ్రవాదులు బైనక్యూలర్ సహిత ఎమ్-4 యూఎస్ కార్బన్‌లు, చైనీస్ స్టీల్ కోర్ బుల్లెట్లు వాడారు. దీన్నిబట్టి పాక్ రెగ్యులర్ ఆర్మీలో పనిచేసిన మాజీ అధికారి వద్ద తర్ఫీదు పొందినవారే ఈ దాడుల్లో పాల్గొన్నారని నిఘా వర్గాలు చెబుతున్నాయి. "ఎమ్-4 కార్బన్‌లు, చైనీస్ స్టీల్ కోర్ బుల్లెట్లను వాడి గత ఏడాది ఏప్రిల్ 20న పూంచ్‌లోని టోటాగలీలో జరిపిన అంబుష్‌లో ఐదుగురు జవాన్లు చనిపోయారు. ఉగ్రదాడులకు వీటిని వాడటం అదే మొదటిసారి. జమ్మూలో దాడులు చేసిన ఉగ్రవాదుల వెనుక పాక్ మాజీ ఆర్మీ అధికారులు ఉన్నారని స్పష్టంగా చెప్పలేం. కానీ, ఈ దాడులకు వాడిన ఆయుధాలుగానీ, ఉపయోగించిన గెరిల్లా యుద్ధ పద్ధతులుగానీ మామూలు శిక్షణ ఉన్న ఉగ్రవాదులకు సాధ్యమయ్యే విషయం మాత్రం కాదు. దట్టమైన అడవుల్లో పొంచి ఉండి.. అత్యాధునిక ఆయుధాలతో దాడులు చేస్తుండటం వల్లనే... ముష్కరులను కట్టడి చేయడం కష్టంగా మారింది" అని ఓ సీనియర్ పోలీసు అధికారి విశ్లేషించారు.

రేపటి నుంచి పార్లమెంటు

- తొలిరోజు ఆర్థిక సర్వే.. ఎల్లుండి కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ, జూలై 20: పార్లమెంటు వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం కేంద్ర బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. దానికి ముందురోజు(సోమవారం) ఆర్థిక సర్వేను నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టనున్నారు. వివిధ రంగాల ఆర్థిక స్థితిగతులకు సంబంధించిన గణాంక సమాచారం, విశ్లేషణలతోపాటు ఉపాధి, జీడీపీ వృద్ధి, ద్రవ్యోల్బణం, బడ్జెట్‌లోటు తదితరాలను ఆర్థిక సర్వే వెల్లడించనుంది. ముఖ్య ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ నేతృత్వంలోని బృందం ఆర్థిక సర్వేను రూపొందించింది. మరోవైపు నీట్ ప్రశ్నపత్రం లీకైన కేసు, రైల్వే భద్రత తదితర అంశాలపై ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రతిపక్షాలు సిద్ధమయ్యాయి. ఆగస్టు 12వ తేదీ వరకు కొనసాగే ఈ సమావేశాలలో 90 ఏళ్ల నాటి పౌర విమానయాన చట్టం స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకురావడం సహా ఆరు బిల్లులను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. దీంతోపాటు ప్రస్తుతం కేంద్ర పాలనలో ఉన్న జమ్మూకశ్మీర్ బడ్జెట్‌కు పార్లమెంటు ఆమోదం తెలిపే అవకాశం ఉంది. ఈ సమావేశాలలో రాజకీయ పార్టీలు ఏఏ అంశాలను లేవనెత్తాలనుకుంటున్నాయో తెలుసుకునేందుకు ఆయా పార్టీల ఫ్లోర్‌లీడర్లతో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రభుత్వ వాటా 51 శాతం కంటే తక్కువగా ఉండేలా బ్యాంకింగ్ చట్టాలకు ప్రభుత్వం ఈ సమావేశాలలో సవరణలు తీసుకొచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ రంగ బ్యాంకులను నిర్వీర్యం చేసే చర్యలను అడ్డుకుంటామని కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్ స్పష్టం చేశారు. విపత్తుల నిర్వహణ సవరణ బిల్లు, బాయిలర్స్ బిల్లు, కాఫీ(ప్రచారం, అభివృద్ధి) బిల్లు, రబ్బర్(ప్రచారం, అభివృద్ధి) బిల్లులను కూడా ఈ సమావేశాల్లోనే ప్రవేశపెట్టనున్నారు.



సభలో నినాదాలు వద్దు..

సభాధ్యక్షుడు ఇచ్చే రూలింగ్‌లను ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ, సభలోగానీ, బయటగానీ విమర్శించకూడదని పార్లమెంటు సమావేశాల ప్రారంభానికి ముందు ఎంపీలకు స్పష్టం చేశారు. అలాగే, సభలో వందేమాతరం, జైహింద్ సహా నినాదాలేమీ చేయకూడదని తేల్చిచెప్పారు. సభలో ప్లకార్డులు తదితరాలు ప్రదర్శించడమూ పద్ధతి కాదంటూ.. పార్లమెంటరీ ఆచారాలు, సాంప్రదాయాలు, ఎథిక్స్‌పై సభ్యులు దృష్టిపెట్టేలా 'రాజ్యసభ సభ్యుల కోసం హేండ్ బుక్'ను రాజ్యసభ సెక్రటేరియట్ తీసుకొచ్చింది. ఈనెల 15న జారీ చేసిన రాజ్యసభ బులెటిన్‌లో ఈ అంశాలను ప్రచురించారు. సభా కార్యకలాపాలను హుందాగా, గంభీరంగా నిర్వర్తించేందుకు థ్యాంక్స్ థ్యాంక్యూ, జైహింద్, వందేమాతరం తదితర నినాదాలేమీ సభలో చేయకూడదని బులెటిన్‌లో స్పష్టం చేశారు. సభ పూర్వాపరాలను అనుసరించి సభాపతి రూలింగ్‌లు ఇస్తారని, పూర్వాపరాలు లేనిచోట సాధారణ పార్లమెంటరీ పద్ధతిని అనుసరిస్తారని తెలిపారు. దూషణలు, అభ్యంతరకరమైన, అన్‌పార్లమెంటరీ పదాలు, లేదా వ్యక్తీకరణలను కచ్చితంగా నివారించాలంటూ పార్లమెంటరీ ఎథిక్స్‌ను బులెటిన్‌లో ప్రస్తావించారు. ఏదైనా పదం, లేదా వ్యక్తీకరణ అన్‌పార్లమెంటరీ అని సభాధ్యక్షుడు పేర్కొన్నప్పుడు.. దానిపై ఏ విధమైన చర్చనూ లేవనెత్తే ప్రయత్నం చేయకుండా వెంటనే ఉపసంహరించుకోవాలని స్పష్టంచేశారు.

శాంతి అవినీతిపై ఆరా!



కాసులపేరు, వడ్డాణంతో శారదా పీఠం చిన్నస్వామితో శాంతి (ఫైల్ ఫొటో)

లోతుగా కూపీ లాగుతున్న ప్రభుత్వం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వివాదాస్పదంగా మారిన దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కాళింగరి శాంతి వ్యవహారంపై ప్రభుత్వం లోతైన విచారణ చేస్తోంది. ఆమె ఉద్యోగంలో చేరిన తర్వాత తొలి రెండేళ్లు విశాఖపట్నంలో పనిచేశారు. ఇక్కడినుంచే అక్రమ వ్యవహారాలు, అవినీతి కార్యక్రమాలకు తెర తీశారు. వాటన్నింటిపై విశాఖ అధికారులు అమరావతికి నివేదిక పంపారు. అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జిగా శాంతి పనిచేసినప్పుడు అక్కడా కొన్ని తప్పులు చేసినట్టు సమాచారం అందుకున్న కమిషనర్... ఆ జిల్లా దేవదాయ శాఖ అధికారికి లేఖ రాసి నివేదిక పంపాలని సూచించారు. రెండు రోజులుగా అధికారులు అదే పనిలో ఉన్నారు. తన పరిధి కాని ఆలయాల భూముల లీజు వ్యవహారంలో సిఫారసులు చేసి పాతవారికే అవి దక్కేట్టు శాంతి చేశారని గుర్తించారు.

హుండీల సొమ్ము పక్కదారి

ఆలయాల్లో హుండీల సొమ్ము లెక్కించినప్పుడు అందులో కొంత పక్కదారి పట్టించే వ్యవహారాలు ఆమె హయాంలోనే ఎక్కువగా జరిగాయి. నిత్యం ఆమె వెనుక ఉండే సీనియర్ అసిస్టెంట్ ఇలాంటి పనులు చేస్తున్నట్టు గుర్తించిన ఉన్నతాధికారులు అతనికి షోకాజ్ నోటీసు ఇచ్చారు. ఆయనకు హుండీ లెక్కింపు విధులు వేయవద్దని ఉత్తర్వులు జారీ చేశారు. కానీ శాంతి దానిని ఉల్లంఘించి ఆయనకు మళ్లీ హుండీ లెక్కింపు డ్యూటీలు వేయడంతో శాంతికి కూడా ఉన్నతాధికారులు నోటీసులు ఇచ్చారు.

దృష్టంతా వసూళ్లపైనే

శాంతి ఉద్యోగంలో చేరినప్పటి నుంచి అదనపు ఆదాయంపైనే ఎక్కువగా దృష్టి పెట్టేవారు. డిపార్టుమెంట్‌లో అన్ని విషయాలు తెలిసిన ఓ సీనియర్ అసిస్టెంట్‌ని ఎక్కడికెళ్లినా తోడుగా తీసుకువెళ్లేవారు. ఏ ఆలయానికి తనిఖీకి వెళ్లినా తనకో పట్టు చీర, రూ.10వేల నగదు ఇవ్వాలనే నిబంధన విధించారు. ఎన్‌టీఆర్ జిల్లాకు వెళ్లిన తరువాత అక్కడా ఈ సంప్రదాయం కొనసాగించినట్లు సమాచారం. అసిస్టెంట్ కమిషనర్ హోదాలో ఏడాదికి రూ.5లక్షల ఆదాయం కలిగిన 6-సీ కేటగిరీ ఆలయాల భూములను మాత్రమే లీజుకు ఇచ్చే అధికారం ఉంటుంది. అయితే శాంతి డీసీ, ఆర్‌జేసీల పర్యవేక్షణలో ఉన్న ఆలయ వ్యవహారాల్లోనూ తలదూర్చి, ఆయా భూముల లీజుకు సిఫారసు చేసి వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయి.

మూడు రోజులు జిల్లా సిబ్బంది ధర్నా

దేవదాయ శాఖలో పనిచేసే వారు ఎవరైనా తాను వచ్చినప్పుడు లేచి నిలబడి నమస్కారం చేయకపోతే శాంతి వారిని ఆఫీసుకు పిలిపించుకొని వేధించేవారు. ఈ వేధింపులు తట్టుకోలేక ఆమెను బదిలీ చేయాలంటూ జిల్లా సిబ్బంది మొత్తం ఆమె కార్యాలయం ముందే వరుసగా మూడు రోజులు ధర్నా నిర్వహించారు. డీసీ పుష్పవర్ధన్‌పై ఇసుక చల్లిన ఘటనలోనూ రాజకీయ ఒత్తిళ్ల వల్లే ఆమెపై ఏ చర్యలు తీసుకోలేకపోయారు. విశాఖపట్నంలో వైసీపీ ప్రధాన నాయకుడి అండ ఉందని బాగా ప్రచారం జరగడంతో దానిని ఆమె క్యాష్ చేసుకునే ప్రయత్నం చేశారు. ప్రభుత్వంలో ఎవరికి, ఏ శాఖలో పని ఉన్నా చేసి పెడతానంటూ రాయబేరాలు సాగించి, ఆ పనులు చేసి పెట్టేవారు. దీంతో ప్రొబేషన్ పీరియడ్ కూడా పూర్తికాకముందే విశాలాక్షినగర్‌లో రూ.80 లక్షల విలువైన ఫ్లాట్ కొనుగోలు చేయగలిగారు.

ఒంటి నిండా బంగారం

శాంతి కుటుంబం పూరిగుడిసెలో ఉండేదని, పేదవారని, కట్నం లేకుండా పెళ్లి చేసుకున్నానని ఆమె భర్త మదన్‌గోపాల్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పెళ్లి సమయంలో తనకు పుట్టింటివారు వంద కాసుల బంగారు ఆభరణాలు పెట్టారని శాంతి ప్రచారం చేసుకునేవారు. పుట్టింటివారు అంత ధనవంతులైతే తల్లి కొబ్బరికాయల దుకాణం, తండ్రికి వాచ్‌మెన్ ఉద్యోగం ఎందుకోనని సిబ్బంది గుసగుసలాడుకునేవారు. విశాఖ నుంచి 2022 జూలై 1న బదిలీపై ఎన్‌టీఆర్ జిల్లాకు వెళ్లారు. అక్కడికి వెళ్లగానే విల్లా కొనుగోలు చేశారు. ఉద్యోగంలో చేరిన మూడేళ్లకే ఫ్లాటు, బంగారం, కారు, కోట్ల రూపాయల విలువైన విల్లా కొనేంత ఆదాయం ఎలా వచ్చిందనే దానిపైనే ఇప్పుడు ప్రభుత్వం ఆరా తీస్తోంది.



నెల్లూరు స్వర్ణాల చెరువులో సూపర్‌సిక్స్ రొట్టెల వద్ద ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

భక్తిశ్రద్ధలతో తహలీఫాతేహా

» నాలుగో రోజూ రొట్టెల పండుగకు పోటెత్తిన భక్తులు

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 20: నెల్లూరులో జరుగుతున్న రొట్టెలపండుగలో నాల్గవ రోజు శనివారం బారాషహీద్‌లకు తహలీఫాతేహా భక్తిశ్రద్ధలతో జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున జరిగిన గంధ మహోత్సవానికి ముగింపుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. దర్గాలో గంధం చదివింపునకు ప్రత్యేక పూజలు, దువా నిర్వహించారు. అనంతరం బారాషహీద్‌లకు గంధం లేపనం చేసి దువా చేశారు. మరోవైపు శనివారం కూడా చెదరని విశ్వాసంతో మది నిండా కోరికల రొట్టెల కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. తెల్లవారుజాము 4 గంటల నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది. స్వర్ణాల చెరువులో పవిత్ర స్నానాలు చేసి వరాల రొట్టెలను పట్టుకున్నారు. కాగా, చెరువులో ఉద్యోగం, ప్రమోషన్ రొట్టెలకు డిమాండ్ పెరిగింది. రాష్ట్రం సుభిక్షంగా ఉండి, ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలని కోరుతూ బారాషహీద్‌లను ప్రార్థించి స్వర్ణాల చెరువులో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సూపర్ సిక్స్ (6 రొట్టెలు) రొట్టెలను పట్టుకున్నారు.

భక్తుల ముఖాల్లో ఆనందం కనిపిస్తోంది

» తిరుమల శ్రీవారిని దర్శించుకున్న హోంమంత్రి అనిత



తిరుమల ఆలయం వెలుపల భక్తులతో మాట్లాడుతున్న హోంమంత్రి అనిత

తిరుమల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన భక్తుల ముఖాల్లో ఆనందం కనిపిస్తోందని హోంమంత్రి అనిత అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం కాలినడకన తిరుమలకు చేరుకున్న ఆమె శనివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వదించగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. అనంతరం అనిత ఆలయం ముందు భక్తులతో మాట్లాడారు. టీటీడీ అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. భక్తులు చాలా ప్రశాంతంగా, ఆనందంగా ఉన్నారన్నారు. గతంలో కంటే ప్రస్తుతం ఏర్పాట్లు బాగున్నాయని, లడ్డూ, అన్నప్రసాదాల్లో నాణ్యత పెరిగిందని భక్తులు చెబుతున్నారన్నారు. ఇదే ఆనందం భక్తుల్లో నిత్యం ఉండాలని కోరుకుంటున్నానన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎన్డీయే కూటమిపై శ్రీవారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నట్టు చెప్పారు. స్వామి ఆశీస్సులుంటే రాష్ట్రం అభివృద్ధి బాటలో దూసుకుపోతుందనే నమ్మకం ఉందన్నారు.

సీపీఐ శ్రేణులపై కేసులు ఎత్తివేయండి

» మంత్రి లోకేశ్‌కు రామకృష్ణ, ముప్పాళ్ల విజ్ఞప్తి

అమరావతి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన వివిధ ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్న సీపీఐ, అనుబంధ ప్రజాసంఘాల శ్రేణులపై నమోదు చేసిన కేసులను కొత్త ప్రభుత్వం తొలగించాలని సీపీఐ రాష్ట్ర సమితి విజ్ఞప్తి చేసింది. ఈ అంశంపై ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు శుక్రవారం రాత్రి రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి చర్చించారు. తమ పార్టీ శ్రేణులపై నమోదైన కేసుల వివరాలతో కూడిన జాబితాను మంత్రికి అందజేశారు. దీనిపై లోకేశ్ సానుకూలంగా స్పందించారని, పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు సీపీఐ నేతలు తెలిపారు.



సమీరా నజీర్‌కు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈవో వేమూరి గోపి

అమరేశ్వరుని సన్నిధిలో గవర్నర్ సతీమణి సమీరా నజీర్

అమరావతి, జూలై 20: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ సతీమణి, రాష్ట్ర ప్రథమ మహిళ సమీరా నజీర్ శనివారం రాజధాని అమరావతిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరలింగేశ్వర ఆలయాన్ని దర్శించారు. ఈవో వేమూరి గోపి, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం సమీరా నజీర్‌కు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఆలయంలో జరిగిన అన్నప్రసాద వితరణలోనూ ఆమె పాల్గొని భక్తులకు అన్న ప్రసాదాన్ని వడ్డించారు.



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

సింహగిరి ప్రదక్షిణకు పోటెత్తిన భక్తజనం

అప్పన్న పుష్పరథాన్ని ప్రారంభించిన అనువంశిక ధర్మకర్త అశోక్‌గజపతిరాజు

సింహాచలం, జూలై 20: ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని సింహాచలంలో వరాహ లక్ష్మీ నృసింహస్వామి కొలువైన సింహగిరి ప్రదక్షిణకు శనివారం భక్తులు పోటెత్తారు. ఏటా ఆషాఢ శుక్లపక్ష చతుర్దశినాడు సింహగిరి ప్రదక్షిణ(సుమారు 32 కిలోమీటర్లు) ప్రారంభించి మరుసటి రోజు పౌర్ణమినాడు ముగిస్తారు. దేవస్థానం అనువంశిక ధర్మకర్త, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు శనివారం సాయంత్రం పూజలు చేసి అప్పన్న పుష్పరథానికి జెండా ఊపడంతో సింహగిరి ప్రదక్షిణ ఉత్సవం ప్రారంభమైంది. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు పది లక్షల మంది పాల్గొన్నట్టు అధికారులు అంచనా వేశారు.

ముచ్చుమర్రి ఉదంతంలో అనూహ్య ఘటన

» పోలీసుల అదుపులోని వ్యక్తి అనుమానాస్పద మృతి

నంద్యాల (నూనెపల్లె), జూలై 20: నంద్యాల జిల్లా ముచ్చుమర్రి బాలిక ఉదంతంలో అనూహ్య సంఘటన చోటు చేసుకుంది. కేసు విచారణలో భాగంగా పోలీసులు అదుపులోకి తీసుకున్నవారిలో ఓ వ్యక్తి శనివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం రేపింది. బాలిక వాసంతిపై హత్యాచారం చేసిన వారిలో ఓ బాలుడి మేనమామలు హుసేని, ఏసును నంద్యాల సీసీఎస్ పోలీసులు విచారణ నిమిత్తం రెండు రోజుల క్రితం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. హుసేని అస్వస్థతకు గురవడంతో అప్రమత్తమైన పోలీసులు అతన్ని నంద్యాల జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. శనివారం ఉదయం 8:45గంటలకు హుసేనిని ఆసుపత్రికి తీసుకురాగా అప్పటికే అతను మృతి చెందినట్టు వైద్యులు వెల్లడించారు. దీనిపై నంద్యాల డీఎస్పీ రవీంద్రనాథ్ రెడ్డి, సీఐలను పాత్రికేయులు వివరణ కోరగా తమకేమీ తెలియదని చెప్పారు. అయితే.. హుసేని మృతదేహాన్ని క్యాజువాలిటీలో ఉంచినా మీడియాను, చికిత్స కోసం వచ్చిన రోగులను లోపలికి అనుమతించక పోవడం, మృతుడి శరీరంపై లాఠీ గాయాలు ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆ తర్వాత హుసేని మృతదేహాన్ని గుట్టు చప్పుడుకాకుండా మార్చురీకి, పోస్టుమార్టం అనంతరం గ్రామానికి తరలించారు. హుసేని కుటుంబసభ్యులు, బంధువుల సమక్షంలో శనివారం రాత్రి అంత్యక్రియలు నిర్వహించారు.

గుండెనొప్పిగా ఉందన్నాడు: ఎస్పీ

నంద్యాల క్రైం, జూలై 20: హుసేని మృతిపై నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా శనివారం రాత్రి విలేకరుల సమావేశం నిర్వహించారు. విచారణలో భాగంగా హుసేనిని నందికొట్కూరుకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో తలముడిపి బాట వద్ద పారిపోయేందుకు యత్నించాడని, వెంబడించి పట్టుకోగా గుండె నొప్పిగా ఉందన్నాడని తెలిపారు. వెంటనే అతన్ని నంద్యాల జీజీహెచ్‌కు తరలించామని ఎస్పీ వెల్లడించారు.

ఆ 5 వైద్య కళాశాలల్లో అడ్మిషన్లకు అనుమతివ్వండి

» నిర్మాణాలు పూర్తి చేస్తాం... సిబ్బందిని నియమిస్తాం

» ఎన్ఎంసీకి లేఖ రాసిన ఐదు కాలేజీల ప్రిన్సిపాళ్లు

» ఎన్ఎంసీ సరేనంటే మరో 500 సీట్లు అందుబాటులోకి

» గత ప్రభుత్వం తప్పిదాలతో నిలిచిన అనుమతి

అమరావతి, జూలై 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ఐదు వైద్య కళాశాలల్లో అడ్మిషన్ల అంశంలో రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. పాడేరు, మర్కాపురం, మదనపల్లి, ఆదోని, పులివెందుల మెడికల్ కాలేజీల్లో సిబ్బంది కొరత, నిర్మాణాలు పూర్తి కాలేదన్న కారణాలతో నేషనల్ మెడికల్ కౌన్సిల్ 2024-25 ఏడాదికి అడ్మిషన్లకు అనుమతి నిరాకరించింది. పైగా ఈ కాలేజీల వల్ల ప్రభుత్వంపై ఏటా దాదాపు రూ.600 కోట్ల ఆర్థిక భారం పడనుంది. ఈ నేపథ్యంలో కొత్త ప్రభుత్వం విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ఐదు కాలేజీల్లో అడ్మిషన్లకు వెళ్లాలని నిర్ణయించింది. కనీసం కాలేజీకి 100 సీట్లు కేటాయించాలని కోరాల్సిందిగా ప్రభుత్వం సూచించడంతో ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లు ఎన్ఎంసీకి లేఖ రాశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నియామకాలు ఆలస్యం అయ్యాయని, కాలేజీల నిర్మాణాలు పూర్తి కాలేదని ఆ లేఖలో పేర్కొన్నారు. జూలై చివరి నాటికి కాలేజీల నిర్మాణాలు పూర్తి చేయడంతో పాటు వైద్య, బోధనా సిబ్బందిని అందుబాటులో ఉంచుతామని అందులో వెల్లడించారు. 2024-25 ఏడాదికి అడ్మిషన్లకు అనుమతి ఇవ్వాలని విన్నవించారు. దీంతో ఎన్ఎంసీ అధికారులు మరోసారి ఆన్‌లైన్‌లో తనిఖీలు చేపట్టనున్నారు. ఎన్ఎంసీ నుంచి అనుమతి లభిస్తే ఈ ఏడాది మరో 500 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వస్తాయి. ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుందని సీఎం చంద్రబాబుకు, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

గన్ పేలి సీఐఎస్ఎఫ్ జవాను దుర్మరణం

» మృతుడు నంద్యాల జిల్లా అవుకు వాసి

» సంగారెడ్డి జిల్లా బీడీఎల్‌లో ఘటన



వెంకటేష్

అవుకు/పటాన్‌చెరు రూరల్, జూలై 20: తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లాలో ప్రమాదవశాత్తూ కావడంతో నంద్యాల జిల్లాకు చెందిన జవాను దుర్మరణం పాలయ్యాడు. బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బీడీఎల్‌లో విధులు నిర్వహిస్తున్న సీఐఎస్ఎఫ్ జవాన్ వెంకటేశ్వర్లు(34) స్వస్థలం నంద్యాల జిల్లా అవుకు మండలం జూనుంతల గ్రామం. బీడీఎల్ సీఐ స్వామి గౌడ్ అందించిన వివరాల ప్రకారం.. బదిలీల్లో భాగంగా వెంకటేశ్వర్లు గతేడాది బీడీఎల్‌కు వచ్చారు. శుక్రవారం రాత్రి విధి నిర్వహణ నిమిత్తం వెళ్లి శనివారం ఉదయం సీఐఎస్ఎఫ్ వాహనంలో బీడీఎల్ శివార్లో ఉన్న క్యాంప్ కార్యాలయానికి చేరుకుని బస్సు దిగుతున్నారు. ఈ క్రమంలో చేతిలోని తుపాకీ ప్రమాదవశాత్తు పేలి బుల్లెట్ గడ్డం కింది నుంచి తలలోకి దూసుకెళ్లింది. దీంతో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న స్వామిగౌడ్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. వెంకటేశ్వర్లుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. సమాచారం అందుకున్న వెంకటేష్ తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులతో కలసి హైదరాబాద్ వెళ్లారు. ఆదివారం ఉదయానికి జవాన్ వెంకటేష్ మృతదేహం జూనుంతలకు చేరుకోనుంది.

22లోగా రిపోర్టు చేయకుంటే ఇంజనీరింగ్ సీటు రద్దు

» సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ స్పష్టీకరణ

అమరావతి, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులు నిర్దేశిత గడువులోగా కాలేజీల్లో, వెబ్‌సైట్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని, లేనిపక్షంలో సీటు రద్దు అవుతుందని సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ బి.నవ్య స్పష్టం చేశారు. ఈ నెల 17న తొలిదశ కౌన్సెలింగ్ సీట్లు కేటాయించామని, విద్యార్థులు 22లోగా కాలేజీల్లో, ఆన్‌లైన్‌లో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. ఒకవేళ రిపోర్టు చేయకపోతే ఆ సీటు రెండో విడత కౌన్సెలింగ్‌కు ఖాళీగా ఉన్నట్లు కనిపిస్తుందని తెలిపారు. కాలేజీల యాజమాన్యాలు కూడా విద్యార్థులు రిపోర్టు చేసిన వెంటనే ఆన్‌లైన్‌లో వివరాలు అప్‌డేట్ చేయాలని, 23నాటికి అడ్మిషన్లు పొందిన అందరు విద్యార్థుల వివరాలు కచ్చితంగా అప్‌డేట్ చేయాలని సూచించారు.

ప్రభుత్వ బడుల్లో టోఫెల్ బోధన రద్దు చేయాలి

» టీఎన్‌యూఎస్ డిమాండ్

అమరావతి, జూలై 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మూడో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు టోఫెల్ బోధన, పరీక్షల ప్రక్రియను రద్దుచేయాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, రామశెట్టి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ టోఫెల్ కార్యక్రమం వృథాగా మారిందని, తూతూమంత్రంగా వాట్సాప్‌లో పదాలు పంపడం, వాటిని పిల్లలకు వినిపించడం అంతా నిరుపయోగ ప్రక్రియగా మారిందని ఆరోపించారు.

ఆకార్ పటేల్ : 'నియంత అంతం'

వర్తమానంతో సరిపోలిన ఊహాచిత్రం

భవిష్య పురాణం అని ఒకటుంది. అందులో విక్టోరియా అనే రాణి భవిష్యత్తులో భారతదేశాన్ని పాలిస్తుందని రాశారట. అది నిజం అనుకునేవాళ్లు విక్టోరియా మహారాణి గురించి ఎప్పుడో చెప్పారని పౌరాణికులను మెచ్చుకుంటారు. అనుమానం ఉన్న వాళ్లు, ఆ పురాణంలోని అటువంటి ఆధునిక విశేషాలన్నీ తరువాత చేర్చినవని తెలుసుకుంటారు. వర్తమానాన్ని గతంలోకి పంపి, దాన్ని భవిష్యత్తుగా జోస్యం చెప్పగలగడం అమోఘమైన విద్య. మన 'ఘనత' నంతటినీ మూటగట్టి దాచిపెట్టిన గతకాలాన్ని మరింత గొప్ప చేయడానికి అది పనికివస్తుంది.

ఆకార్ పటేల్ రాసిన 'ఆఫ్టర్ మెస్సయ్య' నవలలో కూడా భవిష్య పురాణాన్ని పోలిన చమత్కారం కొంత ఉన్నది. విషయం మాత్రం పూర్తి భిన్నం. నవలలో స్థలకాలాలు ఏవీ నిర్దిష్టంగా చెప్పలేదు కానీ, ఇది రేపటి కాలాన్ని, సమాజాన్ని ఊహిస్తూ చేసిన ఫ్యూచరిస్టు రచన లాగా కనిపిస్తుంది. కానీ, కాల్పనిక భవిష్యత్తు పేరుతో రచయిత చెప్పింది మాత్రం పచ్చి వర్తమానాన్నే. ఎవరి తదనంతరాన్ని నవల చర్చించిందో, వారు పీఠం మీద కొనసాగుతున్నారు. సృజనాత్మకరచనలో ఊహలకు ఉండే అపరిమితత్వాన్ని రాజకీయ వివేకంతో ఆకార్ పటేల్ ఉపయోగించుకున్నారు. అధికార కేంద్రాన్ని ఆవరించుకుని ఉన్న హింసాబీభత్సాలను వ్యంగ్యంగా, గుంభనంగా, కొంటెగా, సాహసంగా చిత్రించే కథనాన్ని ఇందులో రచయిత ఆశ్రయించారు. దాదాపు ఏడాది కిందట ఆయన ఈ రచన చేశారు కాబట్టి, దీనిపై 2024 ఎన్నికల ఫలితాల, పర్యవసానాల ప్రభావం లేదు.

'నియంత అంతం' పేరుతో ఈ నవల 'మలుపు బుక్స్' ప్రచురణగా ఈ మధ్యే తెలుగులో వచ్చింది. 'వీక్షణం' సంపాదకులు, ప్రసిద్ధ రచయిత ఎన్. వేణుగోపాల్ దీనిని సమర్థంగా, సరళంగా అనువదించారు. తెలుగు పాఠకులకు అంతగా పరిచయం కాని రాజకీయ వాతావరణాన్ని, సన్నివేశాలను అనువదించడంలోను, మూలరచయిత ఉద్దేశించిన ధ్వని, వ్యంగ్యాలు తగ్గకుండా చూడడంలోను వేణుగోపాల్ నైపుణ్యం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

ఈ నవల పఠనానుభవం ప్రత్యేకమైనది. నవలలోని పాత్రలు, వాటి స్వభావాలు పరిచయం అవుతున్న క్రమంలో రచయిత ఉద్దేశించిన వాస్తవ వ్యక్తులు స్ఫురించి, రెండో అర్థాన్ని కనిపెడుతున్న రహస్యానుభూతి మొదట కలుగుతుంది. తరువాత తరువాత, కథాగమనంలోను, పాత్రల సంభాషణల్లోనూ వ్యక్తమయ్యే దేశ అధికార వ్యవస్థల ప్రక్రియలను, వాటి లోగుట్టులను చదువుతున్నప్పుడు భయం వేస్తుంది. మనం వార్తల ద్వారా, ఇతరత్రా తెలుసుకున్న సంఘటనలు ఆయా సన్నివేశాలలోకి పొదుచుకువచ్చి, మనకు ఒక జలదరింపు కలుగుతుంది. మొత్తంగా ఏదో ఒక అవగాహన కలుగుతుంది కానీ, ఆ తెలివిడి చాలా విచారాన్ని కూడా కలిగిస్తుంది.

పెద్దాయన చనిపోవడంతో కథ మొదలవుతుంది. ఆయన ఆకస్మిక మరణంతో ఉత్పన్నమయిన పరిస్థితితో తొలి అధ్యాయాలు కొనసాగుతాయి. జయేష్ షా, స్వామి అనే ఇద్దరు పెద్దాయన స్థానం కోసం పోటీపడతారు. వారిలో జయేష్ షా, పెద్దాయనకు కుడిభుజంగా ఉండేవాడు. కొంతకాలం అంతరంగిక భద్రతాశాఖ నిర్వహించాడు కూడా. మనుషులను, పరిణామాలను నియంత్రించడంలో ఆయనకు తనదైన నిర్దాక్షిణ్యమైన పద్ధతులున్నాయి. రాష్ట్రాలలో పనిచేస్తూ ఉండిన స్వామి కూడా కొంత బలం పుంజుకుంటున్న నాయకుడు. ఈ ఇద్దరి తగవు తెగక, తాత్కాలిక ఏర్పాటుగా మీరా అనే సామాజిక కార్యకర్తను ప్రధాని



> నవలలో స్థలకాలాలు ఏవీ నిర్దిష్టంగా చెప్పలేదు కానీ, ఇది రేపటి కాలాన్ని, సమాజాన్ని ఊహిస్తూ చేసిన ఫ్యూచరిస్టు రచనలాగా కనిపిస్తుంది. కానీ, కాల్పనిక భవిష్యత్తు పేరుతో రచయిత చెప్పింది మాత్రం పచ్చి వర్తమానాన్నే. ఎవరి తదనంతరాన్ని నవల చర్చించిందో, వారు పీఠం మీద కొనసాగుతున్నారు. సృజనాత్మకరచనలో ఊహలకు ఉండే అపరిమితత్వాన్ని రాజకీయ వివేకంతో ఆకార్ పటేల్ ఉపయోగించుకున్నారు. అధికార కేంద్రాన్ని ఆవరించుకుని ఉన్న హింసాబీభత్సాలను వ్యంగ్యంగా, గుంభనంగా, కొంటెగా, సాహసంగా చిత్రించే కథనాన్ని ఇందులో రచయిత ఆశ్రయించారు.

చేయాలనుకుంటారు. చనిపోయిన సీనియర్ నాయకుని కూతురు ఆమె. మీరా ఆదివాసులలో వారి హక్కుల కోసం పనిచేస్తూ ఉంటుంది. పదవిని స్వీకరించడానికి తటపటాయిస్తున్న మీరా మీద ఒత్తిడి తేవడానికి, ఆమె లాయర్ కూతురును జయేష్ షా అరెస్ట్ చేయిస్తాడు. పదవి స్వీకరించి ఏదన్నా చేయవచ్చునేమో అన్న చిన్న ఆశతో మీరా ప్రధాని అవుతుంది. ఆదివాసుల నుంచి భూమిని ప్రభుత్వం తీసుకోవడానికి వీలులేకుండా ఒక బిల్లు తెద్దామనుకుంటుంది. దానికి అన్ని వైపుల నుంచి, చివరకు ప్రతి పక్షం నుంచి కూడా వ్యతిరేకత వస్తుంది. ఏకుమేకైన మీరాను దింపడానికి రిసార్టు రాజకీయం మొదలవుతుంది. చివరకు, పదవి నుంచి మీరా దిగిపోయి, తిరిగి ఆదివాసీ సమాజంలో పని చేయాలని నిర్ణయించుకుంటుంది.

నిజానికి ఈ కథలోని ఇతివృత్తం తప్ప, కథాగమనం ఏమంత గొప్పది కాదు. ఆకార్ పటేల్ ఈ నవల ద్వారా ప్రధానంగా చేసినవి రెండు. ఒకటి, పెద్దాయన చేసిన విధ్వంసం ఏమిటో ఆయన మరణానంతర సన్నివేశాల ద్వారా చెప్పదలచుకున్నారు. రెండు, సంకోచిస్తూనే ప్రధాని పదవి స్వీకరించిన మీరా పాత్ర ద్వారా, కీలక అధికార స్థానాల్లోకి మంచి వ్యక్తులు వచ్చినా వారు తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కొంటారనీ సూచించదలచారు. మొదటి అంశం ద్వారా, వర్తమానంలో చూస్తున్న దేశస్థితిగతులను తీవ్ర విమర్శనాత్మకంగా చిత్రించారు. రెండో అంశం ద్వారా, రాజ్యం, ప్రభుత్వం అధికారికంగానూ, అనధికారికంగానూ పనిచేసే విధానం, అందులో ప్రాబల్యాలు, ప్రయోజనాలు వ్యక్తమయ్యే తీరు పటేల్ చెప్పారు.

కథాసారాంశాన్ని చదివినవారికి, ఆయా పాత్రలు ఎవరెవరిని పోలి ఉన్నాయో తెలుసుకోవడం కష్టమేమీ కాదు. రచయిత, తన మూలపాత్రల గురించిన స్ఫురణలను ఏ మాత్రం నియంత్రించాలనుకోలేదు. కథారంభంలో, చనిపోవడానికి ముందు, ఒక ప్రభుత్వాస్పత్రి ప్రారంభోత్సవానికి పెద్దాయన అతిథిగా వస్తారు. అక్కడి సన్నివేశాన్ని రచయిత ఇట్లా వర్ణించారు. "...అక్కడ రెండు పెద్ద తెరల మీద జాతికి, ప్రత్యేకంగా వైద్య ఆరోగ్యరంగాలకు పెద్దాయన అందించిన కానుకల దృశ్యాలున్నాయి. ఆయన గతానికి సంబంధించిన కల్పనతో కూడిన సమాచారం ఉంది. ఒక చిన్న పిల్లవాడు ఒక పనికిరాని ఆస్పత్రి సిబ్బందిని మందలిస్తున్న నలుపు తెలుపు చిత్రాన్ని ప్రదర్శిస్తున్నారు. మరొక చిత్రంలో పెద్దాయన పోలికలతో ఉన్న యువకుడు కొవ్వొత్తి వెలుగులో వైద్యశాస్త్రగ్రంథాలను శ్రద్ధగాచదువుతున్నాడు. ఈ చిత్రాలకుతోడుగా సైనికుల కవాతు శబ్దం వినిపిస్తోంది." పెద్దాయన చరిత్రను "నిర్మించడానికి" యంత్రాంగం పడుతున్న పాట్లు అవి. బాల్యంలోను, యవ్వనంలోనూ వైద్య శాస్త్రాన్ని ఆ పెద్దాయన అధ్యయనం చేశాడట. ఆ వేడుకలో ఆయన ఆహార్యం కూడా వైద్యులదే. మరి సైనికుల కవాతు శబ్దం ఎందుకు? అదే ఆకార్ పటేల్ ప్రత్యేకత!

పెద్దాయన హయాంలో ప్రధానమంత్రి కార్యాలయం (ప్రమంకా) సమూలంగా మారిపోయింది. అన్ని మంత్రిత్వశాఖలూ ఆయన ఆఫీసునుంచే పనిచేసేవి. "పెద్దాయన నేతృత్వంలో జరిగే భారీ ఘటనలూ, ఉత్సవాలూ రూపొందించడం మీదనే మంత్రిత్వ శాఖలు దృష్టి పెట్టేవి." "అప్పటికే పూర్తిగా తయారై, వేలు పెట్టడానికి అవకాశం లేని స్థితిలో మాత్రమే ఫైళ్లు మంత్రుల సంతకాల కోసం వాళ్ల దగ్గరికి వచ్చేవి." "పెద్దాయనకు వీలయినప్పుడు, లేదా ఆయనకు చెయ్యడానికి మరే పనీ లేనప్పుడు మంత్రివర్గ సమావేశాలు అనేవి జరుగుతుండేవి." ఇక ప్రజల అనుభవంలోకి వచ్చిన పెద్దాయన పాలనలో "అసమ్మతి అనే మాటకూ దేశద్రోహం అనే మాటకూ మధ్య విభజనరేఖ చెరిపివేయబడింది. పెద్దాయన అనే వ్యక్తికి అతీతంగా, బైట రాజ్యం అనేదే లేదనే పరిస్థితి తలెత్తింది". మరి, జయేష్ షా ఎట్లా ఉంటాడు? "..ఆయన మనుషులను పిలిచి కూచోబెట్టి మాట్లాడుతాడు. ఒత్తిడి చేస్తాడు. బలవంతపెడతాడు. సరే ఎట్లాగూ బెదిరింపులూ సాగుతాయి. ఆ గదిలో పుస్తకమనేది లేదు". అవసరమైన మనుషులందరి వ్యక్తిగత విశేషాలను, సామాజిక మాధ్యమాలలో నడవడిని నిశితంగా పసిగట్టి, వాటి ఆధారంగా చర్యలు తీసుకునే చాణక్యుడు జయేష్ షా. ప్రశాంతంగా ఎంతటి కర్కశమైన పనులైన చేయగల వ్యక్తిగా ఆ పాత్రను పటేల్ చిత్రించారు.

ప్రధానమంత్రి పదవి స్వీకరించే క్రమంలోను, ఆ తరువాత బాధ్యతలను నెరవేర్చడం మొదలుపెట్టిన కొత్తలోను మీరా, ప్రమంకా సిబ్బందితో సంభాషిస్తుంది. రిటైర్ కాబోతున్న ఉన్నతోద్యోగి జోషి, ఆ స్థానంలోకి రాబోతున్న ఆయేషా, ఆమె సహాయకుడు ప్రభు, మేనేజర్ మీరాతో ఎక్కువ సంభాషణలు చేస్తారు. ఒక సందర్భంలో అటార్నీ జనరల్ మీరాతో సంభాషిస్తారు. ఈ మాటల్లో అధికార స్వభావం గురించిన అనేక అనుభవ సత్యాలు వ్యక్తమవుతాయి. రాజ్యం ఎప్పుడూ ఎవరో తన మీద దాడి చేయబోతున్నట్టు, తాను బలహీనంగా ఉన్నట్టు భావించుకుంటుందని, ఆదర్శానికీ పాలనకూ ఘర్షణ ఏర్పడిందని, పాలనను పటిష్ఠం చేసుకోవడం కోసం రాజ్యం అధికారాలు పెంచుకుంటూ పోయిందని అటార్నీ జనరల్ ఒక విశ్లేషణ ఇస్తాడు. "రాజ్యం అనేది హింసాత్మక సాధనం. అదేమీ ఆదర్శ సాధనం కాదు. అది ఎన్జీవో కాదు... రాజ్యం అంటే హింస మీద గుత్తాధిపత్య అధికారం ఉన్న సంస్థ అని ఎవరో వర్ణించారు. దాన్ని అలాగే నిర్వచించాలి. హింస ద్వారా నిర్వచించాలి. అది హింసాత్మకంగా ఉండడం మాత్రమే కాదు, హింసను తన చేతుల్లో గుత్తాధికారంగా మార్చుకుంటుంది. అంటే అర్థం, దాని గుత్తాధిపత్యాన్ని ప్రశ్నించే వాళ్ల మీద దాడి చేస్తుంది" అను భవజ్ఞుడైన ప్రమంకా మేనేజర్ ఒక సంభాషణలో మీరాతో అంటాడు. "..రాజ్యం అనేది ఒక హింసాత్మక రాజకీయ జంతువు. అసలు అది అట్లా ఉన్నందుకు ఉన్నత వర్గాలు దాన్ని చాలా ప్రశంసిస్తాయి. ప్రత్యేకంగా పెద్దాయన వంటి వ్యక్తులు దానికి నాయకత్వం వహిస్తే ఇంకా మెచ్చుకుంటాయి... హింసను ఎంత విజయవంతంగా వాడితే అంతగా ప్రోత్సాహకరమైన ప్రశంస అందుతుంది" అని ఆ మేనేజర్ మీరాకు కీలకసందర్భంలో స్పష్టత ఇస్తాడు.

> ఈ నవలలో పెద్దాయన పాలన ప్రజల వ్యతిరేకత వల్ల పోలేదు. మీరాను ప్రజలు ఎన్నుకోలేదు. రెండు పరిణామాలూ ప్రమాదవశాత్తూ జరిగినవే. అయితే, ప్రధానమంత్రి స్థానంలో ఒక కొత్త వ్యక్తి, ఆదర్శాలు మాత్రమే తెలిసిన వ్యక్తి రావడం వల్ల, ఆమె వైపునుంచి అధికారకేంద్రాల సందర్శన పాఠకులకు సాధ్యమైంది. అప్పటి దాకా ఉన్న ఒక స్వాతిశయమూ స్వీయ ఆరాధకుడూ అయిన జనరంజక నియంత వ్యవహార సరళి ఎట్లా ఉన్నది, ఆయన చుట్టూ ఎటువంటి వ్యవస్థ పనిచేస్తున్నది చెప్పడానికి కూడా ఆస్కారం కలిగింది.

ఈ నవలలో పెద్దాయన పాలన ప్రజల వ్యతిరేకత వల్ల పోలేదు. మీరాను ప్రజలు ఎన్నుకోలేదు. రెండుపరిణామాలూ ప్రమాదవశాత్తూ జరిగినవే. అయితే, ప్రధానమంత్రి స్థానంలో ఒక కొత్త వ్యక్తి, ఆదర్శాలు మాత్రమే తెలిసిన వ్యక్తి రావడం వల్ల, ఆమె వైపు నుంచి అధికారకేంద్రాల సందర్శన పాఠకులకు సాధ్యమైంది. అప్పటి దాకా ఉన్న ఒక స్వాతిశయమూ స్వీయ ఆరాధకుడూ అయిన ఒక జనరంజక నియంత వ్యవహార సరళి ఎట్లా ఉన్నది, ఆయన చుట్టూ ఎటువంటి వ్యవస్థ పనిచేస్తున్నది చెప్పడానికి కూడా ఆస్కారం కలిగింది. ఆకార్ పటేల్ రాజకీయ విశ్వాసాలేమిటో తెలియదు కానీ, ప్రస్తుత వ్యవస్థ మరమ్మత్తుకు, ఆదర్శ వ్యక్తుల చేతిలో సంస్కరణకు ఆస్కారం ఇవ్వదని ఆయన ఈ నవల ముగింపులో చెప్పదలచుకున్నారా? లేక, సాధికారతా సాధన అన్నది అట్టడుగు నుంచే మొదలు కావాలని కథానాయిక ద్వారా భావించారా?



• కె. శ్రీనివాస్


'నియంత అంతం'
రచయిత: ఆకార్ పటేల్
అనువాదం: ఎన్. వేణుగోపాల్
ప్రచురణ: మలుపు బుక్స్
ఫోన్: 63059 91831

ఎప్పుడో వందేళ్ళనాడు శరత్‌చంద్ర చటర్జీ రచించిన బెంగాలీ నవల 'దేవదాసు' ఆధారంగా బెంగాలీ, హిందీ, తెలుగు, తమిళం, మలయాళం భాషలలో సుమారు డజను చలన చిత్రాలు తయారైనాయి. 1928లో ఇంకా సినిమాలు మాటలు నేర్వకముందే– ఒక మూకీ చిత్రం కూడా దేవదాసు కథతో తయారయింది. 2002 సెప్టెంబరు 16 నుంచి 21 వరకు హైదరాబాద్ ఫిల్మ్ క్లబ్ వారు 'దేవదాసు' చలన చిత్రోత్సవం నిర్వహించి తమకు అందుబాటులో వున్న ఆరు 'దేవదాసు' చిత్రాలను ప్రదర్శించారు. వాటిలో అతి ముఖ్యమైనవని మేము అనుకున్న మూడు చిత్రాలను గురించి 2002 అక్టోబరు, నవంబరు, డిసెంబరు 'రసమయి' మాసపత్రికలో వ్యాసాలు, లేఖలు, ఫొటోలు వగైరా ప్రచురించాం– మొత్తం 40 పేజీలు. అయినా ఇంకొక్క వ్యాసం మిగిలిపోయింది. దాన్ని కూడా ప్రచురించాలని అనుకుంటుండగానే అది ఎలాగో మరుగున పడిపోయింది; తర్వాత మరపున పడిపోయింది. ఆకస్మికంగా, ఆశ్చర్యకరంగా అది ఇప్పుడు 'త్రవ్వకాలలో' బయల్పడింది. ఇది 2002లో రాసినది. — నం.పా.సా

శరత్ దేవదాసు... అసమర్థుడు కాదు, శీలవంతుడు

'దేవదాసు' గొప్పపాత్ర. దేశ భాష కాలావధులకు అతీతంగా అందరి సానుభూతినీ చూరగొనగలిగిన పాత్ర అది. దేవదాసు బలహీన వ్యక్తిత్వం కలిగినవాడనీ, చంచల స్వభావంగలవాడనీ, అసమర్థుడనీ, అతడి విషాదానికి ఆ లక్షణాలే కారణాలనీ, పార్వతి మాత్రం నిబ్బరంగా తట్టుకోగలిగిందనీ, ఆత్మాభిమానం గల స్త్రీ అనీ అనడం ఎంతవరకు న్యాయం? దేవదాసు కంటే ఆమె ఏ విధంగా ఉన్నతమైనది?

దేవదాసు తనను అసహ్యించుకున్నా 'ఆత్మాభిమానం' ప్రదర్శించక, పూర్తిగా ఆత్మార్పణం చేసుకుని, అతడి కోసం తన వృత్తిని, సంపాదనను, సుఖాన్ని త్యాగం చేసి, అతడికి సేవ చేసి జన్మధన్యమయిందనుకున్న చంద్రముఖి ఇంకా ఎంత ఉన్నత వ్యక్తిత్వంగలది? వరించి వచ్చిన సౌందర్యవతిని మైకంలో సైతం తాకని దేవదాసు ఎంత గొప్ప శీలవంతుడు? దేవదాసు చిన్నప్పుడు కోపం వస్తే పార్వతిని కొట్టేవాడు, తిట్టేవాడు. మళ్ళీ అంతలోనే తప్పును ఒప్పుకుని, ఆమెను సముదాయించేవాడు. తన మీద అతడికి ఎంత అభిమానమో ఆమెకు తెలుసు. అందుకే కదా ఆమెకెప్పుడూ అతని మీద కోపం రాలేదు. అప్పుడు లేని ఆత్మాభిమానం ఆమెకు అత్యంత ప్రమాదకరమైన, క్లిష్టమైన తరుణంలో ఎందుకొచ్చింది? తండ్రిని ఎదిరించమని అంతకు ముందు అతడికి సలహా ఇచ్చిన ఆమె, అతడు ఏదో తెగించడానికి సిద్ధపడి వచ్చినప్పుడు తను తన తండ్రిని ఎదిరించడానికి ఎందుకు సిద్ధపడలేక పోయింది? దేవదాసు జీవితం విషాదమయం కావడానికి ఆమె తొందరపాటుతనం, 'ఆత్మాభిమానం' కారణం కాదా? ఇవి ఇప్పటికి తొమ్మిది దశాబ్దాలుగా పాఠక, ప్రేక్షకలోకంలో చర్చించబడుతున్న అంశాలు. దేవదాసు, పార్వతి, చంద్రముఖి– ఈ మూడు పాత్రల మధ్య గల వైరుధ్యాల వల్లనే నవల అంతగా ఆకట్టుకొన్నది. ఆ నవలను, ఆ మూడు పాత్రలను మరచిపోవడానికి అవకాశం లేకుండా ప్రతి తరంలోనూ ఒక కొత్త సినిమాలో వారు దర్శనమిస్తూనే ఉన్నారు; పునర్జన్మిస్తున్నారు. దేవదాసు చిత్రాలేకాక, ఆ తరహా ప్రేమకథా చిత్రాలు కూడా ఎన్నో ఉన్నాయి. పాఠకులు, ప్రేక్షకులు ఆ మూడు పాత్రలను మరచిపోవడం అసంభవం. వారి మనస్సులో ఆ ముగ్గురూ చిరంజీవులు.



> దేవదాసు, పార్వతి, చంద్రముఖి– ఈ మూడు పాత్రల మధ్య గల వైరుధ్యాల వల్లనే నవల అంతగా ఆకట్టుకొన్నది. ఆ నవలను, ఆ మూడు పాత్రలను మరచిపోవడానికి అవకాశం లేకుండా ప్రతి తరంలోనూ ఒక కొత్త సినిమాలో వారు దర్శనమిస్తూనే ఉన్నారు; పునర్జన్మిస్తున్నారు. పాఠకులు, ప్రేక్షకులు ఆ మూడు పాత్రలను మరచిపోవడం అసంభవం. వారి మనస్సులో ఆ ముగ్గురూ చిరంజీవులు.

ఒకరి పట్ల ఒకరికి ఎంత ప్రేమ, గౌరవం ఉన్నా, ఒకరిని విడిచి ఒకరు ఉండలేనంత గాఢమైన బంధం ఉన్నా సరియైన తరుణంలో సరియైన నిర్ణయం తీసుకోలేకపోవడం వల్ల, ఆత్మార్పణం ఉండాల్సిన చోట 'ఆత్మాభిమానం' వచ్చి కూర్చోవడం వల్ల ఏది జరగకూడదో అది జరుగుతుంది. పార్వతి, దేవదాసుల కథలో అదే జరిగింది.

దేవదాసు పిరికివాడు, సంఘానికి వెరచేవాడు అయితే, చంద్రముఖి ఇంటికి తరచుగా ఎందుకు వెడతాడు? వేశ్యయింటికి పోవడం రసికత్వానికి చిహ్నంగా భావించి, మజా చేయడానికి వెళ్ళే జమీందార్లలాగా అతడు వెళ్ళలేదు. న్యూనతాభావంతో నెత్తిన చెంగేసుకుని, చీకట్లో రహస్యంగా వెళ్ళలేదు. తలఎత్తుకునే, బాహాటంగానే వెళ్ళినా చంద్రముఖిని తాకలేదు. తనను ఆమె తాకితే చీదరించుకున్నాడు. తాగిన మైకంలో కూడా అతడు ఆమెను ముట్టుకోనివ్వలేదు. పార్వతి తప్ప మరో స్త్రీ స్పర్శను అతను సహించలేకపోయాడు. పార్వతిని కూడా అతనెప్పుడూ కాముకదృష్టితో చూడలేదు. ఆమె తన భార్యకావాలన్న కోరికే అతడికి లేదు. అతడు అసాధారణ శీలవంతుడు, ధనకాంక్షలేనివాడు; చంద్రముఖి వృత్తిని అసహ్యించుకున్నాడు గాని వ్యక్తిగా ఆమె పట్ల అగౌరవం లేదు. స్వార్థబుద్ధిలేనివాడు. జేబులో డబ్బుంటే ఎంత అని చూసుకోకుండా ఇవ్వగలిగినవాడు. పిత్రార్జితం కూడా దబాయించి తీసుకోలేదు. తండ్రి పోయాక అంతా అన్నకే వదిలేసి తన తాగుడికి కొద్దిగా తెచ్చుకున్నాడు. చంద్రముఖికి కొంత డబ్బు ఇచ్చాడు– ఆమె నుంచి ఏ సుఖం ఆశించకుండా. దాదాపు సన్యాసిలాగా బతికాడు.

తండ్రిపోయాక తన వాటాకు వచ్చిన డబ్బుతోనే అన్నదానం చేశాడు. తన జీవితాన్ని నరకప్రాయం చేసిన తండ్రి మీద అతడికి ద్వేషం లేదు. తను బాధపడ్డాడు. బతకాలన్న కోరిక లేక, చనిపోవాలనే తాగాడు. అది తన ప్రాణం తీస్తుందని తెలిసే తాగాడు. తండ్రి మరణశయ్య మీద వున్నా అతడు వెళ్ళలేదు. తాగుబోతుగా మారిన తన మొహం ఆయనకి చూపించడం ఇష్టం లేక వెళ్ళలేదు. ఏ కారణాల వల్ల అతడిని బలహీనుడని అంటున్నారు? ఒకవేళ బలహీనుడే అనుకున్నా ప్రపంచంలో బలహీనతలు లేనివాళ్ళవరైనా ఉన్నారా?

తండ్రిని ఎదిరించలేకపోవడం బలహీనతా? ఎదిరించి పార్వతిని చేసుకుందామనుకునే సరికి కాలాతీతమైంది. పార్వతిని బలం గల పాత్ర అని ఎలా అన్నారు? దేవదాసే తన సర్వస్వం అనుకున్న పార్వతి, అతను లేకుండా తను జీవించలేననుకున్న పార్వతి, నేను తల్లిదండ్రులను ఒప్పిస్తానని అతను అన్నప్పుడు ఎందుకు సరేననలేకపోయింది? అంత గాఢమైన ప్రేమలో 'ఆత్మాభిమానం' అనేది అడ్డం వస్తుందా? సర్వం అర్పించుకున్న ప్రేమా అది? ఆ కొద్ది నిమిషాలలో ఆమె అన్న మాటలు, ఆమె ప్రవర్తన ఇద్దరి జీవితాలను నరకం చేశాయి. తండ్రి నెదిరించలేని దేవదాసును పిరికివాడంటే, పార్వతి తన తండ్రిని ఎదిరించగలిగి ఉండేదా? 'నేను చేసింది ఒకే ఒక్క తప్పు. దానికి ఇంత శిక్షా' అని దేవదాసు అంటున్నప్పుడు ప్రతి పాఠకుని, ప్రేక్షకుని గుండె తరుక్కుపోతుంది. ఆమె లేకుండా తను జీవించలేడు, ఆమెపై తప్ప మరెవరిపైనా తను ఆధారపడలేడు అనే సంగతి తెలుసుకోవడంలో ఆలస్యం జరిగింది. తెలుసుకునే సరికి ఆమె అహంకారంతో, ఆత్మాభిమానంతో బిగదీసుకుంది. పరిస్థితి చేయిజారిపోయాక ఇద్దరూ నిస్సహాయ స్థితిలో పడిపోయారు.

ప్రేమ వైఫల్యం పొందినా పార్వతి నిబ్బరంగా నిలబడగలిగింది. భర్త సంసారాన్ని చక్కదిద్దింది కాబట్టి ఆమె వ్యక్తిత్వం బలమైనదనీ, వైఫల్యాన్ని తట్టుకోలేకపోయాడు కాబట్టి ఇతడు బలహీనుడనీ చాలా మంది అంటుంటారు. పార్వతిలాగే ఇతడూ ఒక జమీందారు కూతుర్ని పెళ్ళి చేసుకుని, కలకత్తాలో బంగళా కొనుక్కుని (లోపల పార్వతి కోసం ఎంత బెంగపడుతున్నప్పటికీ) నిబ్బరంగా కాపురం చేయగలిగితే అతడిని సమర్థుడైన, 'బలవంతుడైన' కథానాయకుడుగా అంగీకరించేవారా? పార్వతి మరొక పురుషుని స్పర్శని భరించగలిగింది. దేవదాసు మరొక స్త్రీ స్పర్శను భరించలేకపోయాడు. మరొక స్త్రీతో సంబంధం అతడి ఊహలోకి కూడా రాలేదెప్పుడూ. తనను ప్రేమించి, తన కోసం వేశ్యావృత్తిని మానుకుని, తన సేవకే జీవితాన్ని అంకితం చేసుకున్న చంద్రముఖి స్పర్శను తాగుడుమైకంలో సైతం భరించలేకపోయాడు. చంద్రముఖి నిస్వార్థ త్యాగాన్ని, నిష్కల్మషమైన ఆమె ప్రేమను అర్థం చేసుకున్నాక ఆమెపై అతడికి ఎంతో గౌరవం కలిగింది. అయినా, ఆమె పొందును కోరుకోలేదు. తన కోసం ఆదాయాన్ని వదులుకున్న ఆమెకు గౌరవంగా బతకడానికి డబ్బిచ్చాడు. అతడు బలహీనుడా? అతడు పండితుడు, మేధావి, మహాపురుషుడు కాడు. కాని అసాధారణ శీలవంతుడు. పల్లెటూరు నుంచి పట్నానికి పోయి, కాలేజీలో చదువుతూ, సూటూ, బూటూ వేసినా, దండిగా డబ్బున్నా, అడ్డుపెట్టేవాళ్ళెవరూ లేకపోయినా అతడికి చెడు అలవాట్లేవీ అబ్బలేదు సిగరెట్టు తప్ప.

❍ నండూరి పార్థసారథి

(ఇటీవల కన్నుమూసిన రచయిత, జర్నలిస్టు నండూరి పార్థసారథి అముద్రిత రచన ఇది)

కట్టుబానిసత్వానికి కొత్తరూపం!

బ్రిటీష్ వారు మొదలు పెట్టిన ఒప్పంద కార్మిక వ్యవస్థ ఒకవిధంగా నిర్బంధ వలస కార్మిక వ్యవస్థ. బానిసత్వ వ్యవస్థను రద్దు చేసిన తరువాత దాని స్థానంలో 'ఇండెంచర్ (ఒప్పంద కార్మిక)వ్యవస్థ'ని వినియోగించాలని బ్రిటిష్ పార్లమెంట్ నిర్ణయించింది. ఈ వ్యవస్థను బ్రిటీష్ సామ్రాజ్యవాదులు తమకు అనుకూలంగా ఏర్పాటు చేసుకున్నారు. అన్ని విధాలుగా కార్మికులను వాడుకుంటూ తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలను పొందడానికి ఈ వ్యవస్థను రూపొందించారు. ఆయా దేశాల్లో మంచి పని పరిస్థితులు, తగినంత వేతనాన్ని కల్పించే చట్టపరమైన ఒప్పందాల ఆధారంగా 5 నుంచి 10 సంవత్సరాల వరకూ పని చేయబోతున్నట్లుగా నమ్మించి భారతీయ కార్మికుల్ని వలసరాజ్య శక్తులు తీసుకుపోగలిగారు. బ్రిటీష్ వారి తోటల్లో పనిచేయడానికి తెలిసో తెలియకో, భారతీయులు చేసుకునే ఈ రాతపూర్వక ఒప్పందాన్ని గిర్మిట్ (అవధీ భాష) అన్నారు. అంటే ఖాయపర్చుకున్న వాళ్లు, లేదా న్యాయపరంగా కట్టుబడ్డవాళ్లు. కార్మికుల సంపూర్ణ శ్రమని వాడుకొనేందుకు, గమ్య స్థానంలోని దేశాల్లో సారవంతమైన నేలల్ని సిద్ధంగా ఉంచారు. ఆ నేలలో వచ్చిన వాణిజ్య పంటలతో లాభదాయక వ్యాపారానికి బాటలు వేసుకున్నారు.

ఒప్పంద కార్మిక విధానానికి అనువుగా భారతదేశంలో పరిస్థితులు అప్పట్లో బ్రిటిష్ వారికి కలిసొచ్చాయి. బ్రిటీష్ రెవెన్యూ విధానాల ప్రభావంతో, రైతులే కాదు, అగ్ర కులాల వారు, వ్యాపారులు, చేతివృత్తులవారు, వ్యవసాయదారులు, కార్మికులు, గ్రామీణ భారతదేశంలో బ్రిటీష్ ప్రభుత్వపు తీవ్ర మార్పులకు బాధితులయారు. దానికి తోడు 1860– 1908ల మధ్య 20 కరువులు, ఒకదాని తరువాత ఒకటి ముంచెత్తాయి. అవి పేదరికానికి, విస్థాపనలకు, భూకబ్జాలకు దారితీసాయి. కరువులూ, పెరుగుతున్న గ్రామీణ దుస్థితి, వారి కష్టాలను భరించరానివిగా చేసాయి. ఫలితంగా ఉపాధి కోసం పురుషులు, స్త్రీలు సైతం పట్టణ కేంద్రాలకు వలసలు వెళ్లడం ప్రారంభమయింది. ఈ వలసల్లో భాగంగానే కష్టాలనుండి బయటపడాలనుకున్న జనసమూహం ఒప్పంద కార్మిక వలసదారులయ్యారు. కొందరు ఆర్కటీల (దళారుల) మోసపూరిత నియామక పద్ధతులకు బాధితులయ్యారు. ఆర్కటీలు ఒప్పందంతో దొరికే పనివాళ్ల అన్వేషణలో ఉండేవారు. అనాథల్లా సందేహాస్పదంగా తిరుగుతున్న మనుషులు మద్రాసు, బొంబాయి, కలకత్తా నగరాల్లో అనేకులు వారికి కనిపించేవారు. అటువంటి వారిని జీతభత్యాల ఆశ చూపించి తరలించుకుపోయేందుకు ఒప్పించగలిగేవారు.

ఏదోలా సమీకరించుకున్న వ్యక్తులను వారు వెళ్లాల్సిన ప్రాంతాన్ని బట్టి ఆర్కటీలు, మద్రాసు లేదా కలకత్తా దగ్గరలోని ఓడలెక్కించే ప్రదేశంలోని డిపోలకు తీసుకుపోయేవారు. డిపోలకు కొత్తగా వచ్చిన వ్యక్తులకు, ఒక భారతీయ వైద్యుడు పురుషులను తనిఖీ చేస్తే, ఒక భారతీయ నర్సు మహిళా కార్మికులను తనిఖీ చేసేది. దృష్టి, వినికిడి సామర్థ్యం తనిఖీ చేయబడేవి. కార్మికులకు సుఖరోగాలున్నాయేమోనని అతి జాగ్రత్తగా తనిఖీ చేసేవారు.

పొగ ఓడలు రాక ముందు సముద్రయానం 90 నుండి 120 రోజులు వరకూ పట్టేది. కలకత్తా నుంచి జమైకాకు 180 రోజులు పట్టేది, నాటాల్‌కు 84 రోజులు, మారిషస్ రీయూనియన్‌లకు 70 రోజులూనూ. సగటున 300 నుండి 550 మంది ప్రయాణికులు ఓడల్లో అంత కాలం గడపడం మూలాన రోగాలు వచ్చేవి, మరణాలు ఎక్కువగా ఉండేవి. పొగఓడల రాకతో మరణాల సంఖ్య కొంత తగ్గింది. ప్రయాణాలకు పట్టే సమయం కూడా 50 శాతం తగ్గింది. ఓడలో మనిషి ఏదైనా తినగలగాలి. ఓడ అనేది జగన్నాథుని దేవాలయం లాంటిదని, అక్కడ కుల ఆంక్షలకు తావులేదని వలసదారులు ఓడలో జీవితానికి సంబంధించి ఒక ఆసక్తికరమైన సిద్ధాంతాన్ని కనుగొన్నారు. ఇది అంతస్తులను సమంచేసే ఒక గొప్ప సాహస ప్రయాణంగా దానికి వివరణ ఇచ్చారు.

ఒక చేతిలో పాస్, మెడను అలంకరించే 'టిన్ టికెట్' అనే బిళ్లను పట్టుకుని, నియమించుకున్న కార్మికులు ఓడ ఎక్కేవారు. మెడకు తగిలించిన బిళ్లలోని సంఖ్య ప్రయాణంలో వారిని గుర్తించడానికి. ఆ సంఖ్య ఆయా దేశాల్లో చేరుతున్న ఒప్పంద కార్మికుల క్రమ సంఖ్య కూడా. ఆ సంఖ్యతోనే డిపోలలో భారతీయ కార్మికుల పేరు, తండ్రి పేరు, వయస్సు, ఆడా/మగా, బాలుడు/బాలిక, కులం, ఎత్తు, గ్రామం, థానా, జిల్లా, గుర్తులు, విశేషాంశాలు, యజమానిలాంటి అనేక వివరాలన్నీ నమోదు చేసుకునేవారు. అత్యంత ముఖ్యమైన జాబితా అది. ఆ సమాచార వివరాలే వెళ్లిన వారి మూలాలను వెలికితీసేందుకు ఇప్పటికీ ఎవరికైనా సహాయపడుతున్నాయి. ఇక్కడనుంచి వెళ్లిన వారి వివరాలు, నిజానికి ఇక్కడే ఉండాలి, దొరకాలి. ఆ వివరాలు ఎక్కడో ఇతర దేశాల జాబితాల్లో వెతుక్కోవలసిన దుస్థితి మనది. ఒప్పంద కార్మికుల వారసులు ఇప్పటికీ ఎందరో ఆ వెతుకులాటల్లోనే ఉన్నారు. అందులో వారు పడ్డ, పడుతున్న కష్టాల్ని నమోదు చేసుకుంటున్నారు. 'ఆరుగంటల ప్రయాణమే ట్రినిడాడ్ పోవడానికి అని చెప్పి ఓడ ఎక్కించారు. 103 రోజులు పట్టింది చేరుకోవడానికి. రోజులు గడుస్తున్నకొద్దీ ఓడల్లో ఉన్న వారందరిదీ అరణ్యరోదన అయింది.' అని అవసాన దశలో ఉన్న ఒకప్పటి ఒప్పంద కార్మికురాలు చెప్పుకుంది.



> మెడలో 'టిన్ టికెట్' బిళ్లతో ఒప్పంద కార్మికులు ఓడ ఎక్కేవారు. వారి దృష్టి, వినికిడి సామర్థ్యం, సుఖరోగాలు ఇత్యాదివి తనిఖీ చేసేవారు. మారిషస్ కోసం విశాఖపట్నం కార్మిక నియామకాలకు ముఖ్యమైన ప్రాంతంగా ఉండేది. దక్షిణాది జిల్లాల కోసం రాజమండ్రిలో సబ్‌డిపోలు స్థాపించారు. తెలుగు ప్రాంతాలన్నింటినుంచీ ఒప్పందకార్మికులు తరలిపోయారు. యానాం, పాండిచ్చేరీ నుండి కూడా తెలుగువారు వెళ్లారు. కొంతమంది భారతీయులు స్వదేశానికి తిరిగి వచ్చినా, కులవ్యవస్థను భరించలేక తిరిగి వెళ్లిపోవలసి వచ్చింది.

సముద్ర కెరటాలకు, ఓడలోని వారి కన్నీటి కెరటాలకూ తేడా లేదు అనిపిస్తుంది. వారి దుఃఖసాగరాల ముందు వారు దాటుకుంటూ పోయిన సాగరాలే వెలవెలపోయి ఉంటాయి.

ఒప్పంద కార్మికులుగా వెళ్తున్న వారిలో ఎక్కువశాతం, ఒకే వ్యక్తి కాదు, కుటుంబం. తండ్రితో పిల్లలు, తల్లితో పిల్లలు, తల్లీ తండ్రితో పిల్లలు, భార్యా భర్త, అక్కా చెల్లెల్లు, అన్నదమ్ములు ఇలా ఎన్నో కలయికలతో ఉన్నవి. భార్య లేకుండా పిల్లల్ని తీసుకువెళ్లిన తండ్రులు, భర్త లేకుండా పిల్లల్ని తీసుకువెళ్లిన తల్లులూ ఉన్నారు. అందులో అనేక మతాలు, కులాలు, ప్రాంతాలు, భాషల వారున్నారు. కొన్ని కుటుంబాలే కాదు, కొన్ని గ్రామాలు సైతం అలా ఖాళీ అయిపోయాయి. ఒప్పంద కార్మికులు ఒప్పందం చేసుకున్నది, చేరాల్సిన ప్రదేశంలో ఐదేళ్ల పనికి మాత్రమే. వారు ఎక్కడికి వెళ్తున్నారో, ఎలా వెళ్తున్నారో, అక్కడి పరిస్థితులేమిటో, నిబంధనలేమిటో ఏవీ వారికి తెలియనిచ్చేవారు కాదు. కానీ చేరిన ప్రదేశంలో, తోటల యజమానులు ఏర్పర్చుకున్న నిబంధనలు అతిక్రమిస్తే, పడే శిక్షలు ఆయా దేశాల్లో చేరుకున్న తరువాతే తెలిసేది. పని చేయననడం, ఇచ్చిన పని పూర్తి చేయకపోవడం, ఆలస్యంగా రావడం, పనికి రాకపోవడం లాంటివన్నీ నేరాలు. వాటిని సరిచేయడం కోసం తిట్టడం, కొరడాలతో కొట్టడం, జీతంలో కోత, జైలుశిక్ష మొదలయినవి అధికారశాసనాలయ్యాయి. అనుమతులు లేకుండా గైర్హాజరుకు తీవ్రమైన శిక్ష పడేది. పర్యవేక్షకుడి అనుమతి లేకుండా తాను పని చేస్తున్న తోటకు రెండు మైళ్లకు మించి కార్మికుడు వెళ్లడానికి లేదు.

ఒప్పంద కార్మికులు ఎదుర్కొన్న ప్రధాన సమస్య వారి భాష. అధికారులతో మాట్లాడినప్పుడు దుబాసీల మీద ఆధారపడవలసి వచ్చేది. భారతీయ భాష-ఆంగ్లం రెండూ తెలిసినవారు దుబాసీలుగా వ్యవహరించేవారు. దుబాసీలు ఎక్కువగా అధికారంలో ఉన్నవారి అభిమానాన్ని పొందడానికే ప్రయత్నించేవారు.

1904లో గాంధీకి 35 సంవత్సరాలు. దక్షిణాఫ్రికాలో పదేళ్లు ఉన్నాడు. దక్షిణాఫ్రికాని వదిలి 1915లో భారతదేశానికి వచ్చాడు. అక్కడ ఉన్నప్పుడు, భారతీయ కార్మికుల్ని కళ్ళారా చూసిన వ్యక్తిగా, ఒప్పంద కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రచారం చేయడంలో గాంధీ కీలకపాత్ర పోషించాడు. ఒప్పంద వ్యవస్థకు వ్యతిరేకంగా భారత జాతీయవాదులు కూడా ప్రచారంలో చేరడంతో ఆ ఉద్యమం పెరిగింది. బ్రిటీష్ ప్రభుత్వం చివరకు 1917లో ఒప్పంద కార్మిక విధానాన్ని రద్దు చేయవలసి వచ్చింది. ఒప్పందాల వ్యవస్థ 1919 చివరి వరకు లీజు/పరివర్తన మూలంగా కొనసాగి 1 జనవరి 1920 నుండి మాత్రమే, ఒప్పంద భారతీయ కార్మిక వ్యవస్థ పూర్తిగా నిలిచిపోయింది. కావున 1920 జనవరి 1వ తేదీని 'విమోచన దినం'గా పరిగణిస్తున్నారు. అన్ని దేశాల కాలనీల్లోని ఒప్పంద భారతీయుల కోసం అన్ని ఒప్పందాలు, ఆ తేదీతో ముగిశాయి. దానితో ఒప్పంద కార్మికులు తమ స్వీయ దేశాలకు తిరిగి వెళ్లడానికి అన్ని విధాలా వారికి స్వేచ్ఛ ఏర్పడింది. కొంతమంది భారతీయులు స్వదేశానికి తిరిగి వచ్చినా, కొన్ని ప్రాంతాల్లో కులవ్యవస్థ కారణంగా దుష్ప్రవర్తనని ఎదుర్కొన్నారు. అది భరించలేక చాలా మంది తిరిగి తమ ఒప్పంద దేశాలకు వెళ్లిపోవలసి వచ్చింది.

మారిషస్ కోసం, విశాఖపట్నం కార్మిక నియామకాలకు చాలా ముఖ్యమైన ప్రాంతంగా ఉండేది. అక్కడ 1871లో ఉపప్రతినిధి సంస్థ కూడా ప్రారంభించబడింది. తంజావూర్, తిరుచినాపల్లి వంటి దక్షిణాది జిల్లాల కోసం, మద్రాసు నగరానికి 300 మైళ్ల దూరంలో ఉన్న రాజమండ్రిలో సబ్‌డిపోలు స్థాపించబడ్డాయి. నాటాల్, మలయా, ఫిజీల కోసం కూడా డిపో సౌకర్యాలు ఏర్పర్చారు. మారిషస్, గయానా, ట్రినిడాడ్ & టొబాగో, సురినామ్, ఫిజీలకు, తూర్పు ఉత్తరప్రదేశ్, బిహార్‌ల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు వెళ్ళారు. బెంగాల్, దక్షిణ భారతదేశం నుండి కూడా కొంతమంది అక్కడకు వెళ్ళారు. దక్షిణాఫ్రికా, తూర్పు ఆఫ్రికాలకు గుజరాత్, పంజాబ్, దక్షిణ భారతదేశం నుండి ఎక్కువ మంది వెళ్లారు. అప్పటి ఫ్రెంచ్ కాలనీలైన యానాం, పాండిచ్చేరీ నుండి కూడా రీయూనియన్, ఫ్రెంచ్ గయానాకు తెలుగువారు ఒప్పందవలస కార్మికులుగా వెళ్లారు. మారిషస్ ఇప్పటికీ భారతీయ భాషలను సంరక్షించుకోగలుగుతోంది.

వలసకార్మికుల అధ్యయనంలో భాగంగా నేను, 1860–1911ల మధ్య ఒప్పంద కార్మికులుగా దక్షిణాఫ్రికాలోని నటాల్‌కు వెళ్లిన వారుగా నమోదుచేయబడ్డ 1,52,184 వ్యక్తుల సమాచారాన్ని సేకరించగలిగాను. తెలుగు ప్రాంతాలు, తతిమా దక్షిణ ప్రాంతాల కార్మికులే అందులో 66శాతం. మిగతా 34శాతం మిగిలిన భారతీయులు. తెలుగు ప్రాంతాల్లో అనంతపూర్, బళ్లారి, బాపట్ల, చిత్తూరు, గోదావరి, గుంటూరు, కడప, కళ్లికోట, గంజాం, కృష్ణ, కర్నూలు, కొత్తూరు, మచిలీపట్నం, నెల్లూరు, పాలకొండ, రాజమండ్రి, వైజాగపటం, విజయనగరం, కడలూరు, ఉత్తర ఆర్కాట్, హనుమకొండ, వరంగల్, భువనగిరి, హైదరాబాద్, సికిందరాబాద్, కరీంనగర్, నల్గొండ. వైజాగపటం, నెల్లూరు, గంజాం, కృష్ణ, గోదావరి, ఉత్తర ఆర్కాట్ లాంటి కొన్ని జిల్లాల నుండి అధికంగా వెళ్లారు.

తెలుగు ప్రాంతాల నుండి కుటుంబాలు కుటుంబాలు, పిల్లలతో సహా వలసపోతున్నా, గ్రామాలు ఖాళీ అవుతున్నా, వారి గురించి, మోసపోతున్న పరిస్థితుల గురించి, అక్కడి నాయకులు, కనీసం రచయితలు ఆ సమయాల్లో పట్టించుకోకపోవడం ఆశ్చర్యకరమైన విషయం. హిందీ ప్రాంతాల్లో ఆ స్పృహ మనకంటే ఎక్కువ. ఒప్పంద వలసకార్మికులు గణనీయమైన సంఖ్యలో విదేశాలలో ఉన్న మొట్టమొదటి భారతీయులు. వలసపోయిన వారిని గురించిన అధ్యయనంలో వారే అందరికంటే ముందు ఉన్న వాళ్లు. భారతీయుల జ్ఞాపకాలలో గౌరవప్రదమైన స్థానాన్ని తప్పకుండా పొందాల్సినవాళ్లు.

▪ ముకుంద రామారావు
99083 47273





ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణమ్మ ఉరకలు



ఓవైపు భారీ వర్షాలు జిల్లాను అతలాకుతలం చేస్తుంటే.. మరోవైపు ముంచుకొస్తున్న వరద భయభ్రాంతులకు గురిచేస్తోంది. తెలంగాణ నుంచి వస్తున్న వరద నీటితో కట్లేరు, వైరాయేరు పొంగిపొర్లుతుంటే, మునేరుకు ముంపు ముంచుకొస్తోంది. ఈ ప్రవాహమంతా ప్రకాశం బ్యారేజీ వద్దకు చేరడంతో శనివారం కొన్ని గేట్లు పైకెత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. కుండపోత వర్షం విజయవాడ నగరాన్ని ముంచేసింది.

వానొచ్చే.. వరదొచ్చే..

వీడని వర్షాలు.. ముంచుకొస్తున్న వరదలు

- శనివారం ఉదయం నగరంలో కుండపోత
- జారిపడిన కొండరాళ్లు.. కూలుతున్న ఇళ్లు
- పొంగిపొర్లుతున్న వైరా, కట్లేరు
- మునేరుకు క్రమంగా పెరుగుతున్న ఉధృతి
- ప్రకాశం బ్యారేజీకి భారీగా చేరుతున్న వరద
- నీటిని దిగువకు విడుదల చేస్తున్న అధికారులు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఎడతెరిపి లేని వర్షాలు జిల్లాను వణికిస్తున్నాయి. పగలు కొంతమేర తెరిపినిస్తున్నా.. రాత్రి సమయాల్లో మాత్రం వర్షం భారీగా కురుస్తోంది. జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు కుండపోత వర్షం కురిసింది. జిల్లాలో 49.55 మిల్లీమీటర్ల సరాసరి వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కంచికచర్ల మండలంలో 69.0 మిల్లీమీటర్లు, అత్యల్పంగా పెనుగంచిప్రోలు మండలంలో 23.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఇక విజయవాడ నగరంలో 280.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలోని 11 మండలాల్లో 50 మిల్లీమీటర్లను దాటి వర్షపాతం నమోదైంది. శనివారం మధ్యాహ్నం నుంచి మాత్రం వర్షం కాస్త తగ్గింది.



కొండరాళ్లు జారిపడి మల్లికార్జునపేటలో కూలిన ఇల్లు

కొండంత భయం

వర్షాలకు మల్లికార్జునపేటలోని ఊటబావి వద్ద ఇల్లు కూలిపోయింది. దీంతో పక్కన ఉన్న ఇళ్లకు ప్రమాదం ఏర్పడింది. కబేళా సెంటర్ తిరుపతమ్మ గుడి ప్రాంతంలో వల్లభాపురం కోటేశ్వరరావుకు చెందిన ఇంటి ప్రహరీ కూలింది. సితార సెంటర్ ఎదురుగా సూరమ్మ అనే మహిళ ఇంటిపై కొండచరియలు జారిపడ్డాయి. ఈ ఘటనలో ఇంటి కొంతభాగం దెబ్బతింది. మొగల్రాజపురంలోని రావిచెట్టు సెంటర్‌లో కొండపై మట్టి కొట్టుకుపోవడంతో ప్రహరీ కూలి పక్కింటిపై పడింది.

ప్రకాశం బ్యారేజీకి వరద

తెలంగాణాలో కురుస్తున్న వర్షాలకు వరద ప్రవాహం అధికమవుతోంది. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజీకి 7879 క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో బ్యారేజీ ఎనిమిది గేట్లను అడుగు మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వజినేపల్లి నుంచి 54, పాలేరు నుంచి 59, కీసర నుంచి 3499 క్యూసెక్కుల నీరు కృష్ణానదికి చేరుతోంది. పట్టిసీమ పంపులను నిలుపుదల చేసినప్పటికీ వెలగలేరు నుంచి 2495 క్యూసెక్కుల నీరు వస్తోంది. ప్రకాశం బ్యారేజీ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 3.07 టీఎంసీలు. ఇక్కడ నీటిమట్టం పూర్తిస్థాయిలో ఉండటంతో ఎగువ నుంచి వస్తున్న నీటిలో 6570 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీని నుంచి కేఈబీకి 403, ఏలూరు కాల్వకు 306, రైవస్ కాల్వకు 300, కేఈ మెయిన్ కాల్వకు 1009, కేడబ్ల్యూ కాల్వకు 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఉధృతంగా కట్లేరు, వైరా

కంచికచర్ల : కట్లేరు, వైరాయేరు ఉధృతంగా మారాయి. తెలంగాణాలో భారీ వర్షాలు పడుతుండటంతో వరద భారీగా వచ్చి చేరుతోంది. నందిగామ మండలం కూడలి, వీరులపాడు మండలం పల్లెంపల్లి గ్రామాల మధ్య కాజ్‌వేపైకి వరద నీరు చేరింది. దీంతో ఈ దారిలో వాహనాల రాకపోకలు బంద్ అయ్యాయి. కూడలి మీదుగా ఖమ్మం జిల్లా మధిర వెళ్లే మార్గం లేకుండాపోయింది. దీంతో పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కూడలి వద్ద వంతెన నిర్మించి పదేళ్లు కావస్తున్నప్పటికీ ఇంకా ప్రారంభం కాలేదు. వంతెనకు రెండు వైపులా కేవలం అప్రోచ్ రోడ్లు వేయకపోవటం వల్ల నిరుపయోగంగా మారింది. కాగా, మునేరుకు స్వల్పంగా వరద వచ్చింది. ఎగువన ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో మునేటి వరద క్రమంగా పెరుగుతోంది. ఆదివారం ఉధృతం కావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.



కట్లేరు వరద





ప్రణతులివే.. ప్రకృతిమాతా..

రెండోరోజూ ఘనంగా శాకంబరీ ఉత్సవాలు

- నేడు పూర్ణాహుతితో ముగింపు

కూరగాయలతో కొలువుతీరిన దుర్గమ్మ ఉత్సవమూర్తి (ఇన్‌సెట్‌లో) అంతరాలయంలో ఆకుకూరలు, కూరగాయల తోరణాలు

వన్‌టౌన్, జూలై 20 : శాకంబరీ ఉత్సవాల్లో రెండోరోజు కూడా దుర్గగుడికి భక్తులు పోటెత్తారు. కూరగాయలు, ఆకుకూరలతో అందంగా అలంకరించిన తోరణాలు ఆలయ ప్రాంగణాన్ని మరింత అందంగా మార్చాయి. ఓవైపు శాకంబరీ ఉత్సవాలకు తరలివచ్చే జనం, మరోవైపు ఆషాఢ సారె తెచ్చే భక్తులతో కొండంతా కిటకిటలాడింది. వైదిక కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజాధికాలు జరిగాయి. కాగా, ఆదివారం ఉదయం పూర్ణాహుతితో మూడు రోజుల శాకంబరీ ఉత్సవాలు ముగుస్తాయి.

స్పెషల్ పాలన

జిల్లావ్యాప్తంగా ప్రత్యేకాధికారుల నియామకం

- మండలాలపై పర్యవేక్షణ కోసం 16 మంది నియామకం
- ప్రతి బుధవారం మండలాల పరిధిలో ఆకస్మిక తనిఖీలు
- పాలనలో మార్కు చూపిస్తున్న కలెక్టర్ సృజన

ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు కలెక్టర్ సృజన 'స్పెషల్' పాలనకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసేందుకు స్పెషల్ అధికారుల నియామకాలకు శ్రీకారం చుట్టారు.

6లో..

అధికారులొచ్చేవరకూ కదలను

రోడ్డుపై మురుగు నీటిలో స్టూల్ వేసుకుని కూర్చుని..

వినూత్నంగా తిరువూరు ఎమ్మెల్యే

పట్టణమంతా సైకిల్‌పై తిరిగి.. ప్రజా సమస్యలు తెలుసుకుని..

జేసీగా నిధి మీనా

- విజయవాడ మునిసిపల్ కమిషనర్‌గా ధ్యానచంద్ర
- సీఆర్‌డీఏ అదనపు కమిషనర్‌గా మల్లవరపు నవీన్



నిధి మీనా



ధ్యానచంద్ర



మల్లవరపు నవీన్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్ బదిలీ అయ్యారు. నూతన జేసీగా 2020 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి నిధి మీనాను ప్రభుత్వం నియమించింది. సంపత్ గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) కమిషనర్‌గా బదిలీ అయ్యారు. నూతన జేసీగా వస్తున్న నిధి మీనా 2020 ఐఏఎస్ బ్యాచ్ అధికారిణి. ప్రస్తుతం వయోజన విద్య డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. నిధి మీనా డాక్టర్ కూడా. రాజస్థాన్‌కు చెందిన ఆమె ఎంబీబీఎస్ చదివారు.

- ఇక విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ (వీఎంసీ) కమిషనర్‌గా హెచ్‌ఎం ధ్యానచంద్రను ప్రభుత్వం నియమించింది. ఈయన ఇంతకుముందు ఉమ్మడి కృష్ణాజిల్లా సబ్ కలెక్టర్‌గా పనిచేశారు. కర్ణాటకకు చెందిన ఈయన 2017 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. తెలుగు సినిమాలంటే ఇష్టం. సినిమాలు చూస్తూ తెలుగు నేర్చుకున్నారు. డాక్టర్ అయిన ధ్యానచంద్ర ఇంజనీరింగ్ విద్యను అభ్యసించారు. కరోనా సమయంలో విజయవాడ సబ్ కలెక్టర్‌గా కీలక బాధ్యతలు నిర్వహించారు.
- సీఆర్‌డీఏ అదనపు కమిషనర్‌గా మల్లవరపు నవీన్‌ను ప్రభుత్వం నియమించింది. నవీన్ 2019 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా జేసీగా పనిచేస్తున్నారు. సీఆర్‌డీఏ అదనపు కమిషనర్‌గా పనిచేసిన కట్టా సింహాచలం బదిలీ అయిన నేపథ్యంలో నవీన్‌కు పోస్టింగ్ ఇచ్చారు. కట్టా సింహాచలానికి రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్‌గా ప్రభుత్వం పోస్టింగ్ కల్పించింది.



ఐదేళ్ల వైసీపీ పాలనలో రెండు జిల్లాల పరిధిలోని పోలీసులు ప్రజాసేవను విస్మరించారు.. వైసీపీ సేవలో తరించారు.. ఆ పార్టీ కార్యకర్తలుగా పనిచేశారు.. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్ని ఫిర్యాదులు చేసినా బుట్టదాఖలు చేశారు.. ఎదుటి వారిపైనే కేసులు పెట్టి జైళ్లకు పంపారు.. గన్నవరం, మచిలీపట్నం, గుడివాడ నియోజకవర్గాల్లోని పోలీసులు అరాచకంగా ప్రవర్తించారు. మాజీ ఎమ్మెల్యేలు వల్లభనేని వంశీ, కొడాలి నాని, పేర్ని నాని సేవలో మునిగితేలారు. ప్రస్తుతం అధికారం మారింది.. అప్పుడు వైసీపీ జెండాలు మోసిన సీఐలంతా నేడు టీడీపీ ప్రజాప్రతినిధుల పంచన చేరుతున్నారు. మంచి పోస్టింగ్‌ల కోసం వారు చేస్తున్న ప్రయత్నాలను కొందరు టీడీపీ ప్రజాప్రతినిధులు ఆమోదముద్ర వేయడాన్ని సామాన్య కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఐదేళ్లూ తమను హింసించిన వారిని నాయకులు భుజాలకెత్తుకోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. నేడో రేపో రెండు జిల్లాల్లో సీఐల బదిలీలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో వైసీపీ ఖాకీల పైరవీలు మరింత జోరందుకున్నాయి.

\- విజయవాడ, ఆంధ్రజ్యోతి

వైసీపీ వీరవిధేయుల పైరవీలు

బదిలీల కోసం సీఐల అత్యుత్సాహం

ఐదేళ్లలో వైసీపీ అరాచకాలకు ప్రోత్సాహం

- టీడీపీ నేతలు, కార్యకర్తలపై వేధింపులు
- నేడు బదిలీల కోసం టీడీపీ ఎమ్మెల్యేల వద్దకు..
- సానుకూలంగా స్పందిస్తున్న కొందరు ఎమ్మెల్యేలు

వైసీపీతో అంటకాగిన వారిని ప్రోత్సహించొద్దంటున్న కార్యకర్తలు

కృష్ణాజిల్లాలో ఇదీ పరిస్థితి

- గన్నవరం నియోజకవర్గంలో పనిచేసిన సీఐలు మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి అడుగులకు మడుగులొత్తారు. గన్నవరం సీఐగా పనిచేసిన కనకారావును టీడీపీ నాయకులు, కార్యకర్తలు.. వైసీపీ నాయకుడిగా భావిస్తుంటారు. స్థానిక టీడీపీ కార్యాలయంపై దాడి సమయంలో

- మిగతా 6లో

పోలీస్ కమిషనరేట్‌లో ఇలా..

విజయవాడ నగరంలో ఎక్కడ పోస్టింగ్ తెచ్చుకున్నా పంట పండినట్లేనని భావిస్తారు సీఐలు. దీంతో నగరంలో పోస్టింగ్‌ల కోసం ఏ స్థాయిలోనైనా పైరవీలు చేయించుకునేందుకు వెనుకాడరు. వైసీపీ హయాంలో ఆ పార్టీ విధేయులుగా ముద్రపడినవారంతా ఇప్పుడు మళ్లీ కీలక స్థానాల కోసం పోటీ పడుతున్నారు. గతంలో నగరంలో పనిచేసిన సహేరా బేగం (ప్రస్తుతం దిశ పీఎస్‌లో ఉన్నారు), కాశీ విశ్వనాథం (ఎస్‌బీలో అడ్మిన్ సీఐగా ఉన్నారు), షరీఫ్ (కృష్ణలంక క్రైం సీఐగా ఉన్నారు) వీరు ముగ్గురూ గత వైసీపీ ప్రభుత్వంలో కీలక స్థానాల్లో విధులు నిర్వహించినవారే. తిరిగి మళ్లీ భవానీపురం, కృష్ణలంక, గవర్నర్‌పేట పోలీసుస్టేషన్లలో పోస్టింగ్‌ల కోసం ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

- ప్రస్తుతం ఇబ్రహీంపట్నంలో విధులు నిర్వహిస్తున్న ముత్యాల సత్యనారాయణ అధికభాగం సత్యనారాయణపురం, సూర్యారావుపేటల్లోనే పనిచేశారు. వైసీపీ వీరవిధేయుడిగా పేరున్న ఈయన్ను మళ్లీ గవర్నర్‌పేటకు తీసుకొచ్చేందుకు టీడీపీ నాయకులే ప్రయత్నాలు చేస్తుండటం గమనార్హం.
- ఎన్నికల ముందు వరకు ఇబ్రహీంపట్నంలో సీఐగా చేసిన పలివెల శ్రీను ప్రస్తుతం సైబర్ క్రైంలో విధులు నిర్వహిస్తున్నారు. ఈయన మళ్లీ ఇబ్రహీంపట్నంలో పోస్టింగ్ కోసం తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. ఐదేళ్లూ వైసీపీ నాయకులతో అంటకాగిన సీఐల విషయంలో ఆచీతూచి వ్యవహరించాలని, అలాంటి వారిని ప్రోత్సహించవద్దని టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేలకు మొరపెట్టుకుంటున్నారు. వారి విన్నపాలను ఎమ్మెల్యేలు ఎంతవరకు ఆలకించారో ఒకటి రెండు రోజుల్లో తేలిపోనుంది.

సొంత జిల్లాలకు తహసీల్దార్లు

రెండు జిల్లాలకు 48 మంది రాక

- ఎన్నికల ముందు ఇతర జిల్లాలకు బదిలీ అయినవారే..
- రేపు మండలాల కేటాయింపు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్నికల ముందు ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన తహసీల్దార్లను సొంతజిల్లాలకు కేటాయిస్తూ శనివారం సీసీఎల్‌ఏ మెమో జారీ చేసింది. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన మొత్తం 48 మంది తహసీల్దార్లను సొంత జిల్లాలకు కేటాయించారు. మెమో ప్రకారం రెండు జిల్లాలకు తిరిగి రానున్న తహసీల్దార్లకు కలెక్టర్లు పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంటుంది. గతంలో తహసీల్దార్లు పనిచేసిన మండలాలు కాకుండా వేర్వేరు ప్రాంతాలు కేటాయించనున్నారు. వివాదాస్పదంగా ఉన్న వారిని, ఆరోపణలను ఎదుర్కున్న వారికి ఫోకల్ స్థానాలు ఇవ్వకూడదని సీసీఎల్‌ఏ నుంచి కలెక్టర్లకు మౌఖిక ఆదేశాలు వచ్చినట్టుగా తెలుస్తోంది. దీంతో గత ప్రభుత్వ హయాంలో అంటకాగి ఏకపక్షంగా పనిచేసిన వారికి, అవినీతి ఆరోపణలు ఉన్నవారికి నాన్ ఫోకల్ పోస్టులను కేటాయించే అవకాశాలున్నాయి.

బదిలీ అయినవారు వీరే..

జూ ఎన్నికలకు ముందు కృష్ణాజిల్లా నుంచి బదిలీపై ఇతర జిల్లాలకు వెళ్లిన జి.రవికాంత్, ఏఎస్ఎన్ రాధిక, ఎం.సురేష్ కుమార్,

- మిగతా 6లో

జగన్‌రెడ్డీ..శవ రాజకీయాలు మానుకో

» ప్రజలు ఛీకొట్టినా మార్పు రాలేదా: మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూలై 20: "ప్రజలు ఛీకొట్టినా జగన్‌రెడ్డిలో ఇంకా మార్పు రాలేదు. వినుకొండలో వ్యక్తిగత కక్షలతో జరిగిన హత్యను జగన్ రాజకీయం చేయాలనుకుంటున్నారు. ఇప్పటికైనా ఆయన శవ రాజకీ యాలు మానుకోవాలి." అని మంత్రి కొల్లు రవీంద్ర హితవు పలికారు. శని వారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఐదేళ్లుగా వైసీపీ నాయకులు పల్నాడులో ఎంతటి భయానక వాతావరణం సృష్టించారో అందరికీ తెలుస న్నారు. వ్యవస్థను చక్కబెట్టే ప్రయత్నంలో ఉన్న ప్రభుత్వంపై లేనిపోని అభాండాలు వేయడం తప్ప జగన్‌రెడ్డికి మరో పని లేదన్నారు. దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి జగన్‌రెడ్డి మాట్లాడాలన్నారు. ఎన్ని డ్రామాలు ఆడినా, కుట్రలు చేసినా ప్రజలు నమ్మబోరన్నారు. బాబాయ్ శవాన్ని అడ్డం పెట్టు కుని కోడికత్తి డ్రామాలాడి 2019లో జగన్ సీఎం అయ్యాడని విమర్శించారు.

మంత్రిని కలిసిన కృష్ణా ఎస్పీ



శాంతి భద్రతల పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్పీ ఆర్.గంగాధరరావుకు మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. శనివారం మంత్రిని నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఎస్పీ మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవేకు భూములిచ్చిన రైతులకు నష్టపరిహారం ఇప్పిస్తా: కేశినేని చిన్ని

విద్యాధరపురం, జూలై 20: విజయవాడ-నాగపూర్ 163(జీ) గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం కోసం భూములిచ్చిన రైతులకు నష్ట పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తానని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) హామీ ఇచ్చారు. జి.కొండూరు మండలం కవులూరుకు చెందిన రైతులు శని వారం ఎంపీని కలి శారు. తమకు నష్ట పరిహారం ఇప్పించాలని ఎంపీని కోరారు. అధికారులతో మాట్లాడి నష్టపరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తా నని చిన్ని హామీ ఇచ్చారు. గ్రామంలో 170 మంది హైవే నిర్మాణం కోసం భూములిచ్చారని, వారిలో 60 మందికే నష్ట పరిహారం అందిందని రైతులు తెలిపారు. మరో 20 మందికి అవార్డు వచ్చిందని, మిగిలిన 90 మందికి అవార్డు కాపీ రాలేదని, గెజిట్‌లో నమోదు కాలేదని వివరించారు. జంపాల సీతారామయ్య, భోగినేని రవీంద్ర రావు, చెరుకూరి వేణుగోపాల్, భోగినేని సూర్యప్రకాష్‌రెడ్డి, మల్లేశ్వరరావు, అశోక్ పాల్గొన్నారు. చిన్నిని సత్కరించారు.

మర్యాదపూర్వకంగా..



పల్లా శ్రీనివాసరావుకు స్వాగతం పలుకుతున్న కేశినేని చిన్ని

విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)ను గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పల్లా శ్రీనివాస్‌కు చిన్ని సాదర స్వాగతం పలికారు. తర్వాత వీరిద్దరూ పలు రాజకీయ అంశాలపై చర్చించుకున్నారు.

నూరు శాతం రాయితీపై ఆయిల్‌పామ్ మొక్కలు



మాట్లాడుతున్న కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ

అవనిగడ్డ రూరల్, జూలై 20: ఉద్యానవన శాఖ ద్వారా ఆయిల్‌పామ్ సాగు చేపట్టే రైతులకు వంద శాతం రాయి తీపై హెక్టారుకు రూ.29 వేలు విలువైన 143 మొక్కలను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. శనివారం అవనిగడ్డ మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగుపై ఉద్యానవన, వ్యవసాయ సహాయ సిబ్బందికి నిర్వ హించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆయిల్‌పామ్‌లో అంతర పంటలకు హెక్టారుకు ఏడాదికి రూ.5,250 చొప్పున నాలుగేళ్లలో రూ.21 వేలు రాయితీ లభిస్తుందని తెలిపారు. చాప్ కట్టర్, వర్మీ కంపోస్టు యూనిట్లు, వైర్ మెష్‌పై 50 శాతం, డ్రిప్ ఇరిగేషన్‌కు 50 శాతం రాయితీ ఇస్తున్నారని, రైతులు వినియోగించుకోవాలని సూచించారు. ఆయిల్‌పామ్ పంటకు ప్రకృతి విపత్తుల నుంచి ఎలాంటి నష్టం రాదని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు ప్రయోజనాలు- మార్కెట్ అవకాశాలపై జిల్లా రైతులకు అవ గాహన కల్పించేందుకు జూలై 15 నుంచి సెప్టెంబరు 15 వరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఎంపీపీ తుంగల సుమతి, ఉద్యానవన శాఖ జిల్లా అధికారి జె.జ్యోతి, ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ జీ.వి జయలక్ష్మి, ఘంటసాల కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వి.మంజువాణి, అవనిగడ్డ ఉద్యానశాఖ అధికారి ఎన్.రమేష్ పాల్గొన్నారు.

ప్రత్యేక కౌంటర్లలో బియ్యం, కందిపప్పు విక్రయాలు

కృష్ణలంక, జూలై 20: ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని రైతుబజార్లు, ఉషో దయ, మెట్రో, రిలయన్స్, డీమార్ట్ వంటి వ్యాపార సంస్థల్లో ప్రత్యేక కౌంటర్ల ద్వారా నాణ్యమైన బియ్యం, కందిపప్పు అమ్మకాలు జరుగుతున్నాయని, ప్రజ లందరూ వినియోగించుకోవాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కు మార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో రూ.181 ఉన్న దేశవాళి కందిపప్పును రూ.160కు, ఇప్పటివరకు 7 రైతు బజార్లలో, 27 బిగ్‌చైన్ రిటైల్ మార్కెట్లలో, 96 బియ్యం షాపుల్లో, 49 పప్పు ధాన్యాల షాపుల్లో ప్రత్యేక కౌంటర్లలో విక్రయిస్తున్నామన్నారు. కర్నూల్ సోనా మసూరి స్టీమ్ బియ్యం బహిరంగ మార్కెట్‌లో రూ.55.85 ఉందని, కిలో రూ.49కు, రూ.52.40 ఉన్న కర్నూల్ సోనామసూరి పచ్చిబియ్యాన్ని రూ.48కు తగ్గించి విక్రయిస్తున్నారని జేసీ తెలిపారు. ఇప్పటివరకు 5335 వినియోగదారులు 227.74 క్వింటాళ్ల బియ్యాన్ని, 6923 వినియోగదారులు 83.02 క్వింటాళ్ల కందిపప్పును ప్రత్యేక కౌంటర్లలో కొనుగోలు చేశారని తెలిపారు. కౌంటర్ల వద్ద సరుకుల నాణ్యతను టెక్నికల్ సిబ్బంది, తూకాన్ని లీగల్‌మెట్రాలజీ సిబ్బంది తనిఖీ చేస్తారని పేర్కొన్నారు.

గుమ్మడిదుర్రులో అతిసార

» ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆరుగురు గ్రామస్థులు

» నిల్వమాంసం తినడమే కారణమంటున్న పీహెచ్‌సీ వైద్యాధికారి



గుమ్మడిదుర్రులో పర్యటిస్తున్న డీఎంహెచ్‌వో సుహాసిని

పెనుగంచిప్రోలు, జూలై 20: గుమ్మడి దుర్రు గ్రామంలో అతి సార వ్యాధితో పలు వురు గ్రామస్థులు బాధ పడుతున్నారు. రెండు రోజుల క్రితం ఓ ఇంట్లో నిల్వ ఉంచిన మాం సాన్ని వండుకుని తిన టం వల్ల ఆ కుటుంబం తోపాటు పలువురు అతిసార బారిన పడ్డారని, జిల్లాలోని పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతు న్నారని పీహెచ్‌సీ వైద్యాధికారి ఇందిర తెలిపారు. గుమ్మడిదుర్రు దళితవా డకు చెందిన బంక స్పందన విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి, బంక రవి కుమార్ వి జయవాడ ఆంధ్రా ఆస్పత్రి, నక్క కుమారి విజయవాడ హను మాన్ ఆస్పత్రి, పత్తిపాటి తేజశ్రీ మంగళగిరి ఎయిమ్స్, పత్తిపాటి నాగ లక్ష్మి, ఉప్పులూరి రాహేలమ్మ నందిగామలోని పూజిత ఆస్పత్రిలో చికిత్స పొందు తున్నారని తెలిపారు. దళితవాడను డీఎంహెచ్‌వో డాక్టర్ సుహాసిని శని వారం సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. గ్రామంలో రక్షిత మంచినీటిని పరీక్షల కోసం విజయవాడకు పంపారు. అతి సార తగ్గుముఖం పట్టే వరకు గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహించాలని ఆదేశించారు. ఎంపీడీవో హర్షసాయి, తహసీల్దార్ అమ్మాజీ, ఈవోపీఆర్డీ ప్రసాద్ పాల్గొన్నారు.

వైదిక, స్మార్త రాత పరీక్షలకు దరఖాస్తులు

మచిలీపట్నం టౌన్, జూలై 20: దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వైదిక, స్మార్త, పాంచరాత్ర, వైఖానస, తంత్రసార, వీరశైవ, చాత్తాద శ్రీవైష్ణవ, గ్రామ దేవత ఆగమాలలో రాత పరీక్షలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. దరఖాస్తులను సెప్టెంబరు 20వతేదీలోగా పంపాలని ఆయన సూచించారు. 16-40 ఏళ్లలోపు అభ్యర్థులు రాతపరీక్షతో పాటు మౌఖిక పరీక్ష లకు హాజరవ్వాలని, 40 ఏళ్లు పైబడిన వారికి రాత పరీక్ష ఉండదని, మౌఖిక పరీక్షకు మాత్రమే రావాలని, వివరాలకు 9491000607, 94406 82996 నంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవాలని ఆయన సూచించారు.

స్పెషల్ పాలన



ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ప్రత్యేకాధికారుల నియామకం

» మండలాలపై పర్యవేక్షణ కోసం 16 మంది..

» ప్రతి బుధవారం మండలాల పరిధిలో ఆకస్మిక తనిఖీలు

» పాలనలో మార్కు చూపిస్తున్న కలెక్టర్ సృజన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరవేసేందుకు ఎన్టీ ఆర్ జిల్లా కలెక్టర్ సృజన 'స్పెషల్' పాలనకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసే కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా అమలు చేసేందుకు స్పెషల్ అధికారుల నియామకాలకు ఆమె శ్రీకారం చుట్టారు. ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా మండలాలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించారు. 16 మండలాలకు 16 మంది జిల్లాస్థాయి అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించారు. స్పెషల్ ఆఫీసర్లు చెప్పినట్టుగా మండల అధికారులు నడుచుకోవాలి. జిల్లావ్యాప్తంగా నియమించిన స్పెషల్ ఆఫీసర్లకు కలెక్టర్ సృజన విశేష అధికారాలను కల్పించారు. మండల అధికారులు, గ్రామ సచివాలయాల విధులను స్పెషల్ ఆఫీసర్లు పర్యవేక్షిస్తారు. తనిఖీ అధికారాలను కూడా వారికి కలెక్టర్ కల్పిం చారు. ప్రతి బుధవారం తప్పనిసరిగా గ్రామాల్లో పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, హాస్టల్స్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆర్బీకేలు, గ్రామ సచివాలయాలను ప్రత్యేకాధి కారులు తనిఖీలు చేయాలి. చెక్‌లిస్ట్‌ల ప్రకారం రిమార్క్స్ రాసి సంతకం చేసి కలెక్ట ర్‌కు పంపాలి. వాటిపై కలెక్టర్ చర్యలు తీసుకుంటారు. ఉపాధి హామీ పథకం, ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం(ఆర్‌డబ్ల్యూఎస్) విభాగాల పనులనూ వారు తనిఖీలు చేయాలి. స్పెషల్ ఆఫీసర్ల కోసం ప్రత్యేకంగా కలెక్టర్ వాట్సాప్‌గ్రూపును ఏర్పాటు చేయించారు. చెక్‌లిస్ట్ ప్రకారం సేకరించిన డేటాపై సంతకం చేసి కాపీని గ్రూపులో పోస్టు చేయాలి.

మండలాధికారులు పనిచేయకపోతే స్పెషల్ ఆఫీసర్లకు ఫిర్యాదు

మండలాధికారులు ప్రజలను ఇబ్బందులు పెట్టినా, కార్యాలయాలు చుట్టూ తిరి గేలా చేసినా తక్షణం స్పెషల్ ఆఫీసర్లకు ఫిర్యాదు చేయొచ్చు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే మండలాధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు స్పెషలాఫీసర్లు రాస్తారు.

స్పెషల్ ఆఫీసర్లు ..ఫోన్ నంబర్లు

ఎ.కొండూరు మండలానికి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కె.విద్యాసాగర్ (9989932852), గంపలగూడేనికి మెప్మా పీడీ పి.వెంకటనారాయణ(7901610163), విస్స న్నపేటకు జిల్లా మత్స్యశాఖ అధికారి వి.పెద్దిబాబు (9848350481), రెడ్డిగూడేనికి జిల్లా ఉద్యానశాఖాధికారి పి.బాలాజీకుమార్(7995086772), తిరువూరుకు డ్వామా పీడీ జె.సునీత(9441871260), జగ్గయ్యపేటకు సమగ్ర శిక్ష ఏపీడీ జి.మహేశ్వరరావు(9849902595), వత్సవాయి కి జిల్లా యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ యు.శ్రీనివాసరావు (9849909069), పెనుగంచిప్రోలుకు తూనికల కొలతల శాఖ అధికారి ఎ.కృష్ణ చైతన్య(9398143677), నందిగా మకు డీడబ్ల్యూ అండ్ సీడబ్ల్యూ పీడీ జి.ఉమాదేవి (80747 83959), చందర్లపాడుకు గ్రౌండ్ వాటర్ డీడీ బి.నాగరాజు(83333991210), వీరులపాడుకు ఏపీఎంఐపీ పీడీ పీఎం సుభాని(7995087045), జి.కొండూరుకు సివి ల్ సప్లయిస్ డీఎస్వో జి.మోహన్‌బాబు(80087 18146), మైలవరానికి డీపీవో ఎస్వీ శివప్రసాద్‌యాదవ్ (9704701961), ఇబ్రహీంపట్నానికి కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ తహసీల్దార్ ఇ.కిరణ్మయి(9154970452), విజ యవాడ రూరల్ మండలానికి జిల్లా కో ఆపరేటివ్ ఆడిట్ అధికారి చిత్రపు శైలజ(9100109180)ను స్పెషల్ ఆఫీసర్లుగా కలెక్టర్ సృజన నియమించారు.

ఆర్ అండ్ బీ అధికారులొచ్చేవరకూ కదలను

» రోడ్డుపై నీటిలో స్టూల్ వేసుకుని కూర్చున్న తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు



తిరువూరు టీటీడీ కల్యాణ మండపం వద్ద నీటిలో స్టూల్‌పై కూర్చున్న కొలికపూడి

తిరువూరు, జూలై 20: ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో పట్టణంలోని అంతర్గత రహదారులు, డ్రెయిన్లను ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు శనివారం సైకిల్‌పై తిరుగుతూ పరిశీ లించారు. పట్టణంలోని కోకిలంపాడు వెళ్లే రోడ్డులో టీటీడీ కల్యాణ మండపం వద్ద రోడ్డుపై పెద్దపెద్ద గోతుల్లో నీళ్లు నిలిచి రోడ్డుపై రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతు న్నారని ఆయన గమనిం చారు. దీంతో ఆయన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై నిలి చిన మురుగునీటిలో స్టూల్ వేసుకుని కూర్చు న్నారు. అర్‌అండ్‌బీ అధికారులు అక్కడకు వచ్చేవరకు కదిలేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. దీంతో ఆర్ అండ్ బీ ఏఈఈ గాయత్రిదేవి అక్కడికి వచ్చారు. రహదారి అభివృద్ధికి రూ.1.95 కోట్లు నిధులు మంజూరయ్యాయని తెలి పారు. టెండర్ ప్రక్రియ పూర్తయిందని, వర్షాకాలం కావడం వల్ల రోడ్డుపనులు ప్రారం భించలేదని ఎమ్మెల్యేకు తెలిపారు. తాత్కాలికంగా రహదారిపై గోతులు పూడ్చించాలని ఆమెను ఎమ్మెల్యే ఆదేశించారు. వర్షాలు తగ్గాక రోడ్డుపై గోతులను పూడ్చి వేస్తామని ఎమ్మెల్యేకు ఆమె వివరించారు. ఎమ్మెల్యే రోడ్డుపై బైఠాయించడంతో మున్సిపల్ కమిష నర్ లోవరాజు, సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. పట్టణంలో రహదారులపై నీరు నిల్వకుండా కచ్చా డ్రెయిన్లు తీయించాలని వారిని ఆదేశించారు.

తెలంగాణకు ఇసుక రవాణా

» లారీ స్వాధీనం..డ్రైవర్‌పై కేసు





నెంబరు ప్లేట్‌పై టీజీ తొలగించి ఇసుక రవాణా

జగ్గయ్యపేట రూరల్, జూలై 20: తెలంగాణకు ఇసుకను అనధికారికంగా తరలిస్తున్న లారీని అంతర్రాష్ట్ర సరిహద్దు గరికపాడు వద్ద శుక్రవారం రాత్రి స్వాధీ నం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చిల్లకల్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. టీజీ 29 టీవో 0789 నంబరు లారీలో కంచికచర్ల మండలం మోగులూరు వద్ద ఇసుక లోడ్ చేసుకుని వే బిల్లులో మాత్రం జగ్గయ్యపేట మండలంలోని బూదవాడకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారని వాహనం తెలంగాణలోకి వెళ్తుండటంతో లారీతో పాటు వెలది కొత్తపాలేనికి చెందిన డ్రైవర్ కుంచపు రామకృష్ణ, మహేష్‌పై కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

వాహనాన్ని గుర్తించకుండా..

సీసీ కెమెరాలు ఫొటోలు తీసినా వాహనాన్ని గుర్తించకుండా తెలంగా ణకు ఇసుక తరలించే వాహనాల రిజిస్ట్రేషన్ బోర్డుపై టీజీని అక్రమార్కులు తొలగిస్తున్నారు. ఆధార్ కార్డుతో రోజుకు 20 టన్నుల వరకు ఇసుక తీసుకెళ్లవచ్చన్న నిబంధనను ఉపయోగించుకుని, ట్రాక్టర్, లారీ యజమానులు డంపింగ్ యార్డుల నుంచి ఇసుక తెచ్చి ఏదో ఒక ప్రాంతంలో తెలంగాణ లారీల్లోకి నింపుకొని, జాతీయ రహదారి ద్వారా కానీ గ్రామాల్లోని డొంక రోడ్ల ద్వారాగానీ తెలంగాణాలకు తరలిస్తున్నారు.

దంత వైద్య కళాశాలలో ఖాళీ పోస్టులు

ప్రభుత్వాసుపత్రి, జూలై 20: ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో కాం ట్రాక్ట్ పద్ధతిలో డిస్ట్రిక్ట్ కమిటీ ద్వారా ఖాళీ పోస్టుల నియామకానికి దర ఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. డెంటల్ హైజీనిస్ట్-1, డెంటల్ టెక్నీషి యన్-1, డెంటల్ మెకానిక్-1 పోస్టుకు అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాల కోసం వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

డీజిల్‌కు బదులు నీళ్లు

» లబోదిబోమంటున్న ట్రాక్టర్ యజమాని

» బంక్ యజమాని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడని ఆవేదన



పుట్రేలకు చెందిన లింగాల శ్రీనివాసరావు ట్రాక్టర్ నుంచి బయటకు తీస్తున్న నీరు

విస్సన్నపేట, జూలై 20: పుట్రేలలో వెంకటేశ్వర రావు ఫిల్లింగ్ సెంటర్ (పెట్రోల్ బంక్)లో అదే గ్రామానికి చెందిన లింగాల శ్రీనివాస్ అనే ట్రాక్టర్ యజమాని డీజిల్‌ను రూ.3 వేల కొట్టించాడు. పొలం పనులకు వెళుతుండగా మధ్యలో ట్రాక్టర్ ఆగి పోయింది. దీంతో ట్రాక్టర్ యజమాని శ్రీనివాస్ మెకా నిక్‌ను పిలిచి ట్రాక్టర్‌ను చూపించారు. ట్రాక్టర్‌లో డీజిల్‌కు బదులు నీళ్లు ఉన్నాయని ఆయన గుర్తిం చాడు. దీనిపై హెచ్‌పీసీఎల్ బంక్ యజమానిని అడు గగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని శ్రీనివాసరావు వాపోయాడు. ట్రాక్టర్ మర మ్మతుకు భారీగా ఖర్చవుతుం దని, మరో పక్క వ్యవసాయ పనులకు అంతరాయం ఏర్పడుతుందని ఆవేదన చెందుతున్నాడు. దీనిపై బంక్ మేనేజర్‌ను వివరణ కోరగా.. ఉదయం నుంచి పదుల సంఖ్యలో డీజిల్ విక్రయాలు చేశామని ఎవ్వరూ నీరు కలిసినట్లు ఫిర్యాదు చేయలేదని, డీజిల్‌లో కల్తీ జరగలేదని తెలిపారు.

సొసైటీపైనే గోదాముల నిర్మాణ భారం..!

రెండు గోదాములకు గత ప్రభుత్వ హయాంలో రూ. 80లక్షల రుణం

ఏడాదిగా నిర్మాణాలు నిలిచిపోవడంపై సభ్యుల ఆందోళన

నున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశంలో ఆందోళన

విజయవాడ రూరల్, జూలై 20: గత వైసీపీ ప్రభుత్వం ఇష్టానుసారంగా తమ సొంత వారికి కాంట్రాక్ట్‌లను కట్టబెట్టే క్రమంలో గోదాముల నిర్మాణ భారాన్ని సొసైటీలపై మోపడంపై నున్న పీఏసీ ఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం) సర్వసభ్య సమావేశం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. గత జగన్ ప్రభుత్వం గొప్ప కోసం రూ.80లక్షలతో 2 గోదాములను మంజూరు చేసి, ఆ భారాన్ని నున్న సొసైటీపై మోపడంపై సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే కాంట్రాక్టర్లు పనులు నిలిపేసి వెళ్లిపో యారని, ఇప్పటికే సొసైటీ రూ.25 లక్షలు ఖర్చు చేసిందన్నారు. కాగా సొసైటీ మాత్రం వడ్డీ చెల్లించాల్సి వస్తోందన్నారు. సహకార శాఖ అధికారులు తక్షణమే నిర్మాణ పనులు కొనసాగించి గోదాములను విని యోగంలోకి తేవాలని లేకుండా అవి సొసైటీకి అదనపు భారంగా మారే ప్రమాదం ఉందన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా సొసైటీల త్రీమెన్ కమిటీల కాలపరిమితి ముగియడంతో పర్సన్ ఇన్‌చార్జ్‌గా (పీఐ సీ) కో-ఆపరేటివ్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ వి.కిశోర్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. ఆయన శనివారం అధ్య క్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు సభ్యులు గోదాముల నిర్మాణ పనులు నిలిచిపోవడంపై ప్రశ్నించారు. గతంలోనే రూ.1.47 కోట్లతో బహుళ ప్రయోజనాలు గల గోదామును ని ర్మించినప్పటికీ, అదనంగా రూ.80లక్షలతో ఇంకో రెండు గోదాముల నిర్మాణం ఎందుకని ప్రశ్నించారు. గత ప్రభుత్వ విధానం ప్రకారం సొసైటీ త్రీమెన్ కమిటీ తీర్మానం చేసిందని, నిర్మాణ బాధ్యతలతో సం బంధం లేదని, ఆ నిధులను తిరిగి చెల్లించాల్సిన బాధ్యత సొసైటీదేనన్నారు. నిర్మాణాల కొనసాగింపుపై ప్రశ్నించగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్నారు. ఇదిలా ఉండగా గోదాము ఎదుట ఖాళీస్థలంలో గత కమిటీ ఓ బేకరికి అద్దెకివ్వడంపై ప్రస్తావించగా ఆదాయం కోసమే అద్దెకివ్వాలని నిర్ణయించామని, మెజార్టీ సభ్యులు వ్యతిరేకించడంతో విరమించుకున్నట్టు తెలిపారు. దీంతో గోదాము ఎదుట ఉన్న కంటై నర్ హౌస్‌ను తక్షణం తొలగించాలని సభ్యులు కోరారు. దీనిపై సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. బ హుళ ప్రయోజనాల గోదామును యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు 15ఏళ్లకు అద్దెకి స్తూ అగ్రిమెం ట్ రాశారని, అందులో బ్యాంక్ ఏ క్షణంలోనైనా తాము ఖాళీ చేస్తామనే క్లాజ్ పెట్టటంపై సభ్యులు ప్ర స్తావించగా అలాంటిదేమి లేదని కిశోర్‌బాబు చెప్పారు. అగ్రిమెంట్ కాపీ ప్రతులను సభ్యుల కు అందజే యాలని రైతులు కోరారు. గోదాములో మిగిలిన 3వేల అడుగులను అద్దెకివ్వడంపై చర్చ జరిగింది.



టమోటా ధరల నియంత్రణకు కృషి

● జిల్లా అగ్రిట్రేడ్ మార్కెటింగ్ అధికారి మంగమ్మ

పటమట, జూలై 20: టమోటాల ధరల నియంత్ర ణకు కృషి చేస్తున్నామని జిల్లా అగ్రిట్రేడ్ మార్కెటింగ్ అ ధికారి మంగమ్మ తెలిపారు. నిత్యావసరాల ధరలను త గ్గించేలా చర్యలు తీసుకోవాలన్న సీఎం చంద్రబాబు ఆదే శాల మేరకు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కూరగాయల ధరలను తగ్గించి ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు ప్రయత్నం చేస్తున్నట్టు వివరించారు. జిల్లాలో మార్కెటిం గ్‌శాఖ ద్వారా 10రోజుల నుంచి మదనపల్లి, అనంతపురం, పుంగనూరు నుంచి సుమారు 26టన్నుల టమోటాలను కొనుగోలు చేశామన్నారు. ఇక్కడ హోల్‌సేల్ మార్కెట్లో రైతుకిచ్చే ధర కంటే తక్కువ ధరకే మార్కెటింగ్ శాఖ ద్వారా నగరంలోని 9 రైతు బజార్లలో టమోటాలను అందించినట్టు తెలిపారు. 10రోజుల క్రితం కిలో టమోటా ధర రూ.65 ఉండగా, ప్రస్తుతం 52కు తగ్గిందన్నారు. జాయింట్ డైరెక్టర్ కె. శ్రీనివాస్ రావు ఎప్పటికప్పుడు సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారని అందుకు అనుగు ణంగా చర్యలు తీసుకుంటున్నట్టు ఆమె తెలిపారు.

వైసీపీ వీరవిధేయుల పైరవీలు

(ఐదో పేజీ తరువాయి)


ఈయన దగ్గరుండి మరీ వైసీపీ మూకలను ప్రోత్స హించారన్న ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ మూకల రాళ్ల దాడిలో కనకారావుకు దెబ్బ తగిలింది. ఎవరు దాడి చేశారన్న విషయంలో స్పష్టత ఉన్నా ఆయన మాత్రం టీడీపీ నాయకులపై హత్యాయత్నం కేసు పెట్టేశారు. వారిని అరెస్టు చేసే వరకూ నిద్రపోలేదు. తెలుగు మహిళా నాయకురాలు ముల్పూరి సాయి కల్యాణిని ఆమె బెడ్‌రూంలోకి వెళ్లి మరీ అరెస్టు చేసి తీసుకెళ్లారు. ఈయన ప్రస్తుతం గన్నవరం విమానా శ్రయంలో ఇమ్మిగ్రేషన్ సీఐగా విధులు నిర్వహి స్తున్నారు. మంచి పోస్టింగ్ కోసం జోరుగా పైరవీలు చేసుకుంటున్నారు.

● హనుమాన్‌జంక్షన్ సీఐగా పనిచేస్తున్న నరసిం హమూర్తి వంశీకి అనుంగు అనుచరుడన్న ముద్ర ఉంది. లోకేశ్ యువగళం పాదయాత్ర సమ యంలో రంగన్నగూడెంలో టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య ఫ్లెక్సీకి సంబంధించి గొడవ తలెత్తింది. ఈ ఘటనపై టీడీపీ నాయకులు దేవినేని ఉమా, కొల్లు రవీంద్ర, కొనకళ్ల నారాయణ పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదు. వారు పోలీసు స్టేషన్‌లో ఉన్న సమాచారాన్ని వంశీకి చేరవేయ డంతో ఆయన ఆగమేఘాలపై వచ్చి టీడీపీ వారిపై తన అనుచరులతో ఎదురు కేసు పెట్టిం చారు. గన్న వరంలో టీడీపీ కార్యాలయంపై దాడి అనంతరం గన్నవరం ఇన్‌చార్జి సీఐగానూ నరసింహమూర్తి చేశారు. ఆ సమయంలో టీడీపీ నాయకుడు పట్టా భిని అరెస్టు చేయడంలో అత్యుత్సాహం చూపారు. ఈయన ప్రస్తుత బదిలీల్లో నందిగామ నియోజకవ ర్గంలోని కంచికచర్ల సీఐగా వెళ్లేందుకు పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేస్తున్నారు. స్థానిక టీడీపీ నాయకు లను ఆశ్రయించి తనను కంచికచర్ల సీఐగా బదిలీ చేయించాలని కోరుతున్నారు.

● మచిలీపట్నం నియోజకవర్గ పరిధిలో ఐదు పోలీ సుస్టేషన్లు ఉండగా, ఐదుగురు సీఐలు విధులు నిర్వ హిస్తుంటారు. వీరంతా ఎన్నికల సమయంలో పేర్ని నాని ఏరికోరి తెచ్చుకున్న వీరభక్తులు. టీడీపీ అధికా రంలోకి వచ్చాక కూడా వీరు తమ విధేయతను మార్చుకునే ప్రయత్నం చేయలేదు. దీంతో తప్పని పరిస్థితుల్లో ఆర్‌పేట సీఐగా ఉన్న శ్రీనివాస యాద వ్‌ను తక్షణం ఆ స్థానం నుంచి తొలగించాలని మంత్రి కొల్లు రవీంద్ర కోరడంతో అప్పటి ఎస్పీ ఆయ న్ను తప్పించారు. ఇక్కడ పనిచేస్తున్న మిగిలిన వారు తమకూ ఎలాగూ బదిలీ తప్పదని భావించి జిల్లాలోని కీలకస్థానాలకు పైరవీలు చేసుకుంటు న్నారు.

● గుడివాడ నియోజకవర్గ పరిధిలోని ముగ్గురు సీఐలకు కొడాలి నాని వీరవిధేయులుగా పేరు. వీరం దరినీ సాగనంపేందుకు స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పట్టుగా ఉన్నారు. కానీ, గతంలో ఇక్కడ పని చేసిన ఎస్ఎల్ సోమేశ్వరరావు, రామకృష్ణను మళ్లీ గుడివాడ తీసుకొచ్చేందుకు సిద్ధమవుతుండటాన్ని కార్యకర్తలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వీరు గుడి వాడలో పనిచేసిన సమయంలో కొడాలి నాని ఆడ మన్నట్లు ఆడేవారు. టీడీపీ నాయకులు, కార్యక ర్తలను తీవ్రంగా వేధించేవారు. అలాంటి వారిని మళ్లీ గుడివాడ ఎలా తీసుకొస్తారని ప్రశ్నిస్తున్నారు.

గుర్రపుడెక్క, తూటుకాడ తొలగింపు పనులు ప్రారంభం



దేవరకోట వద్ద తూటుకాడ తొలగిస్తున్న యంత్రం

ఘంటసాల, జూలై 20: గుం డేరులో పేరుకుపోయిన గుర్రపుడెక్క తొలగింపు పనులను శనివారం డ్రెయినేజీ అధికారులు ప్రారంభిం చారు. 'డ్రెయిన్లలో పేరుకుపోయిన డెక్క' పేరుతో ఆంధ్రజ్యోతిలో శని వారం ప్రచురితమైన కథనానికి అధి కారులు స్పందించారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు వేగవంతం చేయిం చారు. కొడాలి, ఘంటసాలపాలెం, దేవరకోట, బిరుదుగడ్డ గ్రామాల్లో గుండేరు డ్రెయి న్‌పై ఉన్న వంతెనల వద్ద పేరుకుపోయిన తూటుకాడ, గుర్రపుడెక్క తొలగింపు పనులు చేపట్టారు. చాట్రగడ్డ దళితవాడ వంతెన వద్ద కూలీల సాయంతో డ్రెయిన్‌లో ఉన్న గుర్రపుడెక్కను తొలగించారు. పనులను ఏఈఈ హరీష్ పర్యవేక్షించారు. గుం డేరు డ్రెయిన్‌లో వంతెనల వద్ద నీటి పారుదలకు అడ్డంగా నిలిచిపోయిన గుర్రపు డెక్కను ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ నిధుల కింద తొలగింపు పనులు చేపట్టామని డ్రెయినేజీ డీఈఈ పి.వెంకటేశ్వరరావు తెలిపారు.

సొంత జిల్లాలకు తహసీల్దార్లు

(ఐదో పేజీ తరువాయి)

టి.మల్లికార్జునరావు, బి.శ్రీనునాయక్, కేజీఎస్ సోమేశ్వర రావు, డి.ప్రశాంతి, ఎల్‌వీఎస్ రామకృష్ణ, బి.రామానాయక్, కె.గోపాలకృష్ణ, పి.మధుసూదనరావు, కె.నవీన్‌కుమార్, వి.రామకోటేశ్వరరావు, షేక్ లతీఫ్‌పాషా, కె.సత్య సులోచన, డి.వనజాక్షి, అబ్దుల్ రెహమాన్ మస్తానా, వి.నాగభూషణం, వి.భావన్నారాయణ, కె.ఆంజనేయులు, డి.సునీల్‌బాబు, సీహెచ్ నరసింహారావు, బి.నీల్సన్‌పాల్ బాబు, డి.రాజ్యలక్ష్మి, కె.మస్తాన్, పీఎన్‌వీ ప్రసాద్, కె.వెంకట శివయ్య, సీహెచ్ వీరాంజనేయప్రసాద్, వై.రంగారావు, వీవీ భరత్‌రెడ్డి తిరిగి వెనక్కి వస్తున్నారు.

● ఎన్నికలకు ముందు ఎన్టీఆర్ జిల్లా నుంచి బదిలీపై ఇతర జిల్లాలకు వెళ్లిన షేక్ ఇంతియాజ్ పాషా, బి.హేమ కుమారి, సీహెచ్ దుర్గాప్రసాద్, ఎం.పాల్, ఎన్.సురేష్ బాబు, జి.బాలకృష్ణారెడ్డి, చాట్ల వెంకటేశ్వర్లు, ఎస్.నర సింహారావు, జె.సుశీలాదేవి, బి.అసయ్య, కె.లక్ష్మీ కల్యాణి, ఎస్.శ్రీనివాసరెడ్డి, వి.రాజకుమారి, ఎం.శ్రీనివాసరావు, కాళీలక్ష్మి, ఎం.వెంకట రామయ్య, ఆర్‌వీ రోహిణీదేవిని తిరిగి సొంత జిల్లాకు కేటాయించారు. వీరందరికీ కలెక్టర్లు సోమవారం నాటికి మండలాలను కేటాయించనున్నారు.

మెట్ట పంటలు కళకళ

» మరో రెండు రోజులు వర్షం కురిస్తే పంటలు దెబ్బతింటాయని రైతుల ఆందోళన



కళకళలాడుతున్న పెసర చేను

కంచికచర్ల, జూలై 20: కురుస్తున్న వర్షాలవల్ల నంది గామ డివిజన్ పరిధిలో మెట్ట పంటలు కళకళలాడుతున్నాయి. నాన్నుడు వాన కావటంతో ఇప్ప టికే భూమిలో తేమశాతం ఎక్కు వైంది. వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నట్టుగా మరో రెండు, మూడు రోజులు భారీ వర్షాలు కురిస్తే పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది నందిగామ వ్యవసాయ సబ్ డివి జన్‌లో పత్తి, పెసర, మినుము, మొక్కజొన్న, కంది, మిర్చి పంటలు 60 వేల ఎకరాల్లో సాగు చేశారు. చెరువులు, ఎత్తిపోతల పథకాల ఆయకట్టులో వరినారుమళ్లు పోశారు. వర్షాలకు పత్తి మొక్కలు ఎదుగుతున్నాయి. మొక్కజొన్న రెండు, మూడు అడుగులు పెరిగింది. పెసర పూతకు వచ్చింది. అక్కడక్కడ పెసర చేలకు పల్లాకు తెగులు సోకింది. వర్షం ఇంతటితో ఆగిపోతే పంటలకు ఎంతో మేలు చేకూరుతుంది. రైతులు కూడా ఎరువులు వేసి, కలుపుమొక్కలు తీయటానికి వీలుపడుతుంది. ఈదురు గాలులకు పలుచోట్ల ముదురు పెసర, మొక్కజొన్న చేలు తలవాల్చాయి. తేమ ఎక్కువ కావడం వల్ల ఇంకా వర్షం కురిస్తే పంటలకు దెబ్బతింటాయి. గాలి ఆడక, ఎండ తగలక ఎండుతెగులు, కుళ్లుతెగులు వ్యాపించి, వేర్లు కుళ్లిపోతాయి. మరో రెండు మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతుండడంతో పైర్లు నిలువునా దెబ్బతింటాయని రైతులు చెబుతున్నారు.

రక్షణ చర్యలు తీసుకోవాలి

ఇంకా వర్షాలు కురిస్తే మెట్ట పంటలకు దెబ్బ. వర్షాలు ఆగిన వెంటనే రైతులు పంటలకు రక్షణ చర్యలు తీసుకోవాలి. పొలాల్లో నీళ్లు నిలిస్తే వెంటనే బయటకు పంపాలి. ఎకరానికి 25 నుంచి 30 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ మొక్కల మొదళ్ల వద్ద చల్లాలి. **- రమేష్, వ్యవసాయ అధికారి, చందర్లపాడు**

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	118, 127, 138
చికెన్ విత్ స్కిన్	224
చికెన్ స్కిన్‌లెస్	234

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.30

ఆంధ్రా లయోలాలో పుస్తక పఠనం కార్యక్రమం

భారతీనగర్, జూలై 20: ఆంధ్రా లయోలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో, ఐక్యూఏసీ, గ్రంథాలయం సంయుక్తం ఆధ్వర్యంలో శనివారం రీడ్ రిఫ్లెక్ట్ రిజునవేటు(పుస్తక పఠనం) కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి రచయిత, సామాజిక వేత్త, కళాశాల డీన్ రామకృష్ణ ముళ్లపూడి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం ప్రతి విద్యార్థి అలవర్చుకోవాలన్నారు. కళాశాల డైరెక్టర్ ఫాదర్ డాక్టర్ బి.జోజిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఒ.మహేష్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఫాదర్ బాలస్వామి, ఐక్యూఏఆర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ సిస్టర్ క్యాండీ కూనా, గ్రంథపాలకురాలు స్వాతి కిరణ్, ఉప గ్రంథపాలకులు చైతన్యదాస్, విభాగ అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు ఆషాఢ సారె

పాత రాజరాజేశ్వరిపేట, జూలై 20 : ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని కంసాలిపేటలోని కనకదుర్గ అమ్మవారికి శనివారం మహిళలు సారె సమర్పించారు. కంసాలిపేట నుంచి కోలాటం, మేళతాళాలతో మహిళలు పట్టు వస్త్రాలు, పొంగళ్లతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి సారె సమర్పించారు.

ఎడతెరిపిలేని వర్షం..రోడ్లు జలమయం

మూడు, నాలుగు డివిజన్లలో పలు ప్రధాన, అంతర్గత, సర్వీస్ రోడ్లలోకి వర్షపునీరు



జలమయమైన ఈఎస్ఐ రోడ్డు



ఎన్టీఆర్ కాలనీ నుంచి లయోలాకు వెళ్లే రోడ్డులో

భారతీనగర్, జూలై 20 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గత రెండు రోజుల నుంచి నగరంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో మూడు, నాలుగు డివిజన్లలోని పలు ప్రధాన, అంతర్గత, సర్వీస్ రోడ్లు జలమయమయ్యాయి. శుక్రవారం రాత్రి కురిసిన గాలి వానకు కాలనీలోని అంతర్గరోడ్డులోని పలు చెట్లు కొమ్మలు విరిగిపోయాయి. అంతే కాకుండా భారతీనగర్ సర్వీస్ రోడ్డు, గురునానక్ కాలనీ మెయిన్ రోడ్డు, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ మెయిన్ రోడ్డు, దీపికా భవన్ రోడ్డు, దంత వైద్యశాల రోడ్డు, ఎన్టీఆర్‌కాలనీ మెయిన్ రోడ్డు, ఎన్టీఆర్ కాలనీ నుంచి లయోలా కళాశాలకు వెళ్లే రోడ్డు, మహానాడు రోడ్డు నాగార్జున నగర్ కాలనీల్లో అంతర్గ రోడ్లు, ఈఎస్ఐ ఆసుపత్రి రోడ్డు, ఆటోనగర్ సమీపంలోని గమేళా బజార్‌రోడ్లు పల్లంగా ఉండడంతో పాటు సైడ్ డ్రెయినేజీలు పూడికతో నిండిపోయాయి. దీంతో పలు కాలనీ ప్రధాన, అంతర్గత రహదారులు జలమయమయ్యాయి. ఆ సమయంలో ద్విచక్రవాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగించారు.

ప్రమాదకరంగా మారిన అవుట్‌ఫాల్ డ్రెయినేజీలు

రెండు రోజుల నుంచి నగరంలో కురుస్తున్న వర్షానికి సమీప కాలనీల నుంచి వరద నీరు ఒక్కసారిగా రావడంతో లయోల కళాశాల వెంబడి ప్రవహిస్తున్న పుల్లేటి మురుగు కాలువ(అవుట్ ఫాల్ డ్రెయినేజీ) పొంగిపొర్లుతూ ప్రమాదాలకు నిలయంగా మారింది. శనివారం ఉదయం వరద నీరు ఎక్కువగా రావడంతో దంతవైద్యశాల సమీపంలో, ఈఎస్ఐ సెంటర్లలో రోడ్డు మీద ప్రవహించడంతో వాహనదారులు భయపడుతూ ప్రయాణం చేయాల్సి వచ్చింది.

శాకంబరీ అలంకారంలో మహాలక్ష్మి అమ్మవారు



చిట్టినగర్, జూలై 20: శాకంబరీ ఉత్సవాలు రెండో రోజు శనివారం పాతబస్తీలోని దేవాలయాలు భక్తులతో కళకళలాడాయి. భక్తులు సమర్పించిన కూరగాయలు, ఆకుకూరలతో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. చిట్టినగర్‌లో మహాలక్ష్మి అమ్మవారు శాకంబరీ అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు సమర్పించిన కూరగాయలు, ఆకు కూరలతో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. దేవస్థానం కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించింది. కొత్తపేట గంగానమ్మ, మంగళగౌరి అమ్మవార్లు శాకంబరీ అలంకారంలో దర్శనమిచ్చారు.

సాయిబాబాకు కృష్ణానదీ జలాలతో అభిషేకం



భవానీపురం, జూలై 20 : గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా హెచ్‌బీ కాలనీ సంకల్ప సిద్ధి షిర్డీసాయి బాబాకు శనివారం ఉదయం కృష్ణానదీ జలాలతో ఘనంగా అభిషేకం చేశారు. 108 మంది ముత్తైదువులు, కన్యలు కృష్ణానది నుంచి కలశాలతో ఊరేగింపుగా వచ్చి బాబాకు స్వయంగా అభిషేకాలు చేశారు. తొలుత చెరుకు రసంతో ప్రధాన అర్చకులు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రెండు వేల మందికి అన్నదానం చేశారు. కమిటీ అధ్యక్షుడు బుర్లె వెంకటేశ్వరరావు, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఏపీఎస్ఈబీ సర్వీస్ రెగ్యులేషన్ చేయండి

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌కు విద్యుత్ ఉద్యోగుల వినతి



పటమట, జూలై 20: విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్(జేఎల్ఎం గ్రేడ్-2) అందరికీ ఏపీఎస్ఈబీ సర్వీస్ రెగ్యులేషన్ వర్తింపచేసి, అసిస్టెంట్ లైన్‌మెన్ ప్రమోషన్లు కల్పించే విధంగా కృషి చేయాలని యూనియన్ నాయకులు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ను కోరారు. అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్ ఉద్యోగులు, సీఐటీయూ అనుబంధ సంస్థ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నాయకులు తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ను కలిశారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు తెలియజేసిన అంశాలను ముఖ్యమంత్రి చంద్రబాబుకు, విద్యుత్‌శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు.

మూడో డివిజన్‌లో గద్దె పర్యటన

గుణదల: స్థానిక 3వ డివిజన్ విజయలక్ష్మి కాలనీలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ శనివారం పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చిన్నపాటి వర్షానికి రోడ్లు జలమయం అయిపోతున్నాయని స్థానికులు గద్దెకు వివరించారు. ఈ ప్రాంతంలో గంజాయి మత్తులో కొంతమంది మహిళలను అసభ్యకరపదజాలంతో దూషిస్తూ గొడవలు చేస్తున్నారని వివరించారు. దానికి సానుకూలంగా స్పందించిన ఆయన చంద్రబాబు నాయుడు గంజాయి అనే మాట రాష్ట్రంలో వినపడకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ఉడా మాజీ చైర్మన్ తూమాటి ప్రేమనాథ్, కార్పొరేటర్ ప్రసాద్, యలమంచలి రాజేంద్రప్రసాద్, జయశంకర్, శ్రీనివాస్, కొర్రపాటి సురేంద్ర, చలసాని రమణ, కోడూరు అంజనేయ వాసు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

పాయకాపురం, జూలై 20 : బాలికకు ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి మోసగించిన యువకుడిపై నున్న రూరల్ పోలీసులు శనివారం పోక్సో కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం న్యూ రాజీవ్‌నగర్‌కు చెందిన బాలిక(14)కు భీమవరంకు చెందిన రంజిత్(18) ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యాడు. ప్రేమ పేరు చెప్పి బాలికను భీమవరం రమ్మని పిలవడంతో బాలిక ఇంట్లో చెప్పకుండా ఈనెల 18న వెళ్లిపోయింది. బాలిక కనిపించకపోవడంతో నున్న రూరల్ పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా విచారించిన పోలీసులు బాలిక భీమవరంలో ఉన్నట్లు గుర్తించి తీసుకువచ్చారు. యువకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు పోక్సో కింద కేసు నమోదు చేశారు.

కూరపాటి స్కూల్‌లో ఘనంగా గురుపూజోత్సవం

వన్‌టౌన్, జూలై 20: వన్‌టౌన్‌లోని కూరపాటి స్కూల్‌లో వ్యాసపూర్ణిమ సందర్భంగా శనివారం గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. వ్యాసభగవానుడి చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి వెలిగించి పూజలు నిర్వహించిన అనంతరం ప్రిన్సిపాల్ గానుగుల యుగంధరా చార్యను సత్కరించారు.

గొలుసు చోరీపై ఫిర్యాదు

అజిత్‌సింగ్‌నగర్, జూలై 20 : తన బంగారం గొలుసు చోరీకి గురైందని ఓ జీఆర్‌పీ ఎస్సై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసింది. వివరాల ప్రకారం న్యూ రాజరాజేశ్వరి పేటకు చెందిన వాటేరు జయమ్మ జీఆర్‌పీలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తుంది. శుక్రవారం రాత్రి స్నానానికి వెళ్తూ తన మెడలోని మూడు కాసుల బంగారపు గొలుసును తీసి బెడ్‌రూమ్‌లో కిటికీలో పెట్టింది. స్నానానికి వెళ్లిన ఆమె తిరిగి రాగా గొలుసు మాయం అయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భారతీనగర్, జూలై 20 : విద్యుత్ లైన్లు మరమత్తుల కారణంగా రింగ్‌రోడ్డు సెక్షన్‌లో పరిధిలో ఆదివారం ఉదయం 8గంటల నుంచి 10.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల సబ్‌స్టేషన్ కార్యనిర్వహక ఇంజనీర్ పి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనగర్ కాలనీ, నోవాటెల్ హోటల్ వెనుక రోడ్డు, సర్వీస్ రోడ్డు, సమోసా కంపెనీ ఏరియా, అక్కినేని ఉమెన్స్ హాస్పిటల్, చందమామ హాస్పిటల్ ఏరియా, న్యూ పిఅండ్‌టి కాలనీ, విద్యుత్ కాలనీ, సాయిబాబా గుడి ఏరియా, ఎన్టీఆర్ సర్కిల్, భద్రయ్య నగర్, నిర్మలా కాన్వెంట్ రోడ్డు,కేపీ నగర్, సాయిబాబా టెంపుల్ సర్వీస్ రోడ్డు, సాయినగర్, ట్రెండ్‌సెట్‌మాల్ ఏరియా, శంకర్ కంటి ఆసుపత్రి ఏరియా, వీఎస్ఎన్ మాల్ ఏరియా, తదితర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న బొండా ఉమా

కార్యకర్తల కష్టమే ఎమ్మెల్యే పదవి

● ఎమ్మెల్యే బొండా ఉమా

పాయకాపురం, జూలై 20 : ఎన్నికల సంగ్రామంలో కూటమి నాయకులు, కార్యకర్తలు తన వెన్నంటి ఉన్నారని వారి కష్టానికి ఫలితమే తనకు లభించిన ఎమ్మెల్యే పదవి అని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. బొండా ఉమా అత్యధిక మెజారిటీ సాధించిన సందర్భాన్ని పురస్కరించుకుని పాయకాపురం ప్రశాంతినగర్‌లో టీడీపీ నేతలు శనివారం సన్మాన సభ ఏర్పాటు చేసి బొండా ఉమాను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన విజయానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు ఏమిచ్చినా రుణం తీర్చుకోలేనని పేర్కొన్నారు. నేతలు తాడేకోరు శివనాగరాజు, వీరాస్వామి పాల్గొన్నారు.

గవర్నర్‌పేట: విజయవాడ హాస్టల్స్ అసోసియేషన్ సభ్యులు శనివారం 23వ డివిజన్ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి ఆధ్వర్యంలో సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసి చిరు సత్కారం చేశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానించారు.

మేజర్ అవుట్‌ఫాల్ డ్రెయిన్ పూడికలు తీయండి

● ఇన్‌చార్జ్ కమిషనర్

పాత రాజరాజేశ్వరిపేట, జూలై 20 : మేజర్ అవుట్ ఫాల్ డ్రెయిన్ పూడికలు తీసి మురుగు పారుదలకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ కమిషనర్ ఏ. మహేష్ సంబంధిత అధికారులకు సూచించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ భారీ వర్షాలను దృష్టిలో పెట్టుకుని ప్రజలు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

మర్యాదపూర్వక కలయిక



వన్‌టౌన్, జూలై 20: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును శనివారం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలపై ఇరువురు కొద్ది సమయం చర్చించుకున్నారు. పార్టీని మరింత బలోపేతం చేయడానికి అనుసరించాల్సిన వ్యూహంపై మాట్లాడుకున్నారు.



నరకాసుర వధకై సమరం

నాని కథానాయకుడిగా వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'సరిపోదా శనివారం'. డి.వి.వి దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయిక. సాయికుమార్, ఎస్‌జే సూర్య ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. శనివారం సూర్య పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం ఆయన పాత్రను పరిచయం చేస్తూ ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. పోలీసాఫీసర్‌గా ఆయన క్రౌర్యాన్ని పలికించిన తీరు ఆకట్టుకుంది. సూర్య పాత్రను నరకాసురుడితో పోల్చుతూ, అతన్ని ఎదుర్కోవడానికి వస్తున్న హీరో హీరోయిన్ల పాత్రలను శ్రీకృష్ణుడు, సత్యభామతో పోల్చిచూపడం ఆసక్తిని పెంచింది. ఆగస్టు 29న ఈ చిత్రం థియేటర్లలోకి రానుంది. సంగీతం: జేక్స్ బిజోయ్, సినిమాటోగ్రఫీ: మురళీ జీ, ఎడిటర్: కార్తీక్ శ్రీనివాస్

మాస్టర్స్ పట్టా అందుకున్న అనా కొణిదెల

స్నాతకోత్సవానికి హాజరైన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సతీమణి అనా కొణిదెల సింగపూర్ యూనివర్సిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీ పొందారు. ఆమెకు ఇది రెండో మాస్టర్స్ డిగ్రీ. నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్‌లో శనివారం వైభవంగా జరిగిన స్నాతకోత్సవంలో ఆమె పట్టా స్వీకరించారు. ఆగ్నేయాసియా దేశాల కళలు, సామాజిక విజ్ఞానంలో ఆమె ఈ మాస్టర్స్ చేశారు. స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు భార్యతో కలిసి వెళ్లిన పవన్.. మాస్టర్స్ పట్టా పొందిన సందర్భంగా ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. అనా కొణిదెల రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్ స్టేట్ యూనివర్సిటీలో చదివారు. అక్కడ ఓరియంటల్ స్టడీస్‌లో హానర్స్ పట్టా పొందారు. ఆసియా దేశాల చరిత్ర, భాషలు, జీవన విధానంపై అధ్యయనానికి తొలుత డిగ్రీ పొందారు. ఆ అధ్యయనంలో థాయిలాండ్ చరిత్ర ఒక ప్రత్యేక సబ్జెక్ట్‌గా ఉంది. సెయింట్ పీటర్స్‌బర్గ్ స్టేట్ యూనివర్సిటీలో ఉండగానే ఆమె మూడు భాషలు కూడా నేర్చుకున్నారు. ఆ తర్వాత బ్యాంకాక్‌లోని చులాలాంగ్‌కార్న్ యూనివర్సిటీ నుంచి థాయ్ స్టడీస్‌లో అనా మొదటి మాస్టర్స్ డిగ్రీ సాధించారు. కాగా, పవన్ దంపతులు సింగపూర్ నుంచి నేడు విజయవాడ రానున్నారు.



- అమరావతి, (ఆంధ్రజ్యోతి)

కమిటీ కుర్రోళ్లు వస్తున్నారు



గ్రామీణ నేపథ్యంలో స్నేహం, ప్రేమ, భావోద్వేగాల కలబోతగా రూపొందిన చిత్రం 'కమిటీ కుర్రోళ్లు'. సందీప్ సరోజ్, యశ్వంత్ పెండ్యాల, శ్రావ్య, విషిక తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు. యదు వంశీ దర్శకుడు. నిహారిక కొణిదెల సమర్పణలో పద్మజ కొణిదెల, జయలక్ష్మీ అడపాక నిర్మించారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ఆకట్టుకున్నాయి. తాజాగా చిత్రబృందం విడుదల తేదీని ఖరారు చేసింది. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆగస్టు 9న 'కమిటీ కుర్రోళ్లు' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు యూనిట్ శనివారం తెలిపింది. ఈ సందర్భంగా నిహారికా కొణిదెల మాట్లాడుతూ 'మా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బేనర్‌పై వస్తున్న తొలి చిత్రమిది. కొత్త ప్రతిభను ప్రోత్సహించాలనే ఆలోచనతో కొత్త నటీనటులతో ఈ సినిమా తీశాం. యువతకు, కుటుంబ ప్రేక్షకులకు ఈ చిత్రం నచ్చుతుందన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "కమిటీ కుర్రోళ్లు' చిత్రంతో 11 మంది హీరోలు, నలుగురు హీరోయిన్లను పరిచయం చేస్తున్నాం. స్నేహితులతో సెలబ్రేట్ చేసుకునేలా మా సినిమా ఉంటుందని చెప్పారు.

ఆగస్టు నుంచి ఆరంభం



'టిల్లు స్క్వేర్' చిత్రంతో సూపర్ హిట్ అందుకున్నారు సిద్ధు జొన్నలగడ్డ. ఆయన నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్నారు. డిజైనర్ నీరజ్ కోన ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయం కాబోతున్నారు. టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రీ ప్రొడక్షన్ పనులన్నీ పూర్తయ్యాయి. ఆగస్టు 5 నుంచి రెగ్యులర్ షూటింగ్ జరగనుంది. హైదరాబాద్‌లో 30 రోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో టాకీ పార్ట్‌తో పాటు పాటలను చిత్రీకరించనున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: నవీన్ నూలి, డీఓపీ: జ్ఞానశేఖర్ వీ.ఎస్, సంగీతం: థమన్ ఎస్.ఎస్.

కల్కి బృందానికి నోటీసులు



'కల్కి 2898 ఏ.డీ' మేకర్స్‌కు ఊహించని షాక్ తగిలింది. ఈ సినిమాలో నటించిన ప్రభాస్, అమితాబ్ బచ్చన్, ఇతర నటులతో పాటు మేకర్స్‌కు మాజీ కాంగ్రెస్ నాయకుడు, కల్కి ధామ్ పీఠాధిపతి ఆచార్య ప్రసాద్ లీగల్ నోటీసులు పంపారు. "ఈ సినిమా భారతీయ ఇతిహాసాల్లోని విశ్వాసాలను దెబ్బతీసేలా ఉంది. ఇందులో హిందూ పురాణాల్లో ఉన్న విధంగా కాకుండా.. వాటిని వక్రీకరించారు. విష్ణుమూర్తి చివరి అవతారం 'కల్కి'ని పవిత్ర గ్రంథాలను కించపరిచేలా చిత్రీకరించారు. ఇది దేశంలో కోట్లాది సంఖ్యలో ఉన్న భక్తులను అయోమయానికి, గందరగోళానికి గురిచేసేలా ఉంది" అని ఆచార్య ప్రసాద్ ఈ నోటీసులో ఆరోపించారు.



ఆకట్టుకునే చిన్న కథ



నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం '35-చిన్న కథ కాదు'. గౌతమి, భాగ్యరాజ్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. నందకిశోర్ ఈమాని దర్శకత్వం వహిస్తున్నాడు. హీరో రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఆగస్టు 15న ఈ చిత్రం తెలుగుతో పాటు తమిళ, మలయాళ భాషల్లో విడుదలవుతోంది. ఈ చిత్రంలో విశ్వదేవ్ పాత్రను పరిచయం చేస్తూ చిత్రబృందం ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. ప్రసాద్ అనే మధ్యతరగతి తండ్రి పాత్రలో విశ్వదేవ్ నటన ఆకట్టుకుంది. ఇది చిన్న కథ కాదు ప్రేక్షకులను ఆకట్టుకునే కథ అని మేకర్స్ తెలిపారు. వివేక్ సాగర్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. సినిమాటోగ్రఫీ: నికేత్ బొమ్మి, ఎడిటర్: టి.సి ప్రసన్న

మహిళలు మెచ్చిన పేకమేడలు




వినోద్ కిషన్, అనూషకృష్ణ జంటగా నటించిన చిత్రం 'పేకమేడలు'. నీలగిరి మామిళ్ల దర్శకత్వంలో రాకేశ్ వర్రే నిర్మించారు. ఇటీవలే విడుదలైన ఈ సినిమా అన్ని చోట్లా హిట్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం శనివారం సక్సెస్ మీట్‌ను ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో దర్శకుడు నీలగిరి మామిళ్ల మాట్లాడుతూ "భావోద్వేగంతో నిండిన మంచి సినిమాను తీశారని చూసిన ప్రతీ ఒక్కరూ ప్రశంసిస్తున్నారు. ముఖ్యంగా మహిళలు ఈ సినిమాను విశేషంగా ఆదరిస్తున్నారు" అని అన్నారు. "మంచి కంటెంట్ ఉన్న సినిమా తీస్తే ప్రేక్షకులు తప్పక ఆదరిస్తారని మరోసారి రుజువు చేసిన చిత్రమిది. ఈ సినిమా సక్సెస్ ఇలాంటి మరిన్ని సినిమాలు నిర్మించడానికి ఉత్సాహం ఇచ్చింది" అని నిర్మాత రాకేశ్ వర్రే చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్: సృజన అడుసుమిల్లి, హంజా అలీ, డీఓపీ: హరిచరణ్.కె, సంగీతం: స్మరణ్‌సాయి.

ఫీల్‌గుడ్ ఎంటర్టైనర్




సదన్ హీరోగా పరిచయమౌతున్న చిత్రం 'ప్రణయ గోదారి'. ప్రియాంక ప్రసాద్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. సాయి కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. పి.ఎల్.విఘ్నేశ్ దర్శకత్వంలో పారమళ్ళ లింగయ్య నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా గ్లింప్స్‌ను నిర్మాత రాజ్ కందుకూరి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "గ్లింప్స్ చక్కగా ఉంది. చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తారని ఆశిస్తున్నాను" అని చెప్పారు. "ఫీల్‌గుడ్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమా అన్ని వర్గాల వారిని ఆకట్టుకుంటుంది" అని నిర్మాత పారమళ్ల లింగయ్య అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: కొడగంటి వీక్షితవేణు, కెమెరా: ఈదర ప్రసాద్, సంగీతం: మార్కండేయ.







ఆదివారం



అసలే అంబానీల ఇంటపెళ్లి అది... ఐదు రోజుల పెళ్లి, రూ. 5 వేల కోట్ల పెళ్లి... సెలబ్రిటీల సందడి ప్రత్యేకార్షణగా నిలిచిన అనంత్ అంబానీ-రాధికా మర్చంట్ పెళ్లిలో బాలీవుడ్ అందాలు మొత్తం కనువిందు చేశాయి. దక్షిణాది తారలన్నీ కల్యాణానికి తరలివచ్చాయి. పెళ్లయినా, పేరంటం అయినా తారాలోకం ఊరకనే రాదు కదా ఈసారీ మరెన్నో విశేషాలను వెంటపెట్టుకు వచ్చింది.

ఒక పెళ్లి... అనేక ముచ్చట్లు

అనంత్ అంబానీ పెళ్లి జరిగిన ఆ ఐదు రోజులూ బాలీవుడ్‌కు అనధికారిక సెలవు ప్రకటించినట్లైంది. బాలీవుడ్ స్టార్స్, టెక్నీషియన్స్ అంతా అక్కడే ఉన్నారు. హీరో, హీరోయిన్లు షూటింగ్‌కు హాజరవ్వలేదు. నటీనటులు అందరూ ఒక చోట చేరి సెలబ్రేషన్ మోడ్‌లో గడిపారు. అయితే ఈ పెళ్లిపై చిత్ర పరిశ్రమ నుంచి కొన్ని పెదవి విరుపులు వినిపించకపోలేదు. మొదటి దూస్రా దూసుకొచ్చింది మాత్రం బాలీవుడ్ దర్శక నిర్మాత అనురాగ్ కశ్యప్ కూతురు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయన్సర్ అలియా కశ్యప్ నుంచే. ఆమె అంబానీల పెళ్లిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'అనంత్ అంబానీ పెళ్లి అసలు పెళ్లే' కాదు అన్నారు.

అంతా ఓ సర్కస్‌ను తలపిస్తోందన్నారు. పీఆర్ స్ట్రాటజీగా కొట్టిపారేశారు. పెళ్లికి హాజరవ్వాలని తనకూ ఆహ్వానం అందిందని, పీఆర్ రీల్స్ చేయడం ఇష్టం లేకనే వెళ్లలేదన్నారు. 'వేరే వాళ్ల పెళ్లి కోసం నా ఆత్మాభిమానాన్ని అమ్ముకోలేను. నా వ్యక్తిత్వం మీద నాకు గౌరవం ఉంది' అని పరోక్షంగా సినీ స్టార్స్‌ను దెప్పిపొడిచారు అలియా కశ్యప్.

> "మహేశ్‌బాబు, రాజమౌళి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో మహేశ్ సరికొత్త లుక్‌లో కనిపించనున్నారు. దానికోసం కొన్నాళ్లుగా ఆయన సరికొత్త హెయిర్‌స్టైల్ మెయింటైన్ చేస్తున్నారు. మహేశ్ లుక్ ఇప్పుడప్పుడే బయటకు కనిపించకుండా ఉండాలనే రూల్ పెట్టారట రాజమౌళి. కానీ అంబానీ పెళ్లికి మహేశ్‌బాబు కుటుంబంతో కలసి హాజరయ్యారు. మహేశ్ లుక్‌ను రహస్యంగా ఉంచాలన్న జక్కన్న ప్లాన్ దీంతో ఫెయిల్ అయిందనేది టాలీవుడ్ టాక్."



బాంద్రాలో బంగ్లా?

అతిథి మర్యాదలకు లోటు లేకుండా చూసుకోవడంలో అంబానీల నైపుణ్యం గురించి చాలా సార్లు విన్నదే, కన్నదే. ఇప్పుడు ఈ పెళ్లికి గెస్ట్‌లుగా వచ్చిన సినిమా యాక్టర్స్‌కే రూ. కోట్ల విలువైన వాచీలను బహుమతిగా పంచడం చూసిందే. అలాంటిది మరి ఏకంగా అంబానీల ఇంటికి మహాలక్ష్మి లాంటి కోడలిని వెతికిపెట్టిన వ్యక్తికి ఇంకెంత ఘనమైన బహుమతి అందుతుందో అనే ఆసక్తి సహజమే. జావీద్ జాఫ్రీ తనయుడు మీజాన్ జాఫ్రీ అనంత్ అంబానీకి రాధికా మర్చంట్‌ను పరిచయం చేశారట. వారిద్దరి మనసులు కలిసి, మనువుకు బాటలు వేసినందుకు బాంద్రాలోని సంధు ప్యాలెస్‌ను అంబానీ ఫ్యామిలీ మీజాన్ జాఫ్రీకి బహుమతిగా ఇచ్చారు, దాని విలువ రూ. 30 కోట్లు అని బాలీవుడ్ సినీ విమర్శకుడు కేఆర్‌కే పరోక్షంగా చేసిన ట్వీట్ వైరల్ అయింది. అయితే అందులో నిజం లేదని జావీద్ జాఫ్రీ వివరణ ఇచ్చుకున్నారు.

భోజనానికైనా వెళ్లుండాల్సింది

అనంత్, రాధిక వివాహానికి హాజరుకాకపోవడంపై తాప్సీ ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికరంగా స్పందించారు. 'వాళ్లతో నాకు పరిచయం లేదు. ఆతిథ్యం ఇచ్చే కుటుంబానికి మనకు మధ్య ఏదో ఒక అనుబంధం ఉండాలి. అలాంటి పెళ్లిళ్లకు మాత్రమే నేను హాజరవుతాను. తెలియని వారి పెళ్లికి వెళ్లి కృతకమైన ఆనందం పొందడం నాకు తెలియదు. నేను కాగితం పువ్వును కాదు, సువాసన వెదజల్లే నిజమైన పుష్పాన్ని' అని కవితాత్మకంగా స్పందించారు. కానీ నెటిజన్లు ఊరకుంటారా...పెళ్లికి వెళ్లకపోతే పాయే, కనీసం భోజనానికైనా వెళ్లి ఉండాల్సిందని తాప్సీని ఉడికించే ప్రయత్నం చేశారు.

టెక్కులాడి వంటూ...

బాలీవుడ్ నటుడు సంజయ్ కపూర్ కూతురు షనయా కపూర్ ఈ పెళ్లిలో సెక్యూరిటీ గార్డ్‌తో గొడవ పడిన వీడియో వైరల్ అయింది. సెక్యూరిటీ సిబ్బంది ఆమె బ్యాగ్‌ను చెక్ చేసేందుకు ప్రయత్నించగా అసహనం వ్యక్తం చేసింది. వాళ్ల మీద అరుస్తూ వాదన పెట్టుకుంది. అయితేచేతిలో ఒక్క సినిమాకూడాలేని షనయాకు ఇంత టెక్కెందుకో అని నెటిజన్లు అంటున్నారు.

నిక్‌ను తోసిరాజని

- ఈ పెళ్లికి కథానాయిక ప్రియాంక చోప్రా తన భర్త నిక్ జోనాస్‌తో కలసి హాజరయ్యారు. సంగీత్ కార్యక్రమంలో ప్రియాంక చోప్రా డాన్స్ చేస్తుండగా నిక్ పక్కన ఉండి ఆమెను ఉత్సాహపరుస్తున్నాడు. అయితే బాలీవుడ్ కథానాయిక అనన్యాపాండే ప్రియాంకతో కలసి స్టెప్పులు వేసేందుకు ముందుకు వచ్చే క్రమంలో నిక్‌ను వెనక్కు నెట్టడంతో అతను అవాక్కయ్యాడు. అయితే ఇదంతా గమనించిన రణ్‌వీర్‌సింగ్ నిక్ చేతిని పట్టుకొని మధ్యలోకి లాగి కూల్ చేశారు.

పాకిస్థాన్ నటులకు అంబానీ పెళ్లికి ఆహ్వానం అందినట్టు లేదు. శుభాకాంక్షలు చెప్పాల్సింది పోయి ఈ పెళ్లి వేడుకలపై సోషల్ మీడియాలో సెటైర్లు వేశాడు పాకిస్థాన్ నటుడు అర్సలన్ నజీర్. 'ఈ రోజుల్లో పెళ్లి వేడుకలు జరిగినంత కాలం కూడా బంధాలు నిలవడం లేదం'టూ వేదాంత ధోరణిలో మాట్లాడాడు. 'శుభమా అని పెళ్లి జరుగుతుంటే నీ సన్నాయి నొక్కులేమిటి' అంటూ నెటిజన్లు అతనిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త దంపతులు ఇద్దరూ సంతోషంగా ఉంటే మధ్యలో నీకొచ్చిన ఇబ్బంది ఏమిటని తిట్టి పోస్తున్నారు.

పెళ్లికి హాజరవని తారలు

అంబానీ పెళ్లికి వచ్చిన తారలే కాదు రానివాళ్లు కూడా వార్తల్లో వ్యక్తులు అయ్యారు. ఈ పెళ్లికి రాని నటీనటులు, వారెందుకు రాలేదో అనే చర్చ కూడా డిజిటల్ మీడియాలో జోరుగా జరిగింది.

కరీనాకపూర్, సైఫ్ అలీఖాన్ దంపతులు తమ ఫ్యామిలీ ట్రిప్‌ను వాయిదా వేసుకోలేకపోయారని ఓ సమాచారం. ఆమిర్‌ఖాన్ రాకపోయినా తన కుటుంబం మొత్తాన్ని పెళ్లికి తోలాడట. అంబానీ ఐనా ఐ డేంట్ కేర్ అనే టైపు కంగనా రనౌత్. అయితే తన తమ్ముడు వరుణ్ రనౌత్ పెళ్లి పనుల్లో కంగనా రనౌత్ బిజీగా ఉండి హాజరవలేకపోయారట. పెళ్లి వేడుకలు మొదలయ్యే ముందే అనుష్క శర్మ భర్త విరాట్ కోహ్లీ, పిల్లలతో కలసి లండన్ చెక్కేశారు. కార్తీక్ ఆర్యన్ కూడా ఈ పెళ్లిలో కనిపించలేదు. కారణాలేవైనా పాన్ ఇండియా స్టార్స్ అల్లు అర్జున్, ప్రభాస్, ఎన్టీఆర్ సైతం ఈ పెళ్లిలో కనిపించలేదు. •



రజనీ సార్ కూడా ఇంతేనా!

సింప్లిసిటీగా మారుపేరుగా మసలే రజనీకాంత్ అంబానీ పెళ్లిలో మాత్రం దాన్ని పక్కనపెట్టారు. బరాత్‌లో తనదైన శైలిలో స్టెప్పులతో దుమ్మురేపారు. సూపర్‌స్టార్‌ను అలా చూసి చాలా మంది ఆశ్చర్యపోయారు కూడా. ఆ వీడియో కూడా బాగా వైరల్ అయింది. రజనీ ఓ వివాదంలో చిక్కుకున్నారు. పెళ్లికి వచ్చేముందు ఫొటోగ్రాఫర్లకు పోజులిచ్చే క్రమంలో తన బ్యాగ్ మోస్తున్న పనిమనిషిని పక్కకు వెళ్లాలని రజనీకాంత్ చేయి చూపించారు. ఆమె అది గమనించక పోవడంతో పక్కకు వెళ్లమని పదే పదే చేయి ఊపుతూ సంజ్ఞలు చేశాడు. ఇప్పుడు ఆ వీడియో కాస్తా వైరల్ అయి రజనీని కొందరు తప్పుపడుతున్నారు. పనిమనిషి అయినంత మాత్రాన జనంలో ఉన్నప్పుడు గౌరవం లేకుండా ప్రవర్తిస్తారా అని ప్రశ్నిస్తున్నారు. మరికొందరు అయితే 'వీళ్లింతే పైకి ఒకలా నటిస్తారు... లోపల మరోలా జీవిస్తారు' అని నిర్వేదం వ్యక్తం చేశారు.



విడివిడిగా... విడాకులు నిజమేనా?

శుభకార్యంలోనూ ఈ విడాకుల గొడవలేవిటో అని అమితాబ్ ఫ్యామిలీ నిట్టూర్చేలా చేసింది డిజిటల్ మీడియా. అమితాబ్ బచ్చన్, అభిషేక్ బచ్చన్... ఐశ్వర్యారాయ్ బచ్చన్, మనవరాలు ఆరాధ్య విడివిడిగా పెళ్లికి వచ్చారు. నూతన దంపతులతో అమితాబ్‌బచ్చన్, జయాబచ్చన్, అభిషేక్ బచ్చన్‌లు కలసి ఫొటోలు దిగారు. ఐశ్వర్యారాయ్ మాత్రం తన కూతురు ఆరాధ్యతో కలసి విడిగా ఫొటోలు దిగారు. అభిషేక్, ఐశ్వర్య గ్రూప్ ఫొటోలో కలసి లేకపోవడంతో వారిద్దరూ విడిపోతున్నారంటూ కొన్నాళ్లుగా వస్తున్న వార్తలకు మరోసారి రెక్కలొచ్చాయి. సందట్లో సడేమియాలా ఈ పెళ్లిలో మాజీ ప్రియుడు సల్మాన్‌తో కలసి ఐశ్వర్యారాయ్ ఫొటోలు దిగిందంటూ కొన్ని ఫేక్ ఫొటోలు నెట్‌లో వైరల్ కావడం వారికి మరో తలనొప్పిగా మారింది. ఇదిలా ఉండగా కోలీవుడ్ కపుల్ సూర్య జ్యోతిక విడిపోతున్నారంటూ కొన్నాళ్లుగా వార్తలు వస్తున్న నేపథ్యంలో వారిద్దరూ కలసి అనంత్ పెళ్లికి హాజరయ్యారు. చిలుకా గోరింకల్లా పెళ్లి వేడుకల్లో ప్రత్యేకాకర్షణగా నిలిచారు.

'దిక్సూచి' వెబ్ పేజీలో... సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/PrN27Smలో చదవండి.

సండే సెలబ్రిటీ



సాధారణంగా ఏ తండ్రయినా తన కొడుకుని నటుడిగా పరిచయం చేస్తుంటాడు. కానీ కొడుకు హీరోగా నటించే సినిమాతో తండ్రి దర్శకుడిగా పరిచయం కావడమనేది నిజంగా అరుదే. 'ఆపరేషన్ రావణ్' చిత్రం విషయంలో అలా జరిగింది. రక్షిత్ అట్లూరి హీరోగా నటించగా, ఆయన తండ్రి వెంకట సత్య దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ నేపథ్యంలో తండ్రీ కొడుకులిద్దరూ 'నవ్య'కు చెప్పిన విశేషాలు.

నేను డైరెక్టర్స్ నటుడిని

నిర్మాతైన మీకు దర్శకుడు అవ్వాలనే కోరిక ఎందుకు కలిగింది?

వెంకట సత్య: ఒక సినిమా చూసిన తర్వాత దానిని గురించి విశ్లేషించడం నాకు మొదటి నుంచి అలవాటు. కథలు చెప్పడానికి వచ్చే వాళ్లతో, దర్శకులు కావాలనుకునేవారితో తరచూ మాట్లాడుతుంటాను. స్క్రిప్ట్ పరంగా సలహాలు ఇస్తుంటాను. సినిమాలు తీయడానికి ఇన్ని రోజులు ఎందుకు పడుతుంది, ఇంత బడ్జెట్ ఎందుకు అవుతుంది. కథ ఇలా ఉంటే బాగుంటుంది కదా అని. ఇలా నేను అనుకుంటుంది కరెక్టా కాదా అని చెక్ చేసుకోవడం కోసం దర్శకుడిగా మారా. సొంతంగా కథ తయారు చేసుకున్నాను. సినిమాలు బాగా చూస్తుంటాను. అన్ని రకాల బుక్స్ చదువుతుంటాను. కథ ఎలా రాయాలి, స్క్రీన్‌ప్లే అంటే ఏమిటి, లైటింగ్ ప్యాట్రన్ ఎలా ఉంటుంది అనే అవగాహన పుస్తకాలు చదవడంవల్లే ఏర్పడింది. ఆ ధైర్యంతోనే 'ఆపరేషన్ రావణ'కు దర్శకత్వం వహించా.

రక్షిత్: ఒక కొత్త దర్శకుడితో పని చేస్తున్న భావన నాకు ఎప్పుడూ కలగలేదు. మేం ప్రీప్రొడక్షన్ వర్క్ బాగా చేయడంతో సెట్‌కు వెళ్లిన తర్వాత ఎలాంటి ఇబ్బందీ ఎదురు కాలేదు. మిగతా సినిమాలకు, ఈ సినిమాకు ముఖ్యంగా నాకు కనిపించిన తేడా ఏవిటంటే.. అనుకున్న సమయానికి షూటింగ్ ప్రారంభించేవాళ్లం. నాన్నగారు పొద్దునే నాలుగు గంటలకు షూటింగ్ స్పాట్‌లో ఉండేవారు. ఏడు గంటలకు ఫస్ట్ షాట్ తీసేవాళ్లం. ప్రాపర్ ప్లానింగ్‌తో, డిసిప్లిన్‌తో వర్క్ చేశాం. నాన్నగారు 'పలాస' నిర్మాణ సమయంలో బాగా ఇన్‌వాల్వ్ అయ్యారు. స్క్రిప్ట్ మీద కమాండ్ ఉండడంవల్ల ఎలాంటి కన్‌ఫ్యూజన్ లేకుండా చకచకా వర్క్ చేసేవారు. సాధారణంగా ఒక సినిమాకు దర్శకత్వం చేయాలనిపించినప్పుడు పక్కన మరొకరిని కూర్చోపెట్టుకుని వాళ్లతో పని చేయించుకుని, తన పేరు వేసుకుంటుంటారు. కానీ 'ఆపరేషన్ రావణ్' చిత్రం అలా తీసింది కాదు. పెద్ద పెద్ద ఆరిస్టులను డీల్ చేయడం టఫ్ జాబ్. ఒక కొత్త దర్శకుడు అలా అద్భుతంగా డీల్ చేసి 40 రోజుల్లో సినిమాను పూర్తి చేయడం అంటే మాటలు కాదు. కొత్త దర్శకుడు కూడా చక్కని ప్లానింగ్‌తో అలా చేయవచ్చని నాన్నగారు నిరూపించారు.

రక్షిత్ ఎలా చేశాడు?

వెంకట సత్య: 'పలాస' చిత్రంతో రక్షిత్ మంచి పేరు, గుర్తింపు సంపాదించుకున్నాడు. నాకు రామాయణం, భాగవతం మీద చాలా ఆసక్తి. ఓ సినిమా కథ అయినా వాటి నుంచి పుట్టిందే. ప్రతి పనికి ఒక ఆలోచన ఉంటుంది. ఆ ఆలోచన దృశ్య రూపంలో వచ్చి మాట్లాడితే ఎలా ఉంటుంది అనే పాయింట్ కొత్తగా అనిపించి ఈ సినిమా తీశాం. 'మీ ఆలోచనలే మీకు శత్రువులు' అని ట్యాగ్ లైన్ ఇచ్చాం. ఒక మామూలు మనిషి సైకోగా మారడానికి ఆలోచనలు ఎలా ప్రభావితం చేశాయన్నదే ఈ సినిమా. రక్షిత్ పాత్రతో పాటు రాధిక పాత్ర కూడా చాలా బాగుంటుంది. ఆవిడ చేసిన సీన్లు అన్నీ అద్భుతంగా ఉంటాయి.

రక్షిత్: న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్ ఇది. కొత్త పాయింట్‌తో రూపుదిద్దుకుంది. తెలుగుతో పాటు తమిళంలోనూ విడుదల చేస్తున్నాం.

సెట్‌లో మీరు రక్షిత్‌ను మందలించిన సందర్భాలు ఉన్నాయా?

వెంకట సత్య: ఏమీ లేవండి. ముందుగానే ప్రిపేర్ అయి రావడం వల్ల సెట్‌లో ఎలాంటి ఇబ్బంది లేకుండా వర్క్ జరిగిపోయింది.

రక్షిత్: మా నాన్నగారనే కాదు వేరే ఇతర దర్శకుడైనా నేను చాలా అప్రమత్తంగా ఉంటా. వాళ్లు చెప్పింది చేయడమే పని. నేను డైరెక్టర్స్ యాక్టర్‌ని. నాకు ఏమన్నా సందేహాలు ఉంటే స్క్రిప్ట్ వర్క్ స్టేజ్‌లోనే క్లారిఫై చేసుకుంటా.

ఓ దర్శకుడిగా కాకుండా తండ్రిగా సినిమాలో రిస్కీ షాట్స్ చేస్తున్నప్పుడు టెన్షన్ ఫీలయ్యారా?

వెంకట సత్య ఈ సినిమాలో ఆరంతస్తుల భవనం నుంచి రక్షిత్ కిందకు దూకే షాట్ ఉంది. ఫైట్ మాస్టర్ రోప్ సాయంతో ఆ షాట్ తీయడానికి సిద్ధమయ్యాడు. మా వాడికి ఆ రోప్ కడుతుంటే టెన్షన్ ఫీలయ్యా. తాడు బలంగా ఉందా, వాడికి ఏమీ కాదు కదా అని పదే పదే ఫైట్ మాస్టర్‌ని అడిగేవాణ్ణి. 'ఇలాంటి షాట్స్ తీయడం మాకు అలవాటే. మీరు వర్రీ కావద్దు సార్. మీరు కాసేపు పక్కన కూర్చోండి' అని ఫైట్ మాస్టర్ జాషువా చెబుతున్నా, ఆ షాట్ పూర్తయ్యే వరకూ టెన్షన్ పడుతూనే ఉన్నా. అప్పుడు మాత్రం దర్శకుడిగా కంటే తండ్రిగా వర్రీ అయ్యా.

> "ఈ సినిమా కోసం నేను నిర్మాతగా, దర్శకుడిగా ద్విపాత్రాభినయం చేసినా ఒకటి రెండు సందర్భాలలో తప్ప ఇద్దరూ ఒకరిని ఒకరు గౌరవించుకుంటూ వర్క్ చేశాం. స్క్రిప్ట్ రాసుకున్నప్పుడే ఒక బడ్జెట్ అనుకున్నాం. ఈ సీన్ ఎన్ని నిముషాలు తీస్తాం, ఏ ఏ ఎక్విప్‌మెంట్ కావాలి, ఎక్కడ తీయాలి.. అని ఫర్ఫెక్ట్‌గా ప్లాన్ చేశాం. రాధికగారి వర్క్ 15 రోజులు అనుకున్నాం. కానీ ఆవిడ సహకారంవల్లే రెండు రోజులు ముందే వర్క్ పూర్తయింది. అలాగే మిగిలిన నటీనటులంతా సహకరించారు. అయితే కొన్ని సందర్భాల్లో మాత్రం ఈ సీన్ ఇలా తీయాల్సిందే అని మా నిర్మాత మాట వినకుండా డైరెక్టర్‌గా ముందుకెళ్లాను. అలాగే 'ఇంకో గంట ఎక్కువ సరిపోతుంది.. మళ్లీ ఇంకో రోజు ఎందుకు?' అని మా నిర్మాత చెప్పిన మాటను దర్శకుడిగా గౌరవించాను. ఇలా నిర్మాతగా, దర్శకుడిగా నన్ను నేను గౌరవించుకుంటూ సినిమా పూర్తి చేశా."

మీ అబ్బాయి చేసిన సీన్లలో మీకు బాగా నచ్చింది ఏమిటి?

ఇందులో రక్షిత్ ఓ పద్యం పాడతాడు. విదేశాలలో ఉండి వచ్చావు కదా తెలుగు గురించి నీకేం తెలుసు.. అని ఓ ఛానల్ ఓనర్ అడిగితే ఆ పద్యం పాడతాడు. దానికి తగ్గట్లు ఎక్స్‌ప్రెషన్స్ ఇచ్చాడు. నాకు చాలా సంతృప్తిగా అనిపించింది.

రక్షిత్: ఇంతవరకూ నేను గ్రామీణ నేపథ్యం కలిగిన పాత్రలే చేశాను. కానీ ఆపరేషన్ రావణలో తొలిసారిగా సిటీ నేపథ్యం కలిగిన పాత్ర పోషించాను. నాన్నగారికి పద్యాలు, పురాణాలు అంటే ఇష్టం. తెలుగు భాష అంటే ఎంతో గౌరవం. ఆ మక్కువతోనే ఆయన ఈ సినిమాలో నాతో ఓ పద్యం పాడించారు.


• వినాయకరావు
ఫొటో: రాజ్‌కుమార్

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ది డెకామెరాన్	వెబ్‌సిరీస్	జూలై 25
డ్రాగన్ ప్రిన్స్ 6	వెబ్‌సిరీస్	జూలై 26
అమెజాన్ ప్రైమ్		
ది మినిస్ట్రీ ఆఫ్ అన్ జెంటిల్‌మాన్లీ వార్‌ఫేర్	హాలీవుడ్ మూవీ	జూలై 25
జీ 5		
భయ్యాజీ	హిందీ చిత్రం	జూలై 25
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
బ్లడీ ఇష్క్	హిందీ చిత్రం	జూలై 26
చట్నీ సాంబార్	తమిళ చిత్రం	జూలై 26
ఆహా...		
రాజూ యాదవ్	తెలుగు చిత్రం	జూలై 24
బుక్ మై షో		
ఒన్ లైఫ్	హాలీవుడ్ మూవీ	జూలై 25
జియో సినిమా		
విచ్ బ్రింగ్స్ మీ టూ యూ	హాలీవుడ్ మూవీ	జూలై 26





హారర్ లవ్ స్టోరీ

బాలీవుడ్‌లో హారర్ చిత్రాలతో తనదైన ముద్ర వేసిన దర్శక నిర్మాత విక్రమ్‌భట్ తెరకెక్కించిన తాజా చిత్రం 'బ్లడీ ఇష్క్'. అవికాగోర్ ప్రధాన పాత్ర పోషించారు. మహేశ్‌భట్ నిర్మించిన ఈ చిత్రం నేరుగా ఓటీటీలో విడుదలవుతోంది. జూలై 26 నుంచి డిస్నీ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ అవనుంది. ఇటీవలే యూనిట్ ట్రైలర్‌ను విడుదల చేసింది. ఓ ద్వీపంలోని పెద్ద బంగ్లాలో హీరోయిన్ ఒంటరిగా ఉండాల్సిరావడం, ఆ క్రమంలో బంగ్లాలో కొన్ని ఆత్మలతో ఎదురైన భయానక అనుభవాల నేపథ్యంలో సాగిన ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా అనిపించింది. •




అలనాటి కథ

ఆ నాటి రాజరికపు వివాహాలు

అనంత్ అంబానీ, రాధికా మర్చంట్ పెళ్లి వేడుకలు చూసి ప్రపంచమంతా విస్తుపోయింది. అంగరంగ వైభవంగా పెళ్లి చేయటమంటే ఏమిటో వారు ప్రపంచానికి రుచి చూపించారు. టీవీలలోను.. పేపర్లలోను.. సోషల్ మీడియాలోను ఎక్కడ చూసిన ఆ పెళ్లి కబుర్లే! ఒకప్పుడు రాజ కుటుంబాలలో కూడా ఈ తరహా పెళ్లిళ్లు జరుగుతూ ఉండేవి. కానీ అవి కేవలం కొన్ని కుటుంబాలకు మాత్రమే పరిమితమయ్యేవి.

రాజుకైనా.. పేదకైన పెళ్లి పెళ్లే! నా ఉద్దేశంలో మన భారతీయ సంస్కృతిలో ఉన్న గొప్పదనం అదే! ఆర్థికహోదా బట్టి పెట్టే ఖర్చు మారచ్చు.. చేసే వేడుకల తీరు మారచ్చు.. విందుల్లో పెట్టే పదార్థాలు మారచ్చు.. కానీ వివాహం అనేది వ్యక్తికి మాత్రమే పరిమతం కాదు.. రెండు కుటుంబాల కలయిక అనే విషయం ఇప్పటికీ మనకు తెలిసేలా వివాహ వేడుకలు ఉంటాయి. నేను ఎక్కువ కాలం జీవించింది హైదరాబాద్‌లోనే కాబట్టి ఇక్కడ రాజకుటుంబాల వివాహాలను నేరుగా చూసే అవకాశం నాకు దక్కింది. సాధారణంగా రాజకుటుంబీకులు- తమ హోదాలో ఉన్నవారిని మాత్రమే వివాహ వేడుకలకు పిలిచేవారు. కొందరు వివాహ సమయంలో భండారా (ఆహార వితరణ) చేసేవారు. హైదరాబాద్ నిజాం కుటుంబీకులు మాత్రం పెళ్లిని తమ కుటుంబానికి సంబంధించిన వ్యవహారంగా మాత్రమే చూసేవారు. నాకు తెలిసి ఏ నిజాం తన ఇంట్లో జరిగే ఏ పెళ్లికి 'సామాన్య ప్రజలను' కానీ వారి ప్రతినిధులను కానీ వివాహాలను పిలిచేవారు కారు. నిజాం ఆస్థానంలో ఉన్న కొందరు రాజకుటుంబీకులనే వివాహానికి పిలిచేవారు. నిజాం కుటుంబీకులు ఎవరైనా ఇతరుల వివాహానికి హాజరయితే సమాజంలో వారి గౌరవం రెట్టింపు అయ్యేది. చాలా అరుదుగా వారు పెళ్లిళ్లకు వచ్చేవారు. నాన్న రాజా ధన్‌రాజ్‌గిరికి నిజాం కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఉండేవి కాబట్టి చెల్లి రేణుక పెళ్లికి ప్రిన్స్ ముఖరం ఝా బహదూర్ వచ్చారు. రావటమే కాదు.. రేణుక చేతికి ముత్యాలు, బంగారపు దారం తయారుచేసిన సెహ్రా (తల మీద ముత్యాలతో కట్టే ఒక ఆభరణం) కట్టారు. సాధారణంగా నిజాం పాలనలో యువరాజులు వచ్చినప్పుడు వారికి నజర్ (కానుక)ను ఇవ్వటం ఒక ఆచారంగా ఉండేది. ముఖరం ఝా ఆ నజర్‌ను స్వీకరించలేదు. అంటే మమల్ని కూడా ఆయన ఒక కుటుంబ సభ్యులుగా భావించారని అర్థం. ఈ వార్త ఆ రోజుల్లో పెద్ద సంచలనం సృష్టించింది. ఇక్కడ సెహ్రా గురించి కూడా కొద్దిగా చెప్పాలి. ఒకప్పుడు పెళ్లికూతురుకు కట్టే సెహ్రాను చాలా పవిత్రమైనదిగా.. వివాహవేడుకల్లో ముఖ్యమైనదిగా భావించేవారు. అందుకే గాలిబ్ ఒక చోట- "నా చెలి సెహ్రాకు అవసరమైన ముత్యాల కోసం సముద్రమంతా గాలిస్తున్నాను" అంటాడు. ఆ రోజుల్లో సామాన్యంగా ఎప్పుడూ పాటలు పాడని వారు కూడా పెళ్లిళ్లలో "దుల్హా ఆయా.. హర్యాలా బనా ఆయా" అంటూ ఉత్సాహంగా పాటలు పాడేవారు. అంతే కాదు. వివాహాలలో షెహనాయి తప్పనిసరి. షెహనాయి మోగితే ఏవైనా దుష్టశక్తులు ఉంటే పారిపోతాయని భావించేవారు. ఇక ఆడంబరాల విషయానికి వస్తే- పెద్ద కుటుంబాల వారికి పెళ్లిళ్లు తమ సంపదను ప్రదర్శించుకోవటానికి ఒక సందర్భంగా మారేది. ఏదైనా పెళ్లిలో రాజకుటుంబాలకు సంబంధించిన సైన్యం బారాత్‌లో పాల్గొంటే అది గొప్పింటి పెళ్లిగా భావించేవారు. నాకు గుర్తున్నంత వరకు ఒక రాజకుటుంబానికి చెందిన పెళ్లి బారత్- హైదరాబాద్ నుంచి సికింద్రాబాద్ వరకు నడిచింది. మా ఇంట్లో జరిగిన ఒక వివాహంలో బారాత్‌లో సాలార్‌జంగ్ సైన్యం ముందు నడిచింది. ఆ రోజుల్లో అదొక పెద్ద సంచలనం.



నేను గత 80 ఏళ్లలో అనేక పెళ్లిళ్లు చూశాను. పెళ్లిళ్ల విషయంలో అప్పటికీ.. ఇప్పటికి వచ్చిన ప్రధాన మార్పు- బాధ్యతలు, అప్యాయతలు తగ్గిపోవటం. ఒకప్పుడు పెళ్లంటే ఒక బాధ్యత. దూరపు చుట్టాలు కూడా ముందుగానే వచ్చి పెళ్లి పనుల్లో పాల్గొనేవారు. అందువల్లే ఐదు రోజుల పెళ్లిళ్లు కూడా సునాయాసంగా జరిగిపోయేవి. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. ఈ మధ్యకాలంలో- కేవలం ఫొటోల కోసమో.. సోషల్ మీడియాలో పోస్టుల కోసమో పెళ్లిళ్లను ఘనంగా జరిపించాలనుకొనే వారి సంఖ్య కూడా పెరిగిపోయింది. నేను గమనించినదేమిటంటే- ఎంతో ఆతృతగా ఎక్కువ ఖర్చు పెట్టి ఫోటోలు తీయించుకున్నవారికి కూడా ఆ ఫోటోలు చూసేందుకు సమయం లేకపోవటం! ఒకప్పుడు ఆల్బమ్స్ ఉండేవి. వాటిని చూడటానికి అందరూ సమయం కేటాయించేవారు. కానీ ఈ డిజిటల్ యుగంలో ఎవ్వరికి అంత సమయం లేదు. చివరగా- వివాహం చేయటం ఒక కుటుంబ బాధ్యత. దానికి వెళ్లటం ఒక సామాజిక బాధ్యత. ఇతరులతో ఆనందకరమైన క్షణాలను పంచుకోవటం వల్ల సామాజికంగా ఉండే అనేక రకాల సమస్యలు తొలగిపోతాయి. అందుకే ఎవరు పిలిచినా- పెళ్లికి వెళ్లండి.. వారితో ఆనంద క్షణాలు పంచుకోండి.

• రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్

బిజినెస్

విజయవాడ ● ఆదివారం 21 జూలై 2024

అజర్‌బైజాన్ చమురు క్షేత్రంలో ఓఎన్‌జీసీ విదేశ్ చేతికి ఈక్వియర్ వాటా

న్యూఢిల్లీ: అజర్‌బైజాన్ చమురు క్షేత్రంలో నార్వే సంస్థ ఈక్వియర్ వాటాను కొనుగోలు చేసినట్లు ఓఎన్‌జీసీ అనుబంధ సంస్థ ఓఎన్‌జీసీ విదేశ్ లిమిటెడ్ (ఓవీఎల్) వెల్లడించింది. 6 కోట్ల డాలర్ల (దాదాపు రూ.500 కోట్లు)కు ఈ వాటాను కొనుగోలు చేసినట్లు తెలిపింది. ఈ మేరకు ఈక్వినార్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు పేర్కొంది. ఒప్పందంలో భాగంగా అజర్‌బైజాన్‌లోని అజేరీ చిరాగ్ గునాషి (ఏసీజీ) చమురు క్షేత్రంలో 0.615 శాతం వాటాతో పాటు బాకు తబిలిసీ సేహాన్ (బీటీసీ) పైప్‌లైన్ కంపెనీలో 0.737 శాతం వాటాకు సమానమైన షేర్లను మరో అనుబంధ సంస్థ ఓఎన్‌జీసీ బీటీసీ ద్వారా కొనుగోలు చేసినట్లు ఓవీఎల్ తెలిపింది.

- రాయల్‌ఓక్ ఫర్నీచర్ ఆంధ్రప్రదేశ్‌లో తన కార్యకలాపాలు విస్తరించింది. ఇందులో భాగంగా గుంటూరులో కొత్త షోరూమ్‌ను ప్రారంభించింది. రాష్ట్రంలో సంస్థకిది 15వ స్టోర్. ఈ స్టోర్‌లో 10 వేలకు పైగా ఫర్నీచర్ ఉత్పత్తులు అందుబాటులో ఉండనున్నాయి.
- ఇసుజు మోటార్స్ ఇండియా.. ఇసుజు ఐ-కేర్ మాన్‌సూన్ క్యాంప్‌ను ప్రారంభించింది. ఈ నెల 22 నుంచి 28 వరకు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని అధీకృత డీలర్‌షిప్‌ల్లో ఇది అందుబాటులో ఉండనుంది. ఈ క్యాంప్‌లో భాగంగా మెయింటెనెన్స్ చెక్స్‌తో పాటు విడి భాగాలు, లూబ్రికెంట్స్‌పై డిస్కౌంట్స్‌ను అందించనుంది.

బ్యాంకులు భళా

క్యూ1లో మెరుగైన ఆర్థిక ఫలితాలు ప్రకటించిన ఐదు దేశీయ బ్యాంకులు

ముంబై: దేశీయ ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సహా 5 బ్యాంకులు శనివారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలను ప్రకటించాయి. అందులో ఓ ప్రభుత్వ రంగ బ్యాంకూ ఉంది. అన్ని బ్యాంకుల లాభం, ఆదాయాల్లో మెరుగైన వృద్ధి నమోదైంది. ఆ వివరాలు.



హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాభం రూ.16,474 కోట్లు

ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లో జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి (క్యూ1) హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రతిపాదికన 33.17 శాతం వృద్ధితో రూ.16,474.85 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి బ్యాంక్ లాభం రూ.12,370 కోట్లుగా నమోదైంది. కాగా, ఈ క్యూ1లో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.83,701 కోట్లకు ఎగబాకింది. క్రితం ఏడాదిలో ఇదే సమయానికి రాబడి రూ.57,816 కోట్లుగా ఉంది. నికర వడ్డీ మార్జిన్ (ఎన్‌ఐఎం) 3.47 శాతానికి మెరుగుపడటంతో ఈ జూన్ త్రైమాసికంలో నికర వడ్డీ ఆదాయం (ఎన్‌ఐఐ) 2.6 శాతం వృద్ధితో రూ.29,840 కోట్లకు పెరిగింది. వడ్డీయేతర ఆదాయం మాత్రం 41.3 శాతం తగ్గి రూ.10,670 కోట్లకు పరిమితమైంది. వార్షిక ప్రాతిపదికన పోలిస్తే, మొండిబకాయిల నష్టాలను పూడ్చుకోవడంతోపాటు ఇతర అవసరాల కోసం బ్యాంక్ కేటాయింపులు రూ.2,860 కోట్ల నుంచి రూ.2,602 కోట్లకు తగ్గాయి. ఈ మార్చి చివరినాటికి, మొత్తం ఆస్తుల్లో 1.24 శాతంగా నమోదైన మొండిబాకీలు లేదా స్థూల నిరర్థక ఆస్తుల (గ్రాస్ ఎన్‌పీఏ) వాటా.. ఈ జూన్ 30 నాటికి 1.33 శాతానికి పెరిగింది. గత నెలాఖరు నాటికి బ్యాంక్ మూలధన సమృద్ధి నిష్పత్తి 19.33 శాతంగా నమోదైంది.

కోటక్ బ్యాంక్ లాభంలో స్వల్ప వృద్ధి

ఈ జూన్‌తో ముగిసిన త్రైమాసికానికి గాను కోటక్ మహీంద్రా బ్యాంక్ రూ.3,520 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం సంవత్సరంలో ఇదే కాలానికి ఆర్జించిన రూ.3,452 కోట్ల లాభంతో పోలిస్తే 2 శాతం వృద్ధి నమోదైంది. ఏకీకృత నికర లాభం మాత్రం 79 శాతం వృద్ధితో రూ.7,448 కోట్లుగా నమోదైంది. బీమా విభాగంలో విక్రయం ద్వారా ఆదాయం సమకూరడం ఇందుకు కలిసివచ్చింది. కాగా, గడిచిన మూడు నెలల్లో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.15,675 కోట్లకు పెరిగింది. గత ఏడాదిలో ఇదే సమయానికి రాబడి రూ.13,183 కోట్లుగా ఉంది. బ్యాంక్‌కు వడ్డీ ఆదాయం రూ.10,500 కోట్ల నుంచి రూ.12,746 కోట్లకు ఎగబాకింది. ఈ మార్చి 31తో పోలిస్తే, జూన్ చివరినాటికి బ్యాంక్ మొండి బాకీలు లేదా గ్రాస్ ఎన్‌పీఏలు ఎలాంటి మార్పు లేకుండా 1.39 శాతంగా నమోదయ్యాయి. నికర ఎన్‌పీఏలు మాత్రం 0.40 శాతం నుంచి 0.35 శాతానికి తగ్గాయి. ఈ జూన్ 30 నాటికి బ్యాంక్ మూలధన సమృద్ధి నిష్పత్తి 22.41 శాతంగా ఉంది.

ఆకట్టుకున్న ఆర్‌బీఎల్ బ్యాంక్

జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికంలోలో ఆర్‌బీఎల్ బ్యాంక్ లాభం 29 శాతం పెరిగి రూ.372 కోట్లకు చేరుకుంది. నికర వడ్డీ ఆదాయం 20 శాతం వృద్ధితో రూ.1,700 కోట్లకు పెరిగింది. రుణాల్లో 19 శాతం పెరుగుదల వడ్డీ ఆదాయ వృద్ధికి తోడ్పడింది. కాగా, నికర వడ్డీ మార్జిన్ 5.67 శాతంగా నమోదైంది. ఈ జూన్ చివరినాటికి బ్యాంక్ గ్రాస్ ఎన్‌పీఏలు 2.69 శాతానికి తగ్గాయి.

యెస్ బ్యాంక్ లాభంలో 47 శాతం వృద్ధి

ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి గాను యెస్ బ్యాంక్ లాభం వార్షిక ప్రాతిపదికన 46. శాతం వృద్ధితో రూ.502 కోట్లకు చేరుకుంది. మొండి బాకీల కోసం కేటాయింపులు తగ్గుముఖం పట్టడం ఇందుకు దోహదపడింది. గత మూడు నెలల్లో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్‌ఐఐ) 12.2 శాతం పెరిగి రూ.2,000 కోట్లుగా నమోదైంది. నికర వడ్డీ మార్జిన్ (ఎన్‌ఐఎం) మాత్రం 2.4 శాతంగానే కొనసాగింది. అయితే, ప్రస్తుతం బ్యాంకింగ్ రంగంలో సవాలుగా మారిన డిపాజిట్ల సమీకరణలో విషయంలో మాత్రం యెస్ బ్యాంక్ మంచి ప్రగతి సాధించింది. గత మూడు నెలల్లో బ్యాంక్ డిపాజిట్లలో 20 శాతం వృద్ధి నమోదైంది. ఎన్‌పీఏలు సహా ఇతర అవసరాల కోసం బ్యాంక్ కేటాయింపులు 41.2 శాతం తగ్గి రూ.212 కోట్లకు పరిమితమయ్యాయి. సమీక్షా కాలానికి బ్యాంక్ గ్రాస్ ఎన్‌పీఏలు 1.7 శాతంగా నమోదయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో 16-17 శాతం రుణ వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నట్లు యెస్ బ్యాంక్ ఎండీ, సీఈఓ ప్రశాంత్ కుమార్ తెలిపారు.

యూబీఐ లాభం రూ.3,679 కోట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికానికి (క్యూ1) యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) నికర లాభం వార్షిక ప్రాతిపదికన 13.7 శాతం వృద్ధితో రూ.3,679 కోట్లకు పెరిగింది. బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్‌ఐఐ) 6.5 శాతం పెరిగి రూ.9,412 కోట్లకు చేరుకుంది. నికర వడ్డీ మార్జిన్ (ఎన్‌ఐఎం) మాత్రం 0.13 శాతం తగ్గి 3.05 శాతానికి పరిమితమైంది. డిపాజిట్ల సమీకరణ వ్యయం పెరగడంతో వడ్డీ మార్జిన్లను 3 శాతం ఎగువన కొనసాగించడం సవాలుగా మారిందని యూబీఐ ఎండీ, సీఈఓ ఏ మణిమేఖలై అన్నారు. కాగా, సమీక్షా కాలానికి బ్యాంక్ ఇతర ఆదాయం 15.53 శాతం పెరిగి రూ.4,509 కోట్లుగా నమోదైంది. గడిచిన మూడు నెలల్లో రూ.2,318 కోట్ల రుణాలు మొండి పద్దుల్లోకి మళ్లాయి. అయినప్పటికీ, జూన్ చివరినాటికి బ్యాంక్ మొండిబాకీలు లేదా గ్రాస్ ఎన్‌పీఏలు 4.54 శాతానికి తగ్గాయి. కానీ, మొండిబాకీలతో పాటు ఇతర అవసరాల కోసం కేటాయింపులు మాత్రం రూ.4,106 కోట్లకు పెరిగాయి. బ్యాంక్ మూలధన సమృద్ధి నిష్పత్తి 17.92 శాతానికి మెరుగుపడింది. నిధులపరంగా బ్యాంక్ పరిస్థితి సౌఖ్యంగానే ఉందని మణిమేఖలై అన్నారు. గతంలో ప్రకటించిన 11-13 శాతం రుణ వృద్ధి, 8-10 శాతం డిపాజిట్ల వృద్ధి లక్ష్యాలను చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

పన్ను పోటు తగ్గించరూ..!



బడ్జెట్‌పై వేతన జీవుల ఆశలు

ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్ ఎలా ఉండబోతోందన్న ఆసక్తి అంతటా నెలకొని ఉంది. ముఖ్యంగా వేతన జీవులు ఈ నెల 23న ప్రవేశ పెట్టబోయే బడ్జెట్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. పన్ను శ్లాబుల్లో మార్పులతో పాటు మరికొన్ని విషయాల్లో ప్రభుత్వం తమపై కనికరం చూపిస్తుందని వారు అంచనా వేస్తున్నారు. పాత ట్యాక్స్ విధానం కింద వేతన జీవులు వచ్చే కేంద్ర బడ్జెట్ నుంచి ఏం ఆశిస్తున్నారంటే..

ట్యాక్స్ శ్లాబుల్లో మార్పు

గత ఏడాది బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వేతన జీవులపై కొద్దిగా దయ చూపారనే చెప్పాలి. పన్ను మినహాయింపు వార్షిక ఆదాయ పరిమితిని రూ.2.5 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచారు. అలాగే వార్షిక ఆదాయం రూ.5 కోట్లకు మించి ఉన్న వారిపై విధించే సర్‌చార్జీని 37 శాతం నుంచి 25 శాతానికి కుదించారు. కొత్త ట్యాక్స్ విధానాన్ని ఎంచుకునే వారికి ఇవి ఆకర్షించే అంశాలే. అయితే పాత పన్ను విధానాన్ని ఎంచుకునే వారికి మాత్రం పెద్దగా ఊరట లభించలేదనే చెప్పాలి. ప్రస్తుతం జీవన వ్యయం పెరిగిపోయింది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్థిక మంత్రి వచ్చే బడ్జెట్‌లో అందరికీ పన్ను మినహాయింపు వార్షిక ఆదాయ పరిమితిని ప్రస్తుత రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని కోరుతున్నారు. అలాగే ప్రామాణిక మినహాయింపునీ ప్రస్తుత రూ.50,000 నుంచి రూ.లక్షకు పెంచితే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు.

హెచ్‌ఆర్‌ఏ రేట్లు

కొవిడ్ తర్వాత దేశంలోని ప్రధాన నగరాల్లో ఇళ్ల అద్దెలు పెరిగిపోయాయి. గత ఏడాదైతే 30 శాతం పెరిగాయి. ఆర్థికాభివృద్ధి కారణంగా ప్రస్తుతం హైదరాబాద్, బెంగళూరు, పుణె, నోయిడా వంటి చోట్లా ఇళ్ల అద్దెలు చుక్కలంటుతున్నాయి. ప్రస్తుతం ఉద్యోగుల మొత్తం జీతంలో 20 నుంచి 30 శాతాన్నే హౌస్ రెంట్ అలవెన్స్ (హెచ్‌ఆర్‌ఏ)గా అనుమతిస్తున్నారు. ప్రధాన మెట్రో నగరాల్లో అయితే బేసిక్ జీతంలో 50 శాతం, ఇతర ప్రధాన నగరాల్లో 40 శాతాన్ని అనుమతిస్తున్నారు. హైదరాబాద్, బెంగళూరు, పుణె వంటి నగరాల్లోని ఉద్యోగులకీ తమ బేసిక్ జీతంలో 50 శాతాన్ని హెచ్‌ఆర్‌ఏగా అనుమతించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

ఈవీలకు ప్రోత్సాహం

ప్రస్తుతం మన దేశంలోనూ విద్యుత్ వాహనాల (ఈవీ) హవా నడుస్తోంది. 2019 బడ్జెట్‌లో ఈవీ కార్లు కొని వినియోగించే ఉద్యోగులను ప్రోత్సహించేందుకు ఏటా రూ.1.5 లక్షల వరకు ఆదాయ మినహాయింపుని అనుమతించేవారు. ఏ కారణంతోనే గత ఏడాది నుంచి ఈ మినహాయింపును నిలిపివేశారు. కనీసం వచ్చే బడ్జెట్‌లో అయినా దీన్ని పునరుద్ధరించి, మినహాయింపు పరిమితినీ రూ.2 లక్షలకు పెంచాలని వేతన జీవులు కోరుతున్నారు.

గృహ రుణాలు

అందరికీ సొంతిల్లు ప్రభుత్వ లక్ష్యం. ఈ లక్ష్య సాధనలో భాగంగా 2019లో ఆదాయ పన్ను చట్టంలో 80ఈఈఏ తీసుకొచ్చారు. ఈ సెక్షన్ కింద తొలిసారిగా గృహ రుణంతో అందుబాటు ధరల కేటగిరీలో ఇల్లు కొనుక్కున్న వ్యక్తులకు, ఆ రుణంపై ఏటా చెల్లించే వడ్డీలో రూ.1.5 లక్షల వరకు ఆదాయ పన్ను నుంచి మినహాయింపు ఇచ్చారు. గత ఏడాది నుంచి దీన్ని తీసివేశారు. కనీసం వచ్చే బడ్జెట్‌లో అయినా ఆర్థిక మంత్రి దీన్ని పునరుద్ధరించి.. మినహాయింపు పరిమితిని రెట్టింపు చేయాలని వేతన జీవుల కాంక్ష.

ఎంఎస్ఎంఈలకు ఎం1ఎక్స్ఛేంజీ ఫైనాన్సింగ్ సేవలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ట్రేడ్ రిసీవబుల్స్ డిస్కౌంటింగ్ సిస్టమ్ (ట్రేడ్స్) ప్లాట్‌ఫామ్ ఎం1ఎక్స్ఛేంజీ.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని సూక్ష్మ,చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ)కు ఫైనాన్సింగ్ సేవలను మరింతగా విస్తరించేందుకు రెడీ అవుతోంది. ఎంఎస్ఎంఈలు తమ కార్యకలాపాలను సజావుగా నిర్వహించేందుకు గాను వారి కొనుగోలుదారులు జారీ చేసే ఇన్వాయిస్‌ల ఆధారంగా ఎం1ఎక్స్ఛేంజీ ఫైనాన్సింగ్ సదుపాయాలను కల్పిస్తోందని సంస్థ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ రాయ్ మాథ్యూ కురియన్ వెల్లడించారు. ప్రస్తుతం ఎంఎస్ఎంఈలకు బకాయిలు చెల్లించేందుకు 45 రోజుల గడువు ఉందని, ఈ సమయంలో వారు నిధుల కొరతను ఎదుర్కొనకుండా, కార్యకలాపాలను నిరాటంకంగా కొనసాగించేందుకు గాను తాము ఫైనాన్సింగ్ సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం తాము 60 బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో 2,000కు పైగా ఎంఎస్ఎంఈలు తమ ప్లాట్‌ఫామ్ ద్వారా సేవలందుకుంటున్నారని కురియన్ పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ సంఖ్యను 5,000కు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన వివరించారు.

ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం: కాగా ఆంధ్రప్రదేశ్‌లోని ఎంఎస్ఎంఈలకు సేవలందించేందుకు గాను ఈ మధ్యనే ఆ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే త్వరలోనే విజయవాడ, విశాఖపట్నంల్లో సేల్స్ ఆఫీస్‌లను ప్రారంభించాలని చూస్తున్నట్లు చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో ఎం1ఎక్స్ఛేంజీ రూ.43,300 కోట్ల విలువైన ఇన్వాయిస్‌లను ఫెసిలిటేట్ చేయగా ఈ ఆర్థిక సంవత్సరంలో ఈ విలువను రూ.72,000 కోట్లకు చేర్చాలని చూస్తున్నట్లు చెప్పారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



21వ తేదీ			
హైదరాబాద్	520	విజయవాడ	530
వరంగల్	522	గోదావరి	520
చిత్తూరు	573	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**




హైదరాబాద్	112	విజయవాడ	117
వరంగల్	112	గుంటూరు	118
కరీంనగర్	112	ఒంగోలు	118
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	129
కర్నూలు	112	నెల్లూరు	129
విశాఖపట్నం	106	అనంతపురం	117
గోదావరి	117		

పతకాలు పట్టుకొచ్చేదెవరు?

- కుస్తీలో ఆరుగురు
- వినేష్‌పైనే దృష్టి

ఒలింపిక్స్‌లో భారత పతకాలు ఆశిస్తున్న విభాగాల్లో రెజ్లింగ్ ఒకటి. గత నాలుగు ఎడిషన్లుగా మన రెజ్లర్లు మెడల్స్ కొల్లగొడుతూనే ఉండడంతో.. దేశంలో కుస్తీ క్రీడకు క్రేజ్ పెరిగింది. 2008లో కాంస్యంతో యావత్ దేశాన్ని ఉర్రూతలూగించిన సుశీల్ కుమార్ ఆ తర్వాత లండన్ క్రీడల్లో రజతం సొంతం చేసుకొన్నాడు. 2012లో యోగేశ్వర్ దత్ కాంస్యంతో మెరిశాడు. 2016లో సాక్షి మాలిక్ కంచు మోత మోగించగా.. 2020 టోక్యోలో రవి దహియా, బజ్‌రంగ్ పూనియాలు రజత, కాంస్యాలతో అదరగొట్టారు. అయితే, ఈ క్రీడకు బలమైన పునాదులు పడుతున్న క్రమంలో అంతర్గత రాజకీయాలు, లైంగిక వేధింపుల ఆరోపణలు, తిరుగుబాట్లతో ఒక్కసారిగా అథఃపాతాళానికి పడిపోయింది. పారిస్ క్రీడలకు ఆరుగురు మాత్రమే అర్హత సాధించారు. వీరిలో పతకాలు గెలిచే సత్తా ఉన్న వారు ఎవరు? అంటే కచ్చితంగా చెప్పలేని పరిస్థితి.



వినేష్ ఫొగట్

బరిలో ఉన్న భారత అత్యుత్తమ మహిళా రెజ్లర్ ఫొగట్ అనడంలో సందేహం లేదు. ఈసారి 50 కిలోల విభాగంలో వినేష్ బరిలోకి దిగుతోంది. అదను చూసి దాడి చేస్తూనే.. చాకచక్యంగా తనను తాను రక్షించుకోగలదు. అయితే, తక్కువ వెయిట్ విభాగానికి మారడం కోసం శరీరాన్ని ఎంతో ఒత్తిడికి గురి చేసింది. పైగా ఏడాదికి పైగా నిరసన కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల తగినంత ప్రాక్టీస్ చేయలేదనే చెప్పుకోవాలి.



అంతిమ్ పంగల్..: దేశానికి తొలి పారిస్ కోటా బెర్త్‌ను ఖరారు చేసింది. 53 కిలోల విభాగం బరిలోకి దిగనున్న పంగల్ పతకం సాధించాలనే పట్టుదలతో ఉంది. ప్రత్యర్థుల పట్టుకు చిక్కకుండా తప్పించుకోవడం అంతిమ్ స్పెషల్. వెన్ను గాయం కారణంగా పోటీలకు దూరమవడంతో తగినంత సాధన చేయలేకపోయింది. అంతర్జాతీయ అనుభవం కూడా తక్కువే.



అన్షు మాలిక్..: దూకుడుగా ఆడే అన్షు 57 కిలోల విభాగంలో ఆడనుంది. జూనియర్ స్థాయిలో ప్రకంపనలు సృష్టించినా.. సీనియర్ విభాగంలో ఆశించినంత ప్రదర్శన చేయలేకపోయింది. ఫిట్‌నెస్‌పై కూడా అనుమానాలున్నాయి.



నిషా దహియా..: బెదురు లేకుండా ప్రత్యర్థిపై అటాక్ చేయడం నిషా స్టైల్. 68 కిలోల విభాగంలో సైలెంట్‌గా బెర్త్ పట్టేసింది. ఎక్కువ సేపు బౌట్ సాగితే అలసిపోతుంది. తొలిసారి ఒలింపిక్స్ బరిలోకి దిగుతున్న నేపథ్యంలో ఒత్తిడిని ఎలా ఎదుర్కొంటుందనే దానిపై పతక ఆశలు ఆధారపడి ఉన్నాయి.



రీతిక హుడా..: ఊహించని రీతిలో ప్రత్యర్థిపై దాడి చేయగల నేర్పు రీతిక సొంతం. 76 కిలోల్లో గట్టిపోటీ ఇవ్వగల రెజ్లర్లలో హుడా కూడా ఉంది. బౌట్ చివర్లలో ప్రత్యర్థికి పాయింట్లు ఇచ్చుకోవడం రీతికకు మైనస్‌గా మారుతోంది.

అమన్ షెహ్రావత్

జట్టులో ఒకే ఒక్క పురుష రెజ్లర్. 57 కిలోల ట్రయల్స్‌లో ఒలింపిక్ పతక విజేత రవి దహియాకు షాకిచ్చి పారిస్ బెర్త్ పట్టేశాడు. ఎక్కువ సమయం పోరాడగలగడం అమన్ బలమైనా.. సాంకేతికంగా ఎంతో బలహీనం. వ్యూహాత్మకంగా ఆడలేదు. ప్లాన్-బి అనేది ఉండదు.



స్పోర్ట్స్

గురి కుదిరేనా!

పారిస్ ఒలింపిక్స్ 5 రోజుల్లో



షూటింగ్ బరిలో 21 మంది

పారిస్ ఒలింపిక్స్ షూటింగ్‌లో ఎన్నో ఆశలతో భారత్ బరిలో దిగుతోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా రైఫిల్, పిస్టల్, షాట్‌గన్ విభాగాల్లో కలిపి మొత్తం 21 కోటా స్థానాలను భారత్ దక్కించుకుంది. అన్ని స్థానాలు లభించడం మన షూటర్ల ప్రతిభకు నిదర్శనం. దాంతో సహజంగానే పారిస్‌లో పతకాలపై భారీగా అంచనాలు ఏర్పడ్డాయి. ఈ ఒలింపిక్స్ షూటింగ్ విభాగంలో తలపడేందుకు మొత్తం 81 దేశాలు క్వాలిఫై అయ్యాయి. ఇందులో భారత్, చైనాల నుంచే అత్యధిక మంది షూటర్లు పోటీపడుతుండడం విశేషం.



టోక్యో విశ్వక్రీడల్లో అత్యధికంగా 15 మంది భారత షూటర్లు బరిలో దిగారు. ఒలింపిక్స్ షూటింగ్ కేటగిరీలో మన దేశానికి సంబంధించి అది రికార్డు. 2016 రియో క్రీడల్లో 12 మందే తలపడ్డారు. టోక్యోలో పురుషుల 10 మీ. ఎయిర్ పిస్టల్‌లో టీనేజ్ షూటర్ సౌరభ్ చౌధరి ఫైనల్‌కు చేరడమే ఆ క్రీడల్లో మన అత్యుత్తమ ప్రదర్శన. ఈసారి మనూభాకర్, ఇషా సింగ్, అంజుమ్ మౌద్గిల్, శరబ్ జోత్ సింగ్, రిథమ్ సంగ్వాన్, అనీశ్ భన్వాలా, విజయ్‌వీర్ సిద్ధూ, ఎలవేనిల్ వలరివన్, పృథ్వీరాజ్ తదితరులు బరిలో ఉన్నారు. ఇక 21 మందిలో.. 15 మంది రైఫిల్, పిస్టల్ విభాగాల్లో, ఆరుగురు షాట్‌గన్‌లో అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

సిఫ్ట్‌కౌర్.. సై

22 ఏళ్ల సిఫ్ట్ కౌర్ శర్మ.. మహిళల 50 మీ. రైఫిల్ త్రీ పొజిషన్ విభాగంలో వరల్డ్ రికార్డ్ హోల్డర్. హాంగ్‌ఝౌ ఆసియాడ్‌లో స్వర్ణ పతకం సొంతం చేసుకున్న కౌర్ పారిస్‌తో ఒలింపిక్స్ అరంగేట్రం చేస్తోంది. ఎంతో ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఉంటూ లక్ష్యాన్ని 'గురి' చూసి కొట్టడం ఆమె ప్రత్యేకత. ఒలింపిక్స్ షూటింగ్ మహిళల విభాగంలో భారత్‌కు తొలి పతకం అందించాలని ధ్యేయంగా కౌర్ పారిస్‌లో అడుగుపెడుతోంది. మూడు విభాగాల్లో తలపడుతున్న 22 ఏళ్ల మనూ భాకర్ (10 మీ. పిస్టల్, 25 మీ. పిస్టల్, 15మీ. పిస్టల్ టీమ్), రెండో ఒలింపిక్స్‌లో తలపడుతున్న 30 ఏళ్ల అంజుమ్ మౌద్గిల్, ఐశ్వరీ ప్రతాప్ సింగ్ టోమర్, సందీప్ సింగ్, శరబ్‌జోత్ సింగ్ పైనా అంచనాలున్నాయి. అనుభవజ్ఞులు, యువకులతో కూడిన షూటింగ్ బృందం పారిస్‌లో మెరుగైన ప్రదర్శన చేయడం ద్వారా మరిన్ని పతకాలు తేవాలని పట్టుదలగా ఉంది. కనీసం మూడు లేదా నాలుగు పతకాలు ఈసారి మనకు లభిస్తాయనే నమ్మకంతో షూటర్లున్నారు. ఈ క్రమంలో వారంతా జర్మనీలో కఠినమైన శిక్షణ పొందారు.

ఇప్పటికి నాలుగే..

ఒలింపిక్స్ షూటింగ్‌లో భారత్ ఇప్పటి వరకు నాలుగు పతకాలే (ఒక స్వర్ణం, రెండు రజత, ఒక కాంస్యం) గెలుపొందింది. 2004 ఏథెన్స్ క్రీడల్లో రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ రజత పతకంతో విశ్వ క్రీడల షూటింగ్‌లో భారత్ ఖాతా తెరిచాడు. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో అభినవ్ బింద్రా స్వర్ణ పతకంతో చరిత్ర సృష్టిస్తే ఆ తర్వాత 2012లో గగన్ నారంగ్ (కాంస్యం), విజయ్ కుమార్ (రజత) పతకాలతో సత్తా చాటారు.



ఇషా సింగ్

మనూ భాకర్

ఇషాపై ఆశలు

అంతర్జాతీయ స్థాయిలో అద్భుత విజయాలు సాధిస్తున్న హైదరాబాద్ యువ షూటర్ ఇషా సింగ్‌పై అందరి దృష్టి నిలిచింది. మహిళల 25 మీ. పిస్టల్ విభాగంలో బరిలో దిగుతున్న 19 ఏళ్ల ఇషా సింగ్ తొలి ఒలింపిక్స్‌లో సత్తా చాటాలని ఉవ్విళూరుతోంది. ఆసియా క్రీడలు, వరల్డ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణాలు కొల్లగొట్టిన ఇషా..పారిస్‌కు ఆత్మవిశ్వాసంతో సిద్ధమైంది.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

పంత్‌నూ వదిలేసుకుంటారా?

న్యూఢిల్లీ: ఐపీఎల్ ఫ్రాంచైజీ ఢిల్లీ క్యాపిటల్స్ వచ్చే సీజన్ కోసం భారీ మార్పులే చేయనుంది. ఇప్పటికే తమ ప్రధాన కోచ్ పాంటింగ్‌ను తప్పించిన ఈ జట్టు తాజాగా కెప్టెన్ రిషభ్ పంత్‌ను కూడా వదులుకోనుందట. అతడి కెప్టెన్సీపై ఫ్రాంచైజీ అసంతృప్తితో ఉందని సమాచారం. ఒకవేళ పంత్‌ను వేలానికి ముందు వదులుకుంటే అతడితో ఒప్పందం కుదుర్చుకునేందుకు చెన్నై అమితాసక్తిని చూపుతున్నట్టు తెలిసింది.

సెమీస్ లక్ష్యంగా..

- నేడు యూఏఈతో భారత్ పోరు
- మహిళల ఆసియాకప్

మ. 2 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..



దంబుల్లా: పాకిస్థాన్‌తో జరిగిన తమ ఆరంభ మ్యాచ్‌లో ఘనవిజయం సాధించిన భారత మహిళల జట్టు ఇప్పుడు సెమీఫైనల్‌పై దృష్టి సారించింది. మహిళల టీ20 ఆసియాకప్‌లో హర్మన్‌ప్రీత్ సేన ఆదివారం యూఏఈతో తలపడనుంది. ఇటీవల అన్ని విభాగాల్లోనూ అదరగొడుతున్న భారత్ ఈ మెగా టోర్నీలోనూ అదే జోరును కనబరుస్తోంది. దీంతో ఇప్పటికే 2 పాయింట్లు, సూపర్ రన్‌రేట్‌తో ఉన్న భారత్ మరో గెలుపుతో సెమీస్ చాన్స్‌ను మరింత మెరుగుపర్చుకోవాలనుకుంటోంది. అటు తొలిమ్యాచ్‌లో నేపాల్‌పై ఓడిన యూఏఈ తమకన్నా ఎన్నోరెట్లు మెరుగైన భారత్‌కు కనీసపోటీనైనా ఇవ్వాలనే పట్టుదలతో ఉంది.

లంక బోణీ: ఆసియాకప్‌లో ఆతిథ్య శ్రీలంక బోణీ చేసింది. శనివారం గ్రూప్ 'బి'లో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్లతో విజయం సాధించింది.

అభిమానికి ఊహించని బహుమతి



దంబుల్లా: టీమిండియా వైస్-కెప్టెన్ స్మృతీ మంధాన తన అభిమానికి ఊహించని బహుమతి అందజేసింది. శ్రీలంకకు చెందిన దివ్యాంగురాలైన అదీషా హెరాత్‌కు మంధాన అంటే ఎనలేని అభిమానం. దాంతో ఆసియా కప్‌లో భాగంగా శుక్రవారం పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌కు తల్లి సాయంతో వీల్‌ఛైర్‌లో హాజరైంది అదీషా. విషయం తెలుసుకున్న మంధాన మ్యాచ్ అనంతరం హెరాత్‌ను కలిసింది. తన ఫేవరెట్ క్రికెటర్‌ను కలిసిన ఆనందంలో ఉన్న అదీషాను.. మరింత ఆశ్చర్యపరుస్తూ ఆమెకు మొబైల్ ఫోన్ బహుమతిగా అందజేసింది.

టీమిండియా సహాయ కోచ్‌లుగా అభిషేక్, డస్కటే!

న్యూఢిల్లీ: మాజీ ఆల్‌రౌండర్ అభిషేక్ నాయర్, నెదర్లాండ్స్ మాజీ ఆటగాడు టెన్ డస్కటే భారత క్రికెట్ జట్టు అసిస్టెంట్ కోచ్‌లుగా వ్యవహరించే చాన్సుంది. వీరి నియామకంపై బీసీసీఐ అధికారికంగా స్పందించకపోయినా.. వీరిద్దరు కూడా శ్రీలంక పర్యటనకు జట్టుతో పాటు వెళ్లనున్నట్టు సమాచారం. ఇప్పటికే ద్రవిడ్ స్థానంలో గంభీర్‌ను కోచ్‌గా నియమించిన విషయం తెలిసిందే. అతడికి సహాయకులుగా వీరు వ్యవహరిస్తారు. అభిషేక్, డస్కటే ఐపీఎల్‌లోనూ గౌతీతో కేకేఆర్ తరఫున బాధ్యతలు నిర్వర్తించారు. అయితే ఫీల్డింగ్ కోచ్‌గా దిలీప్ కొనసాగబోతున్నాడు. బౌలింగ్ కోచ్‌గా మోర్నీ మోర్కెల్‌పై బోర్డు ఆసక్తి చూపుతోంది.

భారత ఫుట్‌బాల్ కొత్త కోచ్.. మార్క్వెజ్



న్యూఢిల్లీ: భారత ఫుట్‌బాల్ జట్టు చీఫ్ కోచ్‌గా ఉద్వాసనకు గురైన ఇగోర్ స్టిమాక్ స్థానంలో స్పెయిన్‌కు చెందిన మనోలో మార్క్వెజ్ నియమితుడయ్యాడు. 55 ఏళ్ల మార్క్వెజ్ ప్రస్తుతం ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో ఎఫ్‌సీ గోవా జట్టు హెడ్ కోచ్‌గా ఉన్నాడు. అయితే, అతని పదవీకాలం ఎంతవరకు అన్నది అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య వెల్లడించలేదు.

భారీ ఆధిక్యంలో ఇంగ్లండ్

రెండో ఇన్నింగ్స్ 248/3

విండీస్ తొలి ఇన్నింగ్స్ 457

నాటింగ్‌హామ్: వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టులో ఇంగ్లండ్ 207 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. ఓపెనర్ డకెట్ (76), బ్రూక్ (71 బ్యాటింగ్), పోప్ (51) అర్ధసెంచరీలతో రాణించడంతో ఆతిథ్య జట్టు శనివారం ఆట ముగిసేసరికి రెండో ఇన్నింగ్స్‌లో 248/3 స్కోరు చేసింది. క్రీజులో బ్రూక్‌కు జతగా రూట్ (37) ఉన్నాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 351/5తో మూడోరోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన విండీస్ 457 రన్స్‌కు ఆలౌటైంది. జోషువా (82 నాటౌట్), షమార్ (33) పదో వికెట్‌కు 71 రన్స్ జత చేయడంతో విండీస్‌కు 41 రన్స్‌తో స్వల్ప ఆధిక్యం లభించింది. వోక్స్‌కు నాలుగు.. అట్కిన్సన్, బషీర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 416 రన్స్ చేసింది.







శుక్రవారం అల్లూరి జిల్లాలో గండిపోశమ్మ విగ్రహం ముఖం వరకు చేరిన వరద, శనివారం పూర్తిగా నీటమునిగిన ఆలయం, పోలవరంలో ముంపునకు గురైన తాళ్లూరు గ్రామంలో ఆవేదనతో ఉన్న నిర్వాసితులు



దువ్వలోని వయ్యేరు కాల్వ వద్ద నీట మునిగిన గుడిసెలు

వరద గోదారి

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ తెలిపారు. ఎప్పటికప్పుడు వరద ప్రవాహాన్ని పర్యవేక్షిస్తూ, ప్రభావిత జిల్లాల అధికారులతో సమన్వయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. సహాయక చర్యల కోసం కోనసీమ, తూర్పుగోదావరి, అల్లూరి జిల్లాలకు ఒక్కొక్క, ఏలూరు జిల్లాకు 2 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, అలాగే, అల్లూరి జిల్లాకు ఒక ఎస్డీఆర్ఎఫ్ బృందాన్ని కూడా పంపినట్లు తెలిపారు. శనివారం సాయంత్రానికి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 35 అడుగులు, చింతూరు వద్ద శబరి నీటిమట్టం 35 అడుగులు నమోదైంది. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి 4,09,459 క్యూసెక్కుల నీరు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. వద్ద బ్యారేజీ నీటి మట్టం 8.70 అడుగులకు చేరింది. సోమవారం నాటికి ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉన్నట్లు అధికారుల అంచనా. ఏలూరు జిల్లా పోలవరంలో గోదావరి నీటి మట్టం పెరగడంతో 48 గేట్ల ద్వారా 5,87,747 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ధవళేశ్వరం వద్ద 175 గేట్లు ఎత్తి 3.46 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. స్పిల్‌వేలోకి సోమవారం నాటికి మరో 9 లక్షల క్యూసెక్కుల వరద జలాలు రానున్నట్లు ధవళేశ్వరం బ్యారేజీ అధికారులు తెలిపారు.

ఎగువ కాపర్ డ్యాం బ్యాక్ వాటర్ లెవెల్ పెరిగి సమీపంలోని గండిపోశమ్మ ఆలయం పూర్తిగా నీట మునిగింది. ఆలయ గోపురం వరకు వరద నీరు చేరింది. పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయానికి నలువైపులా ఇసుక తిన్నెలు నీటమునిగాయి.

ఆంధ్ర, ఒడిసా మధ్య నిలిచిన రాకపోకలు..

అల్లూరి సీతారామరాజు జిల్లాలో గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చింతూరులో శనివారం ఉదయానికి 207, ముంచంగిపుట్టులో 122, జీకే వీధిలో 113, పెదబయలులో 111, డుంబ్రిగుడలో 109, పాడేరులో 106 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆంధ్ర, ఒడిసా నడుమ రాకపోకలు నిలిచిపోయాయి. 326వ నెంబరు జాతీయ రహదారి కుయుగూరు కల్లేరుల వద్ద వర్షం ధాటికి కొట్టుకుపోయింది. అధికార యంత్రాంగం వివిధ గ్రామాల నుంచి 43 మంది గర్భిణులను నాటు పడవలు, ఆటోల ద్వారా చింతూరు ఏరియా ఆసుపత్రి, కూనవరం ఆసుపత్రిలకు తరలించింది. కొయ్యూరు మండలంలో రోడ్డు కొట్టుకుపోవడంతో సుమారు 30 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పాడేరు ఘాట్‌లో చెట్టు కూలడంతో సుమారు 2గంటలు ఘాట్‌లో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

జలదిగ్బంధంలో వేల ఎకరాలు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో భారీ వర్షాల వల్ల డ్రెయిన్లు, కాల్వలు పొంగి ప్రవహించడంతో వేలాది ఎకరాల్లో పంట పొలాలు నీటమునిగాయి. జిల్లాలో 422 ఎకరాల నర్సరీలు, 8888 ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగాయని వ్యవసాయశాఖ అధికారులు కలెక్టర్‌కు నివేదించారు. తూర్పుగోదావరి జిల్లాలో ఎర్రకాలువ, కొవ్వాడ కాలువ, బురద కాలువ, జల్ల కాలువలు పొంగడం వల్ల 14,329 హెక్టార్లలో వరి నాట్లు నీట మునిగాయి. 276.28 హెక్టార్లలో ఉద్యాన పంటలు నీట మునిగాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 60 విద్యుత్ స్తంభాలు, 79 ఎల్‌టీ పోల్స్, 14 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడంతో రూ.36.48 లక్షల నష్టం వాటిల్లింది. ఏలూరు జిల్లాలో 4,290 హెక్టార్లలో వరి పంట నీట మునిగింది.

శాంతించిన ఎర్రకాల్వ

ఏలూరు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో వాగులు పొంగుతూనే ఉన్నాయి. తమ్మిలేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. చింతలపూడి నగర పంచాయతీలోని నాగిరెడ్డిగూడెం తమ్మిలేరు ప్రాజెక్టులో ప్రస్తుతం నీటి నిల్వ 344.24 అడుగులు ఉండగా పరీవాహక ప్రాంతాల నుంచి 3,426 క్యూసెక్కులు నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. ఇక కొంగువారిగూడెం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో తగ్గింది. ఎర్రకాల్వ ప్రాజెక్టులోకి 8,655 క్యూసెక్కులు నీరు వచ్చి చేరుతుండగా, ప్రాజెక్టు నుంచి 10,696 క్యూసెక్కులు నీరు విడుదల చేస్తున్నారు. పరీవాహక ప్రాంతాల నుంచి నీటి ప్రవాహం తగ్గటంతో ఎర్రకాల్వ శాంతించింది. పెదవాగు వరదల వల్ల వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని 12 గ్రామాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రహదారులు ఛిన్నాభిన్నం అయ్యాయి. వరద బాధితులను ఆదుకోవడానికి జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలు చేపట్టింది. జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులతో సమీక్షించి వరద సహాయక చర్యలు చేపడుతున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో వాగులు, వంకలు ఉప్పొంగుతున్నాయి. కృష్ణా కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటుచేసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. విజయవాడ మల్లికార్జునపేటలో వర్షాలకు ఇల్లు కూలిపోయింది. మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లో కొండపై ఓ ఇంటి ప్రహరీ కూలడంతో మట్టిదిబ్బలు పక్కింటిపై పడ్డాయి.

తీరం దాటిన వాయుగుండం

వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం శనివారం ఒడిసాలో తీరం దాటింది. తరువాత వాయువ్యంగా పయనిస్తూ సాయంత్రానికి తీవ్ర అల్పపీడనంగా బలహీనపడింది. ఒడిసా, ఛత్తీస్‌గఢ్‌ల వైపుగా పయనించి ఆదివారం కల్లా బలహీనపడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో శనివారం కోస్తాలో ఎక్కువచోట్ల, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

తాళ్లూరులో.. కొండ పైకి 22 కుటుంబాలు

అల్లూరి జిల్లా దేవీపట్నం మండలం తాళ్లూరు గ్రామాన్ని గోదావరి వరదనీరు చుట్టుముట్టింది. గ్రామంలోని 22 కుటుంబాలు కొండపై తలదాచుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, ఇళ్ల నిర్మాణ విషయాల్లో సమస్యల కారణంగా ఈ గ్రామస్థులు పాత గ్రామంలోనే ఉండిపోయారు. ఫజుల్లాబాద్ నుంచి గోకవరం వెళ్లే ప్రధానరహదారిలో శనివారం వాగు పొంగింది. రోడ్డుమీదుగా ఉధృతంగా నీరు ప్రవహించింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రకాశం బ్యారేజీకి వరద

8 గేట్ల ద్వారా 5,816 క్యూసెక్కులు దిగువకు

విజయవాడ, జూలై 20(ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజీకి వరద నీరు పోటెత్తింది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎగువనున్న కీసర, వైరా, కట్టలేరు వాగులు ఉప్పొంగుతున్నాయి. దీంతో ప్రకాశం బ్యారేజీకి 7,125 క్యూసెక్కుల వరద ప్రవహిస్తోంది. అధికారులు 8 గేట్లను ఒక అడుగు మేర ఎత్తి 5,816 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు.



మేడేపల్లిలో బాధితులతో మాట్లాడుతున్న కొలుసు

వరద బాధితుల ఇంటి వద్దకే భోజనం

మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశాలు

వేలేరుపాడు, జూలై 20: వరద బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని మంత్రి కొలుసు పార్థసారథి హామీ ఇచ్చారు. ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలో పెద్దవాగు వరదల కారణంగా నష్టపోయిన మేడేపల్లి, అల్లూరినగర్‌లో శనివారం ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్‌కుమార్, జిల్లా అధికారులతో కలసి మంత్రి పర్యటించారు. బాధితులను పరామర్శించి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ రెండు గ్రామాల్లో దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. ఇళ్లు పూర్తిగా కోల్పోయిన వారికి ఇళ్లు నిర్మించి ఇవ్వడంతో పాటు పంటలు, పాడి పశువులను కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబాలు నిలువ నీడలేని పరిస్థితుల్లో ఉన్నందున మూడు పూటలా ఆహారాన్ని వారి ఇళ్ల వద్దకు వెళ్లి అందించాలని సూచించారు. చిన్నపిల్లలు ఉన్న ఇళ్లకు పాలు సరఫరా చేయాలని, తాగునీటి కొరత లేకుండా ప్రతీ ఇంటికి ఒక వాటర్ ప్యాకెట్ల బస్తాతో పాటు ట్యాంకర్ల ద్వారా మంచినీరు అందించాలని మంత్రి ఆదేశించారు.

పంట నష్టం అంచనా వేయండి: మంత్రి అచ్చెన్న



అమరావతి, జూలై 20(ఆంధ్రజ్యోతి): వాయుగుండం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న పంటల నష్టాన్ని అంచనా వేయాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. శనివారం వ్యవసాయశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రాజశేఖర్‌తో మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. వర్షపాతం, జలాశయాల్లో నీటి మట్టాలు, పంటల పరిస్థితిపై ఆరా తీశారు. రైతు సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబరు ఏర్పాటు చేయాలని సూచించారు.

ఏటిగట్ల పటిష్టతకు చర్యలు: మంత్రి నిమ్మల



అమరావతి, జూలై 20(ఆంధ్రజ్యోతి): లంక ప్రాంతాలు, నదీ పరీవాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజల్ని అప్రమత్తం చేయాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. ఏటిగట్ల పటిష్టానికి ఇసుక బస్తాలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ముంపు బాధితుల కోసం బియ్యం, నిత్యావసరాలు, వంటగ్యాస్ తదితరాలు సిద్ధంగా ఉంచాలని రెవెన్యూ శాఖను కోరారు. కాగా, వాయుగుండం నేపథ్యంలో విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు.

జగన్ పాలనలోని అవకతవకలు కేంద్రానికి తెలుసు

» మేం ఆ తప్పులు జరగనివ్వం: కేంద్ర మంత్రి రామ్మోహన్

అమరావతి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో జరిగిన విధ్వంసం, అవినీతి, నిధుల దారిమళ్లింపు విషయాలు కేంద్ర ప్రభుత్వం దృష్టికి వెళ్లాయని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారం సీఎం చంద్రబాబు నివాసం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. 'సీఎం చంద్రబాబు ఢిల్లీ వచ్చి కేంద్ర మంత్రులను కలుస్తున్నారు. పెండింగ్ పనులపై ప్రతి మంత్రికి ఒక జాబితా ఇచ్చారు. వాళ్లు ఆయన చేతికి మరో జాబితా ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వంలో కేంద్ర పథకాల కోసం ఇచ్చిన నిధులు ఎలా దారి మళ్లించారు.. ఇక్కడ ఏం అవకతవకలు జరిగాయో అందులో ఉంటున్నాయి. రాష్ట్రంలో గత ఐదేళ్లలో జరిగిన విధ్వంసం అక్కడి వాళ్లకూ తెలుసు. విశాఖ ఉక్కుకు కేంద్రం సహాయం కోరుతూనే మేం చేయాల్సినవి చేస్తున్నాం. ఆ ప్లాంటు కోసం విజయనగరం జిల్లాలో మాంగనీసు గనులు ఇస్తున్నాం. ఇతర గనులు కూడా ఇవ్వడానికి అవకాశాలు పరిశీలిస్తున్నాం. కేంద్రం ఇచ్చిన నిధులను గత ప్రభుత్వం దారి మళ్లించింది. మేం ఆ తప్పులు జరగనివ్వం. మ్యాచింగ్ గ్రాంటు రాష్ట్రం తరఫున ఇస్తాం' అని వివరించారు. కాగా, గత వైసీపీ ఎమ్మెల్యే వల్లే వినుకొండలో రషీద్ హత్య జరిగిందని టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడ శాంతిభద్రతల సమస్య తలెత్తినా సీఎం చంద్రబాబు చూస్తూ ఊరుకోరని, కఠినంగా వ్యవహరిస్తారని ఎంపీ కేశినేని శివనాథ్ చెప్పారు.

విషం చిమ్మడమే నైజం!

(మొదటి పేజీ తరువాయి)

మళ్లీ అదే విష వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. వినుకొండలో గ్యాంగ్ వార్ కారణంగా హత్య జరిగితే.. అది చంద్రబాబు ప్రభుత్వమే చేయించిందనే అర్థం వచ్చేలా 'నారా రూప రాక్షసుడు' అని తన రోతపత్రికలో విషం చిమ్మారు. వినుకొండలో హతుడూ, హంతకుడూ ఇద్దరూ ఒకప్పుడు వైసీపీ స్థానిక నేత గ్యాంగ్‌లోని సభ్యులే. శుక్రవారం బాధితుడి కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లిన జగన్ పక్కన ఆ గ్యాంగ్ లీడర్ కూడా ఉన్నాడు.

సర్వం విధ్వంసం.. నరమేధమే..

రాష్ట్రాన్ని ఐదేళ్లపాటు ధ్వంసం చేసి అప్పుల ఊబిలోకి నెట్టేసిన వైసీపీ అధ్యక్షుడు జగన్... ఇప్పుడు రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా కుట్ర చేస్తున్నారని టీడీపీ అనుమానిస్తోంది. అందుకే... చిన్నస్థాయి ఘటనలు, ఇతర కారణాలవల్ల జరిగిన హత్యలకు సైతం రాజకీయ రంగుపులిమి... రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవంటూ జాతీయ స్థాయిలో గగ్గోలు పెట్టేందుకు వ్యూహం రచించారని భావిస్తోంది. జగన్ ప్రభుత్వంలో ఇటు అనంతపురం నుంచి అటు శ్రీకాకుళం దాకా.. రక్తంతో తడవని రోజు, దౌర్జన్యం, కక్ష సాధింపులు జరగని సందర్భం ఒక్కటి కూడా లేదు. నంద్యాలలో అబ్దుల్ సలామ్ కుటుంబం వైసీపీ దాష్టీకానికి బలైపోయింది. కడప జిల్లా పొద్దుటూరులో చేనేత సుబ్బయ్య హత్య, చిత్తూరు జిల్లాలో పెద్దిరెడ్డి అరాచకాలు, నెల్లూరు కోర్టులో మాజీ మంత్రి కాకాణి కోసం దొంగతనం, అదే జిల్లాలో బీజేపీ మహిళపై కత్తులతో దాడి, ప్రకాశం జిల్లాలో మైనింగ్ దోపిడీ, బీసీ వర్గానికి చెందిన బాలుడు అమర్నాథ్ గౌడ్ హత్య పల్నాడులో జై జగన్ అనేందుకు నిరాకరించిన చంద్రయ్య హత్య. జగన్ అరాచక పాలనకు నిదర్శనంలా నిలిచాయి. అలాగే, గుంటూరులో రంగనాయకమ్మను సీఐడీ వేధించిన వైనం, రాజధాని మహిళా రైతులపై దాడులు, డీజీపీ ఆఫీసు పక్కనే టీడీపీ కార్యాలయం ధ్వంసం, ఎన్ఎస్‌జీ సెక్యూరిటీ ఉన్న చంద్రబాబు ఇంటిపై దాడి చేసిన జోగి రమేష్‌కు మంత్రి పదవి ఇవ్వడం, విజయవాడలో టీడీపీ కార్పొరేటర్ గాంధీ కన్ను పొడిచేయడం, పట్టాభి ఇంటిపై దాడులకు తెగబడటం, కృష్ణా జిల్లా గన్నవరంలో టీడీపీ కార్యాలయంపై దాడి, ఉభయ గోదావరి జిల్లాల్లో దళితుడికి పోలీసు స్టేషన్లో శిరోముండనం, వైసీపీ ఎమ్మెల్సీ డ్రైవర్‌ను చంపి శవాన్ని ఇంటికి పార్సిల్ చేయడం, కాకినాడలో అప్పటి వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి అరాచకాలు, దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకోని మాజీ సైనికుడిపై పోలీసులతో చేయించిన దాడి.. ఫ్యాక్షన్ పాలనను గుర్తుకు తెచ్చిన ఘటనలు. విశాఖపట్నంలో దళిత వైద్యుడు సుధాకర్‌ను నడిరోడ్డులో రెక్కలు విరిచి పోలీసులతో కొట్టించిన దుర్మార్గం, విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి సెటిల్మెంట్లు, వైసీపీ మూకల బెదిరింపులు, కబ్జాలు, హత్యలు.. విజయనగరంలో రాముడి విగ్రహ ధ్వంసం, పరిశీలించేందుకు వెళ్లిన చంద్రబాబు, టీడీపీ నేతలపై హత్యాయత్నం కేసులు పెట్టడం గురించి ఢిల్లీలో చెప్పాలంటూ బాధితులు, ప్రజా సంఘాల ప్రతినిధులు జగన్ రెడ్డికి గుర్తు చేస్తున్నారు.

ప్రతిపక్షాలపై అరాచకాలు..

ప్రశ్నించే వ్యక్తులపై అక్రమ కేసులు, బెదిరింపులు.. ప్రతిపక్షాలపై అణచివేతలు, దాడులు.. 2019 జూన్ నుంచి ఇటీవలి వరకూ రాష్ట్రంలో నిత్యకృత్యం. బీసీ నాయకుడు అచ్చెన్నాయుడు నుంచి అనంతపురంలో జేసీ ప్రభాకర్‌రెడ్డి వరకూ కేసు పెట్టించి జైలుకు పంపే దాకా జగన్ మనసు శాంతించలేదు. అసెంబ్లీలో అడిగి న ప్రతిసారీ తనకు మైకు ఇవ్వలేదన్న అక్కసుతో మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు కుటుంబాన్ని వేధించిన తీరుతో ఆయన ఏకంగా లోకాన్నే వదిలేశా రు. అశోక్ గజపతిరాజును సైతం తమ కుటుంబం నిర్మించిన ఆలయంలోకి రానీకుండా చేసి పైశాచిక ఆనందాన్ని పొందారు. పులివెందులలో దళిత మహిళ కు మద్దతుగా ఆందోళన చేసినందుకు వంగలపూడి అనిత(ఎస్సీ)పై అట్రాసిటీ కేసు పెట్టించారు. వీటన్నింటికీ పరాకాష్ఠగా చంద్రబాబుపై కేసులు సృష్టించి 50 రోజులకు పైగా జైల్లో పెట్టించారు. జైల్లో ఉన్న చంద్రబాబును పరామర్శించేందుకు హైదరాబాద్ నుంచి వస్తున్న జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌ను రాష్ట్ర సరిహద్దుల్లో పోలీసులతో అడ్డుకున్నారు.

ఏపీలో రాష్ట్రపతి పాలనకు పార్లమెంటులో నినదించాలి

» 24న ఢిల్లీలో ధర్నాకు అన్ని పార్టీలకూ ఆహ్వానం

» వైసీపీ ఎంపీలకు జగన్ ఆదేశం

అమరావతి, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఈ నెల 24న చేపట్టనున్న ధర్నాకు అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించి రాష్ట్రంలో ఏం జరుగుతోందో వారికి వివరిద్దామని వైసీపీ ఎంపీలకు ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ సూచించారు. శనివారం ఆయన అధ్యక్షతన తాడేపల్లి ప్యాలెస్‌లో వైసీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ ఏపీలో పరిస్థితులను అన్ని పార్టీలకు వివరించడంతో పాటు యావత్ దేశం దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. ఆయా ఘటనలపై ప్రజల్లో ఉన్న ఆగ్రహాన్ని దృష్టిలో పెట్టుకుని అసెంబ్లీ సమావేశాల్లో నిరసన వ్యక్తం చేస్తామని తెలిపారు. గవర్నర్ ప్రసంగంలోనూ ప్రభుత్వాన్ని నిలదీస్తామని, ఇదే సమయంలో ఏపీలో రాష్ట్రపతి పాలన విధించాలంటూ పార్లమెంటులో నినదించాలని దిశానిర్దేశం చేశారు. చంద్రబాబుకు గట్టి హెచ్చరికలు పంపకపోతే రాష్ట్రంలో దారుణాలకు అడ్డుకట్టపడదని అన్నారు. ఈ ఘటనలు కేవలం వైసీపీకి సంబంధించిన అంశం కాదని, ఇలాగే వదిలేస్తే ప్రజాస్వామ్య మనుగడకే పెద్ద దెబ్బ అని జగన్ వ్యాఖ్యానించారు.

రోడ్డుపైకొచ్చే హక్కు జగన్‌కు ఎక్కడుంది?: పెమ్మసాని

» హత్యల సంస్కృతి జగన్‌దే: మంత్రి అనగాని

గుంటూరు, అమరావతి(ఆంధ్రజ్యోతి)/ధర్మవరం, జూలై 20: 'జగన్ రోడ్డు మీద తిరిగిన ప్రతి నిమిషం ఈ రాష్ట్రానికి నష్టం జరుగుతుంది. ఆయన ఎన్ని రోజులు రోడ్ల మీదకు వస్తే ఈ రాష్ట్ర అభివృద్ధి అంత వెనక్కు వెళ్లిపోతుంది' అని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ విమర్శించారు. శనివారం ఆయన గుంటూరులో మీడియాతో మాట్లాడుతూ రోడ్డు మీదకు రావడానికి జగన్‌కు హక్కు ఎక్కడుంది అని ప్రశ్నించారు. 'వినుకొండలో ఇద్దరు స్నేహితుల మధ్య జరిగిన గొడవను రాజకీయం చేయాలని చూస్తున్నారు. ఇది రాజకీయ హత్య ఎలా అవుతుంది. చంద్రయ్యది రాజకీయ హత్య. ఆ రోజు బయటకు వచ్చావా... వెళ్లావా మాచర్ల' అని జగన్‌ను సూటిగా ప్రశ్నించారు. కాగా, హత్యలు చేసే సంస్కృతి జగన్, వైసీపీదేనని మంత్రి అనగాని సత్యప్రసాద్ ధ్వజమెత్తారు. ఎంతోమంది టీడీపీ నేతలను హత్య చేయించిన జగన్ ఏ మొహం పెట్టుకుని ఢిల్లీ వెళ్లి ధర్నా చేస్తారని నిలదీశారు. ఇప్పటికైనా జగన్ శవ రాజకీయాలు మానేసి అసెంబ్లీకి వచ్చి ప్రజలకు ఉపయోగపడేలా చర్చల్లో పాల్గొనాలని హితవు పలికారు. కాగా, సుద్దపూసలా మాట్లాడటం మానేసి, వికసిత ఏపీ కోసం తమతో కలిసిరావాలని జగన్‌కు మంత్రి సత్యకుమార్ యాదవ్ హితవు పలికారు. 'మీ ఎమ్మెల్సీ ఓ దళితుణ్ని హత్య చేసి డోర్‌డెలివరీ చేస్తే ఢిల్లీలో ఎందుకు ధర్నా చేయలేదు? తాడేపల్లి ప్యాలెస్‌కు కూతవేటు దూరంలో అమాయకురాలిపై అత్యాచారం జరిగితే ఎందుకు స్పందించలేదు..?' అని శనివారం 'ఎక్స్' వేదికగా నిలదీశారు. 'వినుకొండ హత్య ఘటనను అడ్డుపెట్టుకుని శవ రాజకీయాలకు తెరలేపడం, మీ అధికార దాహాన్ని బట్టబయలు చేస్తున్నదని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య జగన్‌కు రాసిన బహిరంగ లేఖలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం పట్ల జగన్‌కు గౌరవం లేదని, అందుకే శాసనసభ సమావేశాలు జరిగే సమయంలో ఢిల్లీలో ధర్నాకు దిగుతున్నారని టీడీపీ ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ధ్వజమెత్తారు.

చనిపోయానని చెప్పి నా స్థలాన్ని ఆక్రమించారు

» తప్పుడు పత్రాలు సృష్టించి స్వాహా.. వైసీపీలోని నా వాళ్లే మోసం

» చంద్రబాబుకు ఆచంట మహిళ మొర




చంద్రబాబు వద్ద రోదిస్తున్న పార్వతి

అమరావతి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు తమ సమస్యలు చెప్పుకొనేందుకు ప్రజలు తరలివచ్చారు. ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించడానికి ప్రతి శనివారం పార్టీ కార్యాలయానికి వస్తున్న చంద్రబాబు ఈ వారం కూడా వచ్చారు. అర్జీదారులు చెప్పినవి సావధానంగా విని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆచంట నియోజకవర్గం వెంకటాల చెరువుకు చెందిన పిల్లి పార్వతి.. తన భూమిని వైసీపీలోని తమ బంధువులు ఆక్రమించారని, తనకు తిరిగి ఇప్పించాలని కోరారు. 15 ఏళ్ల కిందట వెంకటాల చెరువులో రూ.23 లక్షలతో 15 సెంట్ల స్థలం కొన్నానని, ఉపాధి నిమిత్తం కువైట్ వెళ్లానని తెలిపారు. 2021లో కువైట్ నుంచి వచ్చేసరికి ఫెన్సింగ్ తొలగించారని, సెంటు పట్టా స్థలాల దారి కోసం తన భూమిని లాగేసుకున్నారని తెలిపారు. తాను చనిపోయినట్లు చెప్పి తన సోదరి కుమారుడు గుబ్బ శ్రీనివాస్ పేరుపై తప్పుడు పత్రాలు సృష్టించారని చెప్పారు. తాను ప్రశ్నిస్తే శ్రీనివాస్, సతీష్, నాగేశ్వరరావు, వరలక్ష్మితో పాటు మరికొంత మంది దాడి చేసి గాయపరిచారన్నారు. పోలీసులకు చెప్పినా పట్టించుకోలేదని, తనపైనే కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని చంద్రబాబుకు తెలిపారు. తన స్థలాన్ని తనకు తిరిగి ఇప్పించాలని విలపించారు. చిలకలూరిపేట నియోజకవర్గం తిమ్మాపురానికి చెందిన అనీలా డ్వాక్రా సంఘ సభ్యులు సీఎంను కలిశారు. గ్రూపు సభ్యుల అనుమతి లేకుండా యానిమేటర్లు తమ సంతకాలు ఫోర్జరీ చేసి బ్యాంకుల్లో రూ.30 లక్షల రుణాలు తీసుకున్నారని సీఎం దృష్టికి తీసుకొచ్చారు. పైగా పోలీసులతో కుమ్మక్కై బెదిరిస్తున్నారని, రుణం సొమ్ము చెల్లించాలని బ్యాంకు అధికారులు ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విచారణ చేయించి నిందితులపై చర్యలు తీసుకుని సొమ్మును రికవరీ చేయిస్తామని సీఎం హామీ ఇచ్చారు.

ఢిల్లీలో తెలుగు వెలగాలి!

» కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ సదస్సులో టీ-సీఎం రేవంత్



హైదరాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో తెలుగు వారి కోసం పని చేసే బలమైన నాయకత్వం తిరిగి రావాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ప్రస్తుతం ఢిల్లీలో తెలుగు వారి నాయకత్వ లోపం కనిపిస్తోందన్నారు. శనివారం హైదరాబాద్ హెచ్ఐసీసీలో రెండు రోజుల కమ్మ గ్లోబల్ ఫెడరేషన్(కేజీఎఫ్) సమావేశాన్ని రేవంత్ రెడ్డి ప్రారంభించారు. "వెంకయ్య, జైపాల్‌రెడ్డి, పీవీ నర్సింహారావు, ఎన్టీఆర్ గతంలో ఢిల్లీలో కీలకపాత్ర పోషించారు. ప్రస్తుతం ఢిల్లీలో తెలుగువారి నాయకత్వ లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. కులానికి, ప్రాంతానికి అతీతంగా తెలుగువారి అభివృద్ధి కోసం పనిచేసే బలమైన నాయకత్వాన్ని మళ్లీ ఢిల్లీలో తీసుకురావాల్సిన సందర్భం వచ్చింది" అని రేవంత్ పేర్కొన్నారు. కమ్మవారంటే అమ్మ లాంటి వారని, వ్యవసాయం చేసి, మట్టి నుంచి బంగారం పండించి, పది మందికి సాయం చేసే గుణం ఉన్నవారని ప్రశంసించారు. రాజకీయాల్లో ఎన్టీఆర్ ఒక బ్రాండ్‌ను క్రియేట్ చేశారన్నారు.

విజయసాయిపై అనర్హత వేటు వేయండి: బుద్దా

విజయవాడ(వన్‌టౌన్), జూలై 20: రాజ్యసభ ప్రతిష్ఠను దిగజార్చే విధంగా వ్యవహరించిన వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిపై అనర్హత వేటు వేయాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న శనివారం రాజ్యసభ ఛైర్మన్‌కు లేఖ రాశారు. విజయసాయిపై ఇప్పటికే 8 ఈడీ కేసులు, సీబీఐ 11 కేసులు ఉన్నాయని తెలిపారు.

గనుల్లో పాత టెండర్లు రద్దు!

» బ్రహ్మదీయ కోల్‌మైన్, బెరైటీస్ టెండర్లు కూడా..

» గనులశాఖ, ఏపీఎండీసీపై ప్రభుత్వం సమీక్ష

» ప్రైవేటుకు మేలుచేసేలా టెండరు ప్రక్రియ

» పెద్దిరెడ్డి,వెంకటరెడ్డిపై సిద్ధమవుతున్న నివేదికలు

» వచ్చే రెండువారాల్లో కొలిక్కిరానున్న ప్రక్రియ

అమరావతి, జూలై 20(ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో గనులశాఖలో జరిగిన గోల్‌మాల్‌ను పక్కా ఆధారాలతో బయటకు తీయాలని సర్కారు చర్యలు ప్రారంభించింది. నాటి గనులమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, డైరెక్టర్ వెంకటరెడ్డి, ఇతర అధికారులపై వచ్చిన ఆరోపణలు, ఫిర్యాదులపై పక్కా ఆధారాలు సేకరించే పనిలో పడింది. ఇసుక, బొగ్గు, బీచ్‌శాండ్, బెరైటీస్, ఇతర గనుల వేలం, సీనరేజీ కాంట్రాక్టు, అడ్డగోలుగా నిబంధనలు మార్చడంపై స్పెషల్ సీఎస్ కేడర్‌లో ఉన్న సీనియర్ ఐఏఎస్‌లు అధ్యయనం చేస్తున్నట్లు తెలిసింది. అక్రమాల్లో ఎవరి పాత్ర ఏమిటి? ఎవరి కేంద్రంగా ఎక్కువగా ఘోరాలు జరిగాయి? వ్యవస్థలను ఎలా దెబ్బతీశారు? నోట్‌ఫైల్స్, ఇతర డాక్యుమెంట్లను ఎలా డ్యామేజ్ చేశారు అన్న అంశాలపై ఆ అధికారులు నిశిత పరిశీలన చేస్తున్నట్లు తెలిసింది. పక్కా డేటా సేకరించిన తర్వాత నివేదికను సిద్ధంచేసి సీఎం చంద్రబాబుకు అందజేయనున్నారని విశ్వసనీయ సమాచారం. ప్రధానంగా ఇసుక పాలసీని 2019లో మార్చిన తర్వాత ఏం జరిగింది? సీఎంవో నుంచి ఎలాంటి ఆదేశాలు వచ్చాయి? ఇసుకను ప్రైవేటుకు ఇవ్వాలని నిర్ణయించిందెవరు? ప్రైవేటుకు కాంట్రాక్టు ఇవ్వడానికి విధివిధానాలు, టెండర్ డాక్యుమెంట్, నిబంధనలను ఎవరు ఖరారు చేశారు? టెండర్లను బెంగాల్‌లో ఖరారు చేయడంతో మతలబు ఏమిటి? బొగ్గు టెండర్లలో ఏం జరిగింది? 250 కోట్ల పెర్ఫార్మెన్స్ సెక్యూరిటీ డిపాజిట్ కింద కాంట్రాక్టర్‌కు వడ్డీతో సహా చెల్లింపులు, బీచ్‌శాండ్ , బెరైటీస్ సేల్ టెండర్లలో ఏం జరిగిందన్న దానిపై అధికారులు పలు డాక్యుమెంట్లను నిపుణులతో కూడిన టీమ్ సమక్షంలో అధ్యయనం చేస్తున్నట్లు తెలిసింది. ఇది మరోపక్షం రోజుల్లో కొలిక్కి రావచ్చని సమాచారం.

రద్దుకు రంగం సిద్ధం....

జగన్ పాలనలో బొగ్గు, బెరైటీస్, బీచ్‌శాండ్, ఐరన్ ఓర్ తదితర ఖనిజాల కోసం పిలిచిన టెండర్లను రద్దు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. వీటికి సంబంధించిన ఫైళ్ల పరిశీలన పూర్తయిన తర్వాత అధికారిక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఏపీఎండీసీకి జార్ఖండ్‌లో బ్రహ్మదీయ కోల్‌మైన్ ఉంది. దీన్ని ఓ ప్రైవేటు కంపెనీకి కట్టబెట్టారు. ఈ టెండర్‌లో అక్రమాలను గుర్తించి, దానిని రద్దుచేయాలని భావిస్తున్నట్లు తెలిసింది. అలాగే, మంగంపేట బెరైటీస్‌లో ఎ,బి, సి,డి గ్రేడ్‌ల అమ్మకం టెండర్లు పిలిచారు. ఇందులోనూ అనేక ఉల్లంఘనలు ఉన్నాయని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఆ టెండర్లను కూడా రద్దుచేయాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. శ్రీకాకుళం, విశాఖలో బీచ్‌శాండ్‌కు గత ప్రభుత్వం టెండర్లు పిలిచింది. వాటిలో ప్రైవేటుకు మేలు చేసేలా నిబంధనలున్నాయి. ఆ టెండర్‌ను హైకోర్టు నిలుపుదల చేసింది. గనుల శాఖ స్థాయిలో టెండర్‌ను రద్దుచేయాలని నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ప్రకాశం జిల్లాలో ఐరన్ ఓర్‌కు పిలిచిన టెండర్‌ను కూడా రద్దు చేసే అవకాశం ఉంది. టెండర్లపై న్యాయశాఖ అభిప్రాయం తీసుకున్నాక రద్దు నిర్ణయం ప్రకటించే అవకాశం ఉంది.

అన్నీ తవ్వితీస్తాం.. రెడీగా ఉండండి: గనుల శాఖ ముఖ్యకార్యదర్శి

శనివారం ఏపీఎండీసీలో గనులశాఖపై కీలక సమీక్ష జరిగింది. ఆ శాఖ ముఖ్యకార్యదర్శి మీనా ఆయా విభాగాల ఉన్నతాధికారులతో సుదీర్ఘంగా సమీక్ష చేశారు. గనులశాఖలో గత ఐదేళ్లలో జరిగిన టెండర్లు, వచ్చిన ఆదాయంపై ఆరా తీసినట్లు తెలిసింది. బ్రహ్మదీయ కోల్ కాంట్రాక్టులో ఏం జరిగిందని ఆరా తీశారు. ఆర్థిక విభాగం అధికారి సరదాగా లెక్కలు చెప్పే ప్రయత్నం చేయగా, మీనా ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. 'జోవియల్‌గా మాట్లాడుతున్నానని అనుకుంటున్నావా? సరిగ్గా సమాధానం చెప్పలేవా? సీరియస్‌నెస్ లేదా?" అని మందలించినట్లు తెలిసింది. గత డైరెక్టర్ వెంకటరెడ్డి ఏది చెబితే తాము అదే చేశామని ఆ అధికారి నివేదించినట్లు సమాచారం. త్వరలో సమగ్ర సమీక్ష చేస్తానని, అన్నీ బయటకు తవ్వితీస్తామని మీనా హెచ్చరించినట్లు తెలిసింది అందరూ ఇదే లక్ష్యంతో రెడీగా ఉండాలని ఆయన ఆదేశించినట్లు తెలిసింది.

కూటమి ఎంపీలకు ప్రత్యేక బాధ్యతలు

అమరావతి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే కూటమి తరఫున రాష్ట్రంలో గెలిచిన లోక్‌సభ సభ్యులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పని విభజన చేశారు. ప్రతి ఎంపీకి కేంద్రంలో కొన్ని శాఖలు కేటాయించారు. ఆ శాఖల మంత్రులతో ఎంపీలు నిత్య సంబంధాలు ఏర్పాటు చేసుకొని ఆయా శాఖల నుంచి నిధులు రాబట్టడం, పెండింగ్ పనులు పరిష్కరించడం వంటివి చేయాల్సి ఉంటుంది.

ఎంపీ పేరు	కేటాయించిన శాఖలు
కింజరాపు రామ్మోహన్ నాయుడు	పౌర విమానయానం
పెమ్మసాని చంద్రశేఖర్	గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్
తంగెళ్ల ఉదయ శ్రీనివాస్	సైన్స్ అండ్ టెక్నాలజీ, భూ విజ్ఞాన శాస్త్రం, ఆహారం, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు
గంటి హరీష్ మాధుర్	విదేశీ వ్యవహారాలు, క్రీడలు, యువజన వ్యవహారాలు
లావు శ్రీకృష్ణదేవరాయలు	ప్లానింగ్, కార్పొరేట్ వ్యవహారాలు, మైనారిటీ సంక్షేమం, కార్యక్రమాల అమలు
వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి	పోర్టులు, నౌకాయానం, జల రవాణా, చిన్న మధ్య తరహా పరిశ్రమలు
మెతుకుమల్లి భరత్	ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, వాణిజ్యం, పరిశ్రమలు
సీఎం రమేశ్	ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, ఆయుష్
వల్లభనేని బాలశౌరి	పంచాయితీరాజ్, పర్యావరణం, అడవులు, వాతావరణ మార్పులు, పర్యాటకం, సాంస్కృతిక వ్యవహారాలు
కేశినేని శివనాథ్	రక్షణ వ్యవహారాలు, సహకారం
మాగుంట శ్రీనివాసుల రెడ్డి	రైల్వేలు
తెన్నేటి కృష్ణప్రసాద్	సామాజిక న్యాయం, సాధికారత, న్యాయ శాఖ, గిరిజన సంక్షేమం
బైరెడ్డి శబరి	విద్య, మహిళా శిశు సంక్షేమాభివృద్ధి, నైపుణ్య శిక్షణ, స్వయం ఉపాధి కల్పన
దగ్గుమళ్ల ప్రసాదరావు	కెమికల్స్, ఫర్టిలైజర్స్, విద్యుత్, పునరుత్పాదక విద్యుత్
కలిశెట్టి అప్పలనాయుడు	రోడ్డు రవాణా, జాతీయ రహదారులు, పశుగణాభివృద్ధి, డెయిరీ, మత్స్య పరిశ్రమ
పంచలింగాల నాగరాజు	కార్మిక సంక్షేమం, ఉపాధి కల్పన, ఇరిగేషన్
బీకే పార్థసారథి	భారీ పరిశ్రమలు, బొగ్గు, వ్యవసాయం, రైతు సంక్షేమం
అంబికా లక్ష్మీనారాయణ	గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాలు, టెక్స్‌టైల్స్
పుట్టా మహేశ్ యాదవ్	ఆహార శుద్ధి పరిశ్రమలు, పెట్రోలియం, సహజవాయువు

ప్రతి రూపాయీ రాబట్టండి

(మొదటి పేజీ తరువాయి)



టీడీపీ ఎంపీలు, మంత్రులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, హాజరైన నేతలు

శనివారం తన నివాసంలో ఎంపీలు, మంత్రులతో ఒక సంయుక్త సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి ఎంపీ రాష్ట్రంలోని మంత్రులతో కూడా సమన్వయం చేసుకొని కేంద్ర పథకాల్లో దేనిని ఏ మేరకు వినియోగించుకోవాలో ఒక ప్రణాళిక ప్రకారం పనిచేయాలని ఆదేశించారు. ఏదైనా పథకం కింద రూ.వంద కోట్లు వచ్చేలా ఉన్నా వదిలిపెట్టవద్దని, అవసరమైతే ఢిల్లీ వెళ్లి కూర్చుని తెచ్చుకోవాలని మంత్రులకు సూచించారు. ప్రతి పదిహేను రోజులకు ఒకసారి తాను ఎంపీలు, మంత్రులకు అప్పగించిన పనిని సమీక్షిస్తానని, రాష్ట్రం పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ఒక్క నిమిషం కూడా వృధా చేయకుండా పనిచేయాలన్నారు. 'గతంలో మనం అధికారంలో ఉన్నప్పుడు ఉపాధి హామీ పథకం కింద కేంద్రం నుంచి ఎంత వీలైతే అన్ని నిధులు తెచ్చి గ్రామాల్లో సిమెంటు రోడ్లు, నీటి కుంటలు, పశువుల శాలలు వంటివి భారీ సంఖ్యలో నిర్మించాం. అవన్నీ ఇప్పటికీ ప్రతి గ్రామంలో కనిపిస్తున్నాయి. ఈసారి కూడా ఆ పథకం కింద ఎంత వీలైతే అన్ని నిధులు తెచ్చుకొందాం. అలాగే విభజన చట్టం కింద వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి రాయితీ నిధులు ఇవ్వాలని కేంద్రాన్ని అడుగుతున్నాం. రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ప్రకాశం జిల్లాకు కూడా మైక్రో ఇరిగేషన్ కింద తొంభై శాతం సబ్సిడీ పథకం అమలు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశాం. ఇది వస్తే రైతాంగానికి చాలా ఊరటగా ఉంటుంది. తీవ్రమైన ఆర్థిక సమస్యలు ఉన్నా ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని చంద్రబాబు వివరించారు.

చేయాల్సిన పనులు ఇవీ

'అమరావతి, పోలవరం, జల్ జీవన్ మిషన్ ప్రాజెక్టుల కోసం కేంద్రం నుంచి నిధులు రాబట్టాలి. విభజన చట్టంలో ఉన్న హామీలను అమలు జరిగేలా చూడాలి. షెడ్యూల్ 9, 10లో ఉన్న ఆస్తులు రెండు తెలుగు రాష్ట్రాల మధ్య పంపకం జరిగేలా చూడాలి. దీనిపై తెలంగాణ ప్రభుత్వంతో చర్చలు మొదలు పెట్టాం. గతంలో మంజూరైన పెట్రోలియం యూనివర్సిటీని విశాఖలోనే ఏర్పాటు చేయాలి. అవసరమైన నిధులు కేంద్రం నుంచి మంజూరు చేయించుకోవాలి. కార్యకలాపాలు వీలైనంత త్వరగా ప్రారంభమయ్యేలా చూడాలి. కడప ఉక్కుపైనా కేంద్రంతో చర్చలు జరపాలి. విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో తప్పుడు ప్రచారాలకు తెరదించాలి' అని చంద్రబాబు సూచించారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు కేంద్ర బడ్జెట్‌లో నిధుల ప్రస్తావన లేకపోతే తర్వాత అయినా తెచ్చుకోగలుగుతామని, దానిపై ఆందోళన చెందవద్దని ఒక ఎంపీ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

జగన్ కుట్రలు సాగవు

▸▸ వినుకొండ హత్య నిందితులను వదలం : బాబు

ఉనికి కోసమే జగన్ ఫేక్ రాజకీయాన్ని నమ్ముకున్నారని సీఎం చంద్రబాబు నాయుడు విమర్శించారు. ఎన్నికల్లో ప్రజలు పూర్తిగా తిరస్కరించిన తర్వాత కూడా జగన్ ప్రవర్తనలో మార్పు రాలేదని, తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని టీడీపీ ఎంపీల సమావేశంలో అన్నారు. జగన్ బెదిరింపులకు భయపడేది లేదని, కుట్రలను సాగనిచ్చేది లేదన్నారు. శాంతి భద్రతల విషయంలో రాజీపడేది లేదని, పోలీసులు కూడా కఠినంగా ఉండాలన్నారు. వినుకొండ హత్య అత్యంత కిరాతకమని, నిందితులను వదిలేదిలేదన్నారు. వ్యక్తిగత కారణాలతో జరిగిన హత్యకు జగన్ రాజకీయ రంగు పులుముతున్నారని ఆరోపించారు.

జగన్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

శాంతిభద్రతలపై జగన్ చేస్తున్న దుష్ప్రచారాన్ని బలంగా తిప్పికొట్టాలని చంద్రబాబు పార్టీ ఎంపీలకు సూచించారు. 'ఆయనను పట్టించుకోనక్కరలేదు. కాని అబద్ధాలు చెబితే వదిలిపెట్టవద్దు. కూటమి ప్రభుత్వం వచ్చిన 35 రోజుల్లో 36 మంది రాజకీయ హత్యలకు గురయ్యారని జగన్ ప్రచారం మొదలు పెట్టారు. దమ్ముంటే ఆ జాబితాను బయటకు ఇవ్వమనండి. నిజమో కాదో తేలిపోతుంది. ఈ నెల రోజుల్లో రాష్ట్రంలో నలుగురు రాజకీయ హత్యలకు గురైతే అందులో ముగ్గురు టీడీపీకి, ఒకరు వైసీపీకి చెందినవారు. ఢిల్లీలో జగన్ మాట్లాడితే మీరు కూడా వెంటనే మాట్లాడండి అని చంద్రబాబు అన్నారు.

శవ రాజకీయాల్లో ఆరితేరిన జగన్

▸▸ జనసేన ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు ధ్వజం

అమరావతి, జూలై 20(ఆంధ్రజ్యోతి): శవ రాజకీయాల్లో ఆరితేరిన వైసీపీ నాయకుడ్ని ప్రజలు ఎప్పుడో నమ్మడం మానేశారని జనసేన ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు అన్నారు. వినుకొండ హత్య ఘటనపై మాజీ సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. వినుకొండ హత్య పూర్తిగా వ్యక్తిగత కక్షల కారణంగా జరిగిందని, దానికి రాజకీయ రంగు పులిమి లబ్ధి కోసం వైసీపీ నాయకుడు ప్రయత్నిస్తున్నారని నాగబాబు ఆరోపించారు. ఓ నిర్మాణాత్మక పార్టీగా బాధ్యతగా వ్యవహరించాల్సిన వైసీపీ ఇప్పుడు అర్జెంటుగా ఢిల్లీ వెళ్లి రాష్ట్రపతి పాలన విధించాలని కోరతామని, ధర్నా చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. అధికారం ఉన్నప్పుడు, పోయినప్పుడు కూడా నటించడమే జగన్ అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు.

నటి శ్రీరెడ్డిపై కేసు నమోదు

కర్నూలు, జూలై 20: వివాదాస్పద నటి శ్రీరెడ్డిపై కర్నూలు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. టీడీపీ బీసీ సెల్ నాయకుడు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. శ్రీరెడ్డి ఇటీవల సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, హోంమంత్రి అనితలపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు, తర్వాత ఆమె సోషల్ మీడియా వేదికగా పలు సందర్భాల్లో వ్యక్తిగత దూషణలకు పాల్పడ్డారని వివరించారు. ఆయా అంశాలకు సంబంధించిన వీడియోలతో పాటు పలు ఆధారాలను పోలీసులకు సమర్పించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.


51వ డివిజన్‌లో కూలినగోడను పరిశీలిస్తున్న సీపీఎం రాష్ట్ర నేత సిహెచ్ బాబూరావు, పార్టీ నేతలు




కొండ చరియలు పడుతున్న ప్రాంతం, కొత్తపేట రాజగిరివారివీధిలో కూలిన ఇంటి రిటైనింగ్ వాల్, మల్లిఖార్జునపేట కొండ ప్రాంతంలో కూలిన ఇల్లు


ఉప్పరవాగు ఊటబావి ప్రాంతంలో కూలిన ఇంటిగోడ

కొండంత భయం

కొండప్రాంతాల్లో కూలుతున్న ఇళ్లు, గోడలు, రిటైనింగ్ వాల్స్

● నిరాశ్రయులవుతున్న ప్రజలు ● పట్టించుకోని అధికారులు

చిట్టినగర్/వన్‌టౌన్, జూలై 20: పాతబస్తీలోని కొండ ప్రాంత వాసులు భయం గుప్పెట్లో జీవనం సాగిస్తున్నారు. చినుకుపడితే వీరి కంటిపై కునుకుండదు. ఏ రాయి దొర్లి ఇంటిపై పడుతుందో.. ఏ రిటైనింగ్ వాల్ కూలి నిరాశ్రయులమౌతామోనని నిత్యం భయంతో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని కాలాన్ని వెళ్లబుచ్చుతున్నారు. చిట్టినగర్, కొత్తపేట పోతిన ఆదియ్యవీధి, రాజగిరివారివీధి, గొల్లపాలెంగట్టు, సొరంగం, ట్రైనర్‌పేట, లంబాడిపేట, రామరాజ్యనగర్, మల్లిఖార్జునపేట ఉప్పరవాగు ఉటబావి, కబేళా కొండ ప్రాంతం వంటి చోట్ల సుమారు 25వేల కుటుంబాలు నివాసాలుంటున్నాయి. వీరంతా కూలీ, నాలీ చేసుకునే జీవనం సాగించే పేద, మధ్యతరగతికి చెందినవారు. కొత్తపేట రాజగిరివారివీధి, కబేళా కొండ ప్రాంతం, పోతిన ఆదియ్యవీధిలో జారిపడిన కొండచరియలు, గొల్లపాలెంగట్టు, సొరంగం, భీమన్నవారిపేట ప్రాంతంలో పలుమార్లు జారిపడిన కొండరాళ్లు, గతంలో సంభవించిన సంఘటనలు వీరిని మరింత భయాందోళనకు గురిచేస్తున్నాయి. వర్షం పడినప్పుడు ఒక బాధ అయితే, వర్షంతో పనిలేకుండా ఎప్పుడుపడితే అప్పుడు జారిపడే రిటైనింగ్ వాల్‌తో నిరంతరం ఆందోళనల మధ్య జీవివనం సాగిస్తున్నారు. గతంలో లంబాడీపేటలో గోడకూలి నలుగురు మృతి చెందారు. అప్పటి నుంచి కొండప్రాంత నివాసితులు వర్షాకాలం వచ్చిందంటే గుండె గుభేల్ అన్నట్టే. ఎప్పుడేం ప్రమాదం ముంచుకొస్తుందోనన్న భయంతో బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. ఇలా ప్రమాదస్థాయిలో ఉన్న ఇళ్లను గుర్తించి చర్యలు చేపట్టేందుకు గాను వీఎంసీ, రెవెన్యూ శాఖ జాయింట్ సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో సుమారు 900 ఇళ్లు ప్రమాదపుటంచున ఉన్నట్టు గుర్తించారు. ఈ సర్వే నిర్వహించి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, నేతలు ఎన్నికలప్పుడు ఇష్టమొచ్చినట్టు హామీలిచ్చి ఓట్లు వేయించుకుంటున్నారే గానీ వారి ప్రాణాలకు రక్షణ మాత్రం కల్పించడంలేదు. రాళ్లుపడి ఎవరైనా మరణిస్తే వారిని పరామర్శించి ఆర్థిక సహాయం చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప కొండ దిగువున రిటైనింగ్ వాల్ నిర్మించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొండ ప్రాంతాల్లో ప్రమాదకరంగా ఉన్న చోట యుద్ధపాతిదికన రిటైనింగ్ వాల్ నిర్మించి ప్రమాదాలు బారిన పడకుండా తమను కాపాడాలని కోరుతున్నారు.

కూలిన ఇంటిగోడ, రిటైనింగ్ వాల్

4 రోజులుగా కురుస్తున్న వర్షానికి శుక్రవారం తెల్లవారుజామున 51వ డివిజన్‌లో కొత్తపేట రాజగిరివారివీధి అప్పారావు ఇంటి గోడ, రిటైనింగ్ వాల్ కూలింది. దీంతో ఆ ఇంట్లో నివాసముండే వారంతా బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. కబేళా కొండప్రాంతం, మల్లికార్జునపేట ఉప్పరవాగు ఉటబావి ప్రాంతాల్లో ఇంటి గోడలు కూలిపోయాయి. ఉప్పరబావి ప్రాంతంలో కూలిగోడ రేకుల షెడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో అక్కడి నివాసితులు నిరాశ్రయులయ్యారు. స్థానిక కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి), అధికారులు కూలిన ఇంటి వద్దకు వెళ్లి బాధితులను పరామర్శించారు. కాశేశ్వరరావు మార్కెట్‌లో కూరగాయలు విక్రయించి జీవనం చేస్తున్న షేక్ బాజీ, భార్య, ఐదుగురు సంతానంతో కొండపైన రేకుల షెడ్డులో నివాసం ఉంటున్నాడు. ఈ రేకుల షెడ్ కూలిపోవడంతో వారు నిరాశ్రయులయ్యారు. మరోవైపు సమీపంలో నివాసం ఉంటున్న షేక్ రసూల్ నివాసం ఉంటున్న గోడ కూలింది. దీంతో ఆ నివాసం పాక్షికంగా దెబ్బతింది. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా తమను తక్షణం తమను ఆదుకుని, రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

విరిగిపడుతున్న కొండచరియలు

ఎడతెరిపిలేని వర్షాల కారణంగా ఇంద్రకీలాద్రి దిగువున కొండచరియలు విరిగిపడుతున్నాయని, దుర్గగుడి ఈవో, అధికారులు తక్షణ చర్యలు తీసుకుని భక్తులకు ఇబ్బందిలేకుండా చూడాలని రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. కృష్ణానది ఘాట్లలో భక్తులు స్నానాలు చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని, మరుగుదొడ్లు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

సితార, కబేళా ప్రాంతాల్లో

భవానీపురం: 45వ డివిజన్ సితార, కబేళా ప్రాంతాల్లో శనివారం కొండ చరియలు విరిగిపడి రెండిళ్లు ధ్వంసమయ్యాయి. కాకపోతే ప్రాణనష్టం జరగలేదు. తెల్లవారుజామున సితార సమీపంలోని పిండిమర సెంటర్‌లోని గెదేల రాజు ఇంటి వద్ద గురజాపు సూరమ్మ ఇంటిపై కొండచరియలు జారిపడటంతో పైకప్పు పాక్షికంగా దెబ్బతినగా, గోడలు కూలాయి. ఇందులో ఈమెతో పాటు కొడుకు, కోడలు గురజాపు లక్ష్మణరావు, లక్ష్మి దంపతులు నివాసముంటున్నారు. విషయం తెలుసుకున్న మైలవరపు కృష్ణ తాత్కాలిక సాయంగా రూ.5వేలను అందజేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే సుజనా చౌదరికి సమస్యలను వివరిస్తానని హామీ ఇచ్చారు. అలాగే కబేళా ప్రాంతం పెట్రోలు బంకు ఎదురుగా తిరుపతమ్మ గుడి వద్ద వల్లభాపుల కోటేశ్వరరావు ఇల్లు పూర్తిగా దెబ్బతింది. కొండచరియలు పడటంతో గోడలు పాక్షికంగా కూలిపోయాయి. సీపీఐ నగర కార్యదర్శిజి. కోటేశ్వరరావు సందర్శించి బాధితులను పరామర్శించారు. వారికి న్యాయం చేయాలని అధికారులను కోరారు.

మొగల్రాజపురంలో

మొగల్రాజపురం: కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు స్థానిక రావిచెట్టు సెంటర్ చలసానివారి వీధిలో ఒక ఇంటికి సపోర్టుగా ఉన్న గోడ పాక్షికంగా కూలింది. గోడ మొత్తం కూలితే ఇల్లు కూడా పడిపోయే ప్రమాదం ఉంది. ఇదే కనుక జరిగితే కిందభాగంలో ఉన్న మరికొన్ని ఇళ్లు ప్రమాదానికి గురై ఉండేది. ఇప్పటికీ ప్రమాదం పొంచి ఉంది. సీపీఎం నేతలు క్రాంతి కుమార్, కృష్ణ, మురహరి, స్టాలిన్ ఘటనా స్థలానికి వెళ్లారు. ఆ ప్రాంతాన్ని పరిశీలించి తూర్పు నగర తహసీల్దార్, సర్కిల్-3 ఈఈ సామ్రాజ్యానికి, వీఆర్‌వోకు తెలపగా పలువురు అధికారులు వచ్చి పరిశీలించి వెళ్లారు.


మొగల్రాజపురంలో..

రూ.100 కోట్ల ప్యాకేజీ ప్రకటించాలి: సీపీఎం

కొండప్రాంతవాసుల రక్షణ, అభివృద్ధికి రూ.100కోట్ల ప్యాకేజీ ప్రకటించాలని సీపీఎం రాష్ట్ర నేత సి.హెచ్ బాబూరావు అన్నారు. రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలు కాదని, వర్ష బాధితులను ఆదుకోవాలని అసెంబ్లీలో చర్చించాలన్నారు. శనివారం 50, 51వ డివిజన్ గొల్లపాలెంగట్టు, కొత్తపేట ప్రాంతాలలో కూలిన రిటైనింగ్ వాల్స్, గోడలను ఆయన సీపీఎం నేతలతో కలిసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ నగరంలో కొండచరియలు, రిటైనింగ్ వాల్స్ కూలిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, రక్షణ చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రజలు తమ ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని బిక్కుబిక్కు మంటూ జీవనం గడుపుతున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం, వీఎంసీ పాలకపక్షం కొండ ప్రాంతవాసుల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించాయన్నారు. కొండప్రాంతవాసులను ఆదుకొంటామని చెప్పి టీడీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చిందన్నారు. ఆ విధంగా పేదల రక్షణకు, అభివృద్ధికి రూ.100 కోట్లు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలన్నారు. తక్షణం రూ.10కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే కేంద్రం నుంచి ప్రత్యేక ప్యాకేజి కింద నిధులు పొందటానికి కృషి చేయాలన్నారు. మేయర్, పాలకపక్షం మొద్దు నిద్ర వీడి కొండ ప్రాంతవాసులను ఆదుకోవాలన్నారు. కార్పొరేటర్ బోయి సత్యబాబు, నేతలు కె.సూరిబాబు, ఈవీ నారాయణ, రాజు, నాగ, బాషా, సుబ్బారావు పాల్గొన్నారు.

ఆర్టీసీలో పార్శిళ్ల వేలం

బస్టేషన్: స్థానిక ఏపీఎస్ఆర్టీసీ పార్శిల్ కార్యాలయంలో గుర్తింపబడని, చిరునామాదారులు తీసుకువెళ్లని పార్శిళ్లను ఈనెల 25న బహిరంగ వేలం వేయనున్నట్టు కమర్షియల్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25న గురువారం ఉదయం 10 గంటలకు ఆసక్తిగల వ్యక్తులు పండిట్ నెహ్రూ బస్టేషన్‌లోని పార్శిల్ కార్యాలయం వద్దకు రావాలని కోరారు.

కవి 'ఆడిగోపుల' మృతి పట్ల సీపీఎం సంతాపం

గవర్నర్‌పేట: ప్రముఖ కవి ఆడిగోపుల వెంకటరత్నం మృతి పట్ల సీపీఎం రాష్ట్ర కమిటీ తీవ్ర సంతాపం తెలియజేసింది. 5 దశాబ్దాలుగా సాహిత్య రంగంలో ఆయన సేవలు మరువలేనివని రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మృతి సాహితీరంగానికి తీరని లోటన్నారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనలో ఇద్దరికి రిమాండ్

గన్నవరం: స్థానిక టీడీపీ కార్యాలయంపై దాడి చేసి వాహనాలు తగలపెట్టిన కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్టు సీఐ కేవీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. ముస్తాబాదకు చెందిన బొమ్మారెడ్డి వెంకట నరసింహారెడ్డి, సావరగూడెంకు చెందిన కారుమంచి మహేష్‌ను అరెస్టు చేసి గన్నవరం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14రోజుల రిమాండ్ విధించారు. అనంతరం వారిని స్థానిక సబ్‌జైల్‌కు తరలించారు. ఆ కేసులో 71మందిని నిందితులుగా చేర్చి కేసు నమోదు చేయగా గతంలో 15మందిని అరెస్టు చేశారు. ప్రధాన నిందితులు మాత్రం పరారీలో ఉన్నారు.

ఐహెచ్ఆర్ఎల్ఎస్సీ అధ్యక్షురాలిగా సామ్రాజ్యం

విజయవాడ: ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ లీగల్ సర్వీస్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షురాలిగా నగరంలోని సూర్యరావుపేటకు చెందిన కోట సామ్రాజ్యం (సుచి) నియమితులయ్యారు. ఇందుకు సంబంధించి కౌన్సిల్ వర్కింగ్ చైర్మన్ అనూష ఉత్తర్వులిచ్చారు.

బరోడా ఉద్యోగుల వాక్‌థాన్

లబ్బీపేట: బ్యాంక్ ఆఫ్ బరోడా 8200 బ్రాంచ్‌లతో, 100 విదేశీ బ్రాంచ్‌లతో దినదినాభివృద్ధి చెందుతుందని రీజనల్ మేనేజర్ చందన్ సాహు, డిప్యూటీ రీజనల్ మేనేజర్ సి.హెచ్ శ్రీనివాసులు తెలిపారు. బ్యాంక్ 117వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం బ్యాంక్ ఉద్యోగులు నగరంలో వాక్‌థాన్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు శుభాకాంక్షలు తెలిపారు. బ్యాంక్ ఉద్యోగులు పాల్గొన్నారు.

గురువును ఆరాధించేందుకే వ్యాస జయంతి: బ్రహ్మర్షి పసుమర్తి

విజయవాడ కల్చరల్: గురువును ఆరాధించేందుకు వ్యాస జయంతిని సనాతన ధర్మం నిర్ణయించిందని ఉపన్యాస శిరోమణి బ్రహ్మశ్రీ పసుపర్తి కామేశ్వరశర్మ అన్నారు. శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకుల అధ్వర్యంలో గురుపూజా మహోత్సవం ఘనంగా జరిగింది. గాంధీనగర్‌లోని శారదా జూనియర్ కళాశాలలో వ్యాసపూర్ణిమ సందర్భంగా శనివారం ఈ వేడుక నిర్వహించారు. బ్రహ్మశ్రీ పసుమర్తి కామేశ్వరశర్మ, ఆత్కూరి మల్లిఖార్జునశర్మలకు గురుపూజ నిర్వహించి కళాశాల సెక్రటరీ కుందా రామనారాయణ, కరస్పాండెంట్ ఎస్.వరప్రసాద్ సత్కరించారు. శారదా స్కూల్ ప్రిన్సిపాల్ ఏఎల్ఎన్ మూర్తి, శారదా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నాగేశ్వరశర్మ, శారదా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లుక్కా శ్రీధర్ ముఖ్య పాత్ర వహించారు. శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ విద్యాసంస్థల పాలక వర్గం, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, శారదా స్కూల్, ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాల విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎంపీడీవో ఫోన్ కాల్స్‌పై దృష్టి..!

● ఇంకా దొరకని ఆచూకీ.. కొనసాగుతున్న గాలింపు ● రేవు రికార్డులు స్వాధీనం చేసుకున్న ఉయ్యూరు పోలీసులు

నరసాపురం రూరల్/మచిలీపట్నం: ఎంపీడీవో వెంకటరమణ అదృశ్యంపై ఇంకా సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. ఆరోరోజు కూడా ఆ చూకీ చిక్కలేదు. కృష్ణాజిల్లా పోలీసులు అన్ని కోణా ల్లో దర్యాప్తు చేస్తున్నారు. విజయవాడలోని పంట కాల్వలో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో గాలింపు చేస్తూనే, అదృశ్యానికి ముందు ఎంపీడీవోకు వచ్చిన ఫోన్ కాల్స్‌పై దృష్టి పెట్టారు. ఇటు మండల పరిషత్ కార్యాలయంలో రేవుకు సంబంధించిన కొన్ని రికార్డులను ఉయ్యూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రేవుకు సంబంధించిన లావాదేవీలను అన్ని కోణాల్లోనూ విచారిస్తున్నారు. తరచూ ఎంపీడీవోకు కొన్ని ఫోన్ కాల్స్ వచ్చేవని, అవి వచ్చినప్పుడల్లా భయాందోళన చెంది సిబ్బంది పనిచేసే చోటే కూర్చొనేవారని, ఒకసారి అప్పుచేసి పెద్దమొత్తంలో నగదు పంపిన విషయం గుర్తించిన పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేపడుతున్నారు. ఎందుకు ఫోన్ చేస్తున్నారు.. ఎంపీడీవోను బెదిరించి డబ్బులు గుంజుకోవడం? అనే కోణంలో విచారణ చేస్తున్నారు. వచ్చిన ఫోన్ కాల్స్ అన్నీ ఇతర రాష్ట్రాలకు చెందినవిగా గుర్తించి వారి వివరాలను సేకరించే పనుల్లో నిమగ్నమయ్యారు. వీరికి, పాటదారుడు రెడ్డప్ప ధవేజీకి ఏమైనా సంబంధం ఉందా? అన్న కోణంలోదర్యాప్తు చేస్తున్నారు.





కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న గద్దె అనురాధ, ఏలూరుకాలువలో గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలు


ఎంపీడీవో కుటుంబానికి అనురాధ పరామర్శ

పెనమలూరు: పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం ఎంపీడీవోగా పనిచేస్తూ అదృశ్యమైన రమణారావు కుటుంబసభ్యులను శుక్రవారం మధ్యాహ్నం జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ పరామర్శించారు. కానూరు మహదేవపురం కాలనీలోని ఎంపీడీవో ఇంటికి వెళ్లి జరిగిన సంఘటన గురించి తెలుసుకొన్నారు. కుటుంబానికి ప్రభుత్వం తరఫున అన్ని విధాల సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు.

జల్లెడపడుతున్న బృందాలు

ఉంగుటూరు: ఐదు రోజులుగా కనిపించకుండా పోయిన ఎంపీడీవో మండవ రమణారావు ఆచూకీ కోసం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, ఇరిగేషన్, పోలీసు బృందాలు, క్విక్ రియాక్షన్ టీమ్‌లు సంయుక్తంగా ఈనెల 16న మధురానగర్ నుంచి ఏలూరుకాలువలో చేపట్టిన గాలింపుచర్యలు శనివారం గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల పరిధిలో కొనసాగాయి. డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య ఆధ్వర్యంలో ఆయా బృందాలు పడవ, డ్రోన్ల సాయంతో ఏలూరు కాలువను రెండు వైపులా జల్లెడపట్టాయి. గన్నవరం, హనుమాన్‌జంక్షన్ సీఐలు వరప్రసాద్, నరసింహమూర్తితోపాటు గన్నవరం, ఉంగుటూరు, ఆత్కూరు, వీరవల్లి, హనుమాన్‌జంక్షన్ ఎస్సైలు శివప్రసాద్, రవిచంద్రకుమార్, పైడిబాబు, చిరంజీవి, జనార్ధన్ పాల్గొన్నారు.


దుర్గమ్మకు సారె తెచ్చిన శ్రీశైలం ఈవో పెద్దిరాజు దంపతులు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల శ్రీధర్ దంపతులు, డాక్టర్ నారాయణం సురేష్‌బాబు, సీపీకి దుర్గమ్మ చిత్రపటం ఇస్తున్న ఈవో

శ్రీశైలం, శ్రీకాళహస్తి నుంచి దుర్గమ్మకు సారె

వన్ టౌన్, జూలై 20: ఆషాఢమాసం సందర్భంగా ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మవారికి 14వ రోజు సారె సమర్పణలు కొనసాగాయి. శ్రీశైలంలోని భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి దేవస్థానం నుంచి ఈవో డి.పెద్దిరాజు దంపతులు, అర్చకులు, అధికారులు శనివారం సంప్రదాయబద్ధంగా దుర్గమ్మకు సారె సమర్పించారు. అలాగే శ్రీకాళహస్తిలోని జ్ఞానప్రసూనాంబ శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం తరపున శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల శ్రీధర్ దంపతులు, ఆలయ ఉపకార్యనిర్వహణ అధికారి ఎస్ఆర్ కృష్ణారెడ్డి, అధికారులు దుర్గమ్మకు లాంచనాలతో సారె సమర్పించారు. దుర్గగుడి ఈవో రామారావు, అర్చకులు, అధికారులు వారికి సాదర స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో వారికి దుర్గమ్మ దర్శనం కల్పించారు. ప్రత్యేక అర్చనల అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు, చిత్రపటాలు అందజేశారు. రాజస్థాన్‌లోని భరత్‌పూర్ ఎంపీ శ్రీరామ్ స్వరూప్ కులి, కేంద్ర సాహిత్య అకాడమీ ఉపకార్యదర్శి డాక్టర్ నారాయణం సురేష్‌బాబు దుర్గమ్మను దర్శించుకున్నారు. ఈవో రామారావు వారికి స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు, చిత్రపటం అందజేశారు.

దుర్గమ్మ సన్నిధిలో జిల్లా పోలీసు కమిషనర్

దుర్గమ్మను జిల్లా పోలీసు కమిషనర్ ఎస్‌వీ రాజశేఖర్‌బాబు దంపతులు శనివారం దర్శించుకున్నారు. అనంతరం ఈవో రామారావు వారికి ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు, చిత్రపటం అందచేశారు.

స్కీం పేరుతో స్కామ్..

● రూ.36 లక్షలు మోసపోయిన బాధితులు ● నలుగురిపై కేసు

పాయకాపురం, జూలై 20: ఊరు పేరు లేని కంపెనీని ఉన్నట్టు నమ్మించిన కొందరు కేటుగాళ్లు లక్షలు వసూళ్లు చేసి మోసం చేసిన వైనం శనివారం వెలుగులోకి వచ్చింది. దీంతో బాధితులు నున్న రూరల్ పోలీసులను ఆశ్రయించారు. పాయకాపురం సుందరయ్యనగర్ ప్రాంతానికి చెందిన నాగూర్, లోటస్‌లో ఉంటున్న అనిల్, ముస్తాబాద్‌కు చెందిన నాగరాజు, రేవేంద్రపాడుకు చెందిన పవన్ స్నేహితులు. వీరు నలుగురు కలిసి లేని సంస్థను ఉన్నట్టుగా ప్రచారం చేశారు. రూ.10వేలు చెల్లిస్తే 10 రోజుల్లో రూ.లక్ష వస్తాయంటూ నవిస్మించారు. వీరి మాటలు నమ్మి నగరానికి చెందిన షాలిని మరో నలుగురు, గుంటూరుకు చెందిన మరో మహిళ మొత్తం ఈ ఏడాది జనవరిలో రూ.36లక్షలు చెల్లించారు. తర్వాత రూ.లక్షలు రాకపోవడంతో ప్రశ్నించారు. కంటైనర్లలో, షిప్‌లలో డబ్బులొస్తున్నాయని రాగానే ఇస్తామంటూ వాయిదాలు వేస్తున్నారు. దీంతో బాధితులు నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వాహన్ పోర్టల్ అమలుతో యజమానులకు ఇక్కట్లు

పటమట, జూలై 20: రవాణాశాఖ ఆన్‌లైన్ సేవలను ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వ పోర్టల్ ఈ-ప్రగతితో పాటు కేంద్రప్రభుత్వ వెబ్‌సైట్ వాహన్ ద్వారా అందిస్తూ వచ్చిన అధికారులు ఇకపై ఈ-ప్రగతి స్థానంలో వాహన్ పోర్టల్‌ను విస్తరించేందుకు జిల్లాలో చేపట్టిన డేటా బదలాయింపు ప్రక్రియతో వాహన యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ది కృష్ణా డిస్ట్రిక్టు లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగుమోతు రాజా ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని ది కృష్ణా డిస్ట్రిక్టు లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో రాజా శనివారం మాట్లాడారు. పలు సేవల వివరాలను వాహన్ పోర్టల్‌లో కనిపించడం లేదన్నారు. ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు మాట్లాడుతూ వాహన్ వెబ్‌సైట్ నెమ్మదిగా ఉండటంతో ఈ-ప్రగతిలో ఉండే అనేక మాడ్యూల్స్ అందులో లేకపోవడంతో వాహనాల డేటా ట్రాన్స్‌ఫర్ పక్రియ జాప్యం అవుతోందన్నారు. ప్రధాన కార్యదర్శి అల్లాడ వీరవెంకట సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 8 నుంచి ప్రయోగాత్మకంగా వాహనాల డేటాను రాష్ట్ర రవాణాశాఖ వైబ్‌సైట్ ఈ-ప్రగతి నుంచి వాహన్ పోర్టల్ (ఎన్ఐసీ సర్వర్)లోకి బదిలీ చేయడానికి ఎన్టీఆర్ జిల్లాను కాకుండా తక్కువ వాహనాలుండే జిల్లాను ఎంపిక చేసి ఉండాల్సిందన్నారు.



ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయానికి వచ్చిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రి నారాయణ, ఎంపీ హరీష్

ఎంపీ శివనాథ్ కార్యాలయంలో కేంద్రమంత్రి సందడి

విద్యాధరపురం, జూలై 20: నగరంలోని గురునానక్ కాలనీలోని ఉన్న ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌కు శనివారం కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు విచ్చేసి సందడి చేశారు. సీఎం చంద్రబాబు నాయుడుతో సమావేశానంతరం వారిద్దరూ ఎన్టీఆర్ భవన్‌కు వచ్చారు. రామ్మోహన్ నాయుడు రాకతో ఆ ప్రాంతమంతా సందడి వాతావరణం నెలకొంది, కార్యకర్తలు, నేతలు రామ్మోహన్ నాయుడును కలిసి అభినందించారు. కొద్దిమంది నేతలతో ఆయన స్థానిక సమస్యలపై చర్చించారు.

ఎంపీని కలిసిన మంత్రి నారాయణ, ఎంపీ హరీష్

స్థానిక ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)ను శనివారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో మంత్రి పి.నారాయణ, అమలాపురం ఎంపీ జీఎం హరీష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు వివిధ అంశాలపై చర్చించుకున్నారు.

జాతీయ నూతన విద్యావిధానంపై 3,4న సదస్సు

భవానీపురం, జూలై 20: నూతన జాతీయ విద్యావిధానం అమలులో ఎదురయ్యే సవాళ్లపై ఆగస్టు 3, 4న రెండు రోజుల పాటు జాతీ య సదస్సును నగరంలో నిర్వహిస్తున్నట్టు స్పా కళాశాల సంచాలకుడు ఆచార్య కొండా రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా స్పా కళాశాలలో శనివా రం బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అఖిల భారత జాతీయ రాష్ట్రీయ సైక్షిక్ మహాసంఘ, ప్రణాళిక రూపశిల్ప కళాశాల (స్పా) సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సుకు మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు. సిద్ధార్థ అకాడ మీ విద్యా విషయక సలహాదారు వినయ్‌కుమార్ గౌరవ అతిథిగా అఖి ల భారత రాష్ట్రీయ సైక్షిక్ మహాసంఘ్ జాతీయ సంయుక్త నిర్వహణ కా ర్యదర్శి గుంత లక్ష్మణ్ కీలకోపన్యాసం చేస్తారన్నారు. సమన్వయ కర్తగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వాణిజ్యశాస్త్ర మేనేజ్‌మెంట్ విభా గం డీన్ ఆచార్య ఆర్ శివరామప్రసాద్, నిర్వహణ కార్యదర్శిగా ఎస్ఆర్ఆర్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ బాల సుబ్రమణ్యం వ్యవహరిస్తారన్నారు. ఆచార్య వైవీ రామిరెడ్డి, డాక్టర్ బాలసుబ్రమణ్యం, డాక్టర్ బాలకృష్ణ, కార్తీక్, ఆర్.రాజీవ్ పాల్గొన్నారు.

ఓపెన్ చెస్ టోర్నీ విజేతగా నిరంజన్

విజయవాడ స్పోర్ట్స్, జూలై 20: ప్రపంచ చెస్ డే సందర్భంగా న గరంలోని ఫన్‌టైమ్స్ వేదికగా శనివారం ఉత్కంఠగా జరిగిన రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నీ విజేతగా ఎం.నిరంజన్ నిలిచారు. 7రౌండ్ల పోరులో 6.5తో ట్రోఫీని వశం చేసుకున్నారు. అభిరామ్ 6 పాయింట్లతో 2వ స్థా నంలోను, పొట్లూరి సుప్రీత 6 పాయింట్లతో 3వ స్థానంలో నిలిచింది. వి జేతలకు బహుమతుల ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా ద్రోణాచార్య అ వార్డీ కోనేరు అశోక్, అట్లూరి సుధారాణి, జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ ఖాసీమ్ పాల్గొని అందజేశారు. ఫన్‌టైమ్స్ యాజమాన్యం అ ట్లూరి సుమబిందు, కిలారు వెంకట శివాజీ, ముప్పవరపు సతీష్, జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.రాజీవ్ పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలి

● పంట నష్టంపై సీపీఎం డిమాండ్

గవర్నర్‌పేట, జూలై 20: వాయుగుండం ఫలితంగా రాష్ట్రంలోని శ్రీకాకుళం నుంచి కృష్ణాజిల్లా వరకు కురిసిన భారీ వర్షాల కారణంగా వేలాది ఇళ్లు, లక్షలాది ఎకరాల్లో పంటలు, పశువులు తీవ్రంగా నష్టపోయాయని, రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన రక్షణ సహాయక చర్యలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. తెలంగాణ, ఏపీ సరిహద్దు ప్రాంతంలో పెద్దవాగు ప్రాజెక్టుకు గండి పడి వేలేరుపాడు మండలం తీవ్రంగా నష్టపోయిందన్నారు. గోదావరి, కృష్ణ నదులు వరద తాకిడితో పరిసరాల్లోని వందలాది గ్రామాలు, మునక భయంతో మెరక ప్రాంతాలకు వెళ్లాలనే ప్రయత్నంలో ఉన్నారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులతోపాటు పార్టీ శ్రేణులు వెం టనే ఆయా ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు అండగా నిలవాలని కోరా రు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంతెన సీతారాం నాయకత్వంలో ఆదివారం సీపీఎం బృందం వరద ప్రాంతాల్లో పర్యటిస్తుందన్నారు.



కాకినాడలో కారు ఢీకొట్టాక చెల్లాచెదురుగా పడివున్న మృతదేహాలు

కొత్తకారు.. మద్యంమత్తు
అర్ధరాత్రి 2 ద్విచక్రవాహనాలతో ఢీ

- ఆ తర్వాత డివైడర్‌పైకి దూసుకెళ్లి పల్టీ
- అక్కడికక్కడే ఇద్దరు దుర్మరణం .. మరో ఇద్దరి పరిస్థితి విషమం
- కాకినాడలో ప్రమాదం.. ఎక్స్‌యూవీలో మహిళ, యువకుడు క్షేమం

కాకినాడ క్రైం, జూలై 20: ఓ యువకుడు కొత్తకారు ఎక్స్‌యూవీ కొన్నాడు. ఆ సంతోషంతో ఓ మహిళతో కలసి మందు పార్టీ చేసుకున్నాడు. ఇంత వరకు అతడి వ్యక్తిగత విషయం. అక్కడితో సరిపెట్టి ఉంటే ఇద్దరి ప్రాణాలు నిలిచేవి. మరో ఇద్దరు క్షేమంగా ఉండేవారు. అయితే మద్యంమత్తులో ఆ మహిళతో కలిసి కారు నడుపుతూ రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టాడు. ఇద్దరి ప్రాణాలు పోవడంతో పాటు మరో ఇద్దరు తీవ్రంగా గాయపడటానికి కారణమయ్యాడు. కాకినాడ నగరంలో శనివారం అర్ధరాత్రి ఈ ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానిక కల్పనా సెంటర్‌లో కారు అతివేగంగా వస్తూ రెండు ద్విచక్ర వాహనాలను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారులు లక్ష్మణ్, సతీశ్ అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరో ఇద్దరు తీవ్రగాయాల పాలయ్యారు. కారు మాత్రం బోల్తాపడి అందులో ఒక పురుషుడు, మరో స్త్రీ మద్యం మత్తులో ఉన్నారు. ఇద్దరూ స్వల్పంగా గాయపడినట్టు తెలుస్తోంది. పోలీసుల కథనం ప్రకారం చల్లా రామ్మోహన్ అనే వ్యక్తి కొత్తగా మహేంద్ర ఎక్స్‌యూవీ 700 కారును కొనుగోలు చేశాడు. దానికి ఇంకా నంబరు కూడా రాలేదు. కొత్తకారు కొన్న సంతోషంలో మందు పార్టీ ఇచ్చాడు. ఓ మహిళతో కలిసి శనివారం సాయంత్రం మద్యం సేవించారు. ఈ క్రమంలో రాత్రి వాకలపూడి మీదుగా డైరీ ఫామ్ నుంచి కల్పనా వైపు వస్తూ.. ఆ సమయంలో పేర్రాజుపేటకు చెందిన లక్ష్మణ్, సతీశ్‌లు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని, ఆ వెనకనే వెళుతున్న రేచర్లపేట దుర్గాప్రసాద్, మరో వ్యక్తి యాక్టివా వాహనాన్ని ఢీకొట్టారు. అనంతరం ఎక్స్‌యూవీ 700 వాహనం డివైడర్‌పైకి దూసుకెళ్లి రెండు పల్టీలు కొట్టి బోల్తా పడింది. లక్ష్మణ్, సతీశ్ అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు కాకినాడ ఎస్‌డీపీవో డాక్టర్ హనుమంతరావు తెలిపారు. కారులో రామ్మోహన్‌తోపాటు ఉన్న మహిళ ఎవరనేది పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉందని ఆయన చెప్పారు. త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హాస్టళ్లలో పిల్లలు ఇబ్బందులు పడితే ఊరుకోను

- మెరుగైన సదుపాయాలు కల్పించాలి: మంత్రి సవిత



అమరావతి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలిగినా బాధ్యులైన అధికారుల్ని ఉపేక్షించేది లేదని బీసీ సంక్షేమ, జౌళిశాఖ మంత్రి సవిత ఒక ప్రకటనలో హెచ్చరించారు. వర్షాలు పడుతుండటం, వ్యాధులు వ్యాపించే అవకాశం ఉండటంతో తక్షణమే హాస్టళ్లలో మెరుగైన సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. తాగునీరు, భోజనం, వసతుల విషయంలో రాజీపడకుండా చూసుకోవాలన్నారు. మన ఇంట్లో పిల్లల్ని ఏ విధంగా చూసుకుంటామో, ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటామో? హాస్టళ్లలో పిల్లల విషయంలోనూ అదే విధమైన శ్రద్ధ చూపాలన్నారు. ఇప్పటికే హాస్టళ్లలో పరిశీలన చేయగా చాలా చోట్ల వసతులు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు.

రైతు భరోసా నిధులు విడుదల చేయాలి

- ఎన్నికల హామీల అమలుకు చర్యలు తీసుకోండి: సీపీఐ రామకృష్ణ

ఒంగోలు(కలెక్టరేట్)/అమరావతి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీ మేరకు వెంటనే రైతుభరోసా నిధులను విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. ఒంగోలు సీపీఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలుకు చంద్రబాబు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రం నుంచి విభజన హామీలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి సూచించారు. విభజన సమయంలో రాష్ట్రానికి ఇస్తామన్న ప్రత్యేక హోదాతోపాటు విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో పలు జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తున్నందున వరద బాధిత ప్రాంతాల్లో ప్రభుత్వం వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. భారీ వర్షాలకు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని పలు ప్రాంతాలు నీట మునిగాయని, పెద్దవాగు ప్రాజెక్టుకు గండిపడి వేలేరుపాడు, కుక్కునూరు మండలాలు అతలాకుతలమయ్యాయని తెలిపారు.

హరియాణాకు కేజ్రీవాల్ ఐదు గ్యారెంటీలు

- ప్రకటించిన కేజ్రీవాల్ సతీమణి



పంచకుల(హరియాణా), జూలై 20 : ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సతీమణి సునీత కేజ్రీవాల్ హరియాణాలో రానున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కేజ్రీవాల్ ఐదు గ్యారెంటీలను శనివారం ప్రకటించారు. బాలబాలికలకు ఉచిత విద్య, అందరికీ ఉచిత వైద్యం, 24 గంటలు ఉచిత విద్యుత్తు, రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1000, యువత ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పన ఈ ఐదు గ్యారెంటీల్లో ఉన్నాయి. హరియాణా అసెంబ్లీకి ఈ ఏడాది అక్టోబరులో ఎన్నికలు జరగనున్నాయి. పంచకులలో ఈ ఐదు గ్యారెంటీల ప్రకటన కార్యక్రమానికి కేజ్రీవాల్ సతీమణితోపాటు పంజాబ్ ముఖ్యమంత్రి భగ్వంత్ మాన్, ఆప్ సీనియర్ నేతలు సంజయ్ సింగ్, సందీప్ పాఠక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ... కేజ్రీవాల్ చేపడుతోన్న కార్యక్రమాలను చూసి ఓర్వలేకే ఆయన్ను ప్రధాని మోదీ జైలు పాలు చేశారని ఆరోపించారు. కేజ్రీవాల్ హరియాణా బిడ్డ అని, బీజేపీకి ఒక్క సీటు కూడా దక్కకుండదని ప్రజలను కోరారు. ఇది కేజ్రీవాల్ సమస్య కాదని... హరియాణా గౌరవానికి సంబంధించిన విషయమన్నారు. తాము గెలిస్తే గృహాలకు ఉచితంగా విద్యుత్తు ఇస్తామని, 24 గంటలూ విద్యుత్తు సరఫరా ఉంటుందని చెప్పారు.

పూరీ రత్నభాండాగారంలో పురాతన ఆయుధాలు

భువనేశ్వర్, జూలై 20: పూరీ జగన్నాథ ఆలయంలోని రత్నభాండాగారం నుంచి విలువైన వస్తువుల తరలింపు సందర్భంగా గత యుద్ధాల్లో ఉపయోగించిన కత్తులు, ఈటెలు, బరిశెలు వంటి పురాతన ఆయుధాలు బయటపడ్డాయి. లోపలి గదిలోని చెక్కపెట్టెల వద్ద ఈ ఆయుధాలు కనిపించాయని, అవన్నీ చాలా బరువుగా ఉండి నలుపు రంగులోకి మారాయని ట్రెజరీలోకి ప్రవేశించిన కమిటీ సభ్యుడు ఒకరు తెలిపారు. యుద్ధ సామగ్రిని తాత్కాలిక స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచామని కమిటీ చైర్మన్ జస్టిస్ బిశ్వనాథ్ రథ్ చెప్పారు. ఆలయ సేవకుడు శ్యామ మహాపాత్ర మాట్లాడుతూ, జగన్నాథ ఆలయంపై దుండగులు 18సార్లు దాడులు జరిపి, ఇక్కడి సంపదను దోచుకున్నారని చెప్పారు. ప్రసుతం లభించిన పురాతాన ఆయుధాలను అప్పటి రాజులు రత్న భాండాగారంలో దాచి ఉండవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు.

దావూద్ మాత్రమే ఉగ్రవాది.. అతని గ్యాంగ్ కాదు

ముంబయి, జూలై 20: పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడు, గ్యాంగ్‌స్టర్ దావూద్ ఇబ్రహీంపై వ్యక్తిగత హోదాలో మాత్రమే ఉగ్రవాది అన్న ముద్ర ఉందని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది. అందువల్ల అతని గ్యాంగ్‌లో ఉన్న అనుచరులను ఉపా చట్టం కింద అరెస్టు చేయలేరని తెలిపింది. ఉగ్రవాద నిరోధక చట్టం కింద అరెస్టయిన అతని అనుచరులు ఫయాజ్ భివాండీ వాలా, పర్వేజ్ వైద్ అనే నిందితులకు బెయిల్ మంజూరు చేస్తూ జస్టిస్ భారతి డాంగ్రే, ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.

జీవిత భాగస్వాములను
కలిపే 'బ్రెయిన్ వేవ్'!

బ్రెయిన్ మ్యాపింగ్‌తో నేర పరిశోధన సులువు

- భవిష్యత్తులో నాడీ వైద్య రంగంలో అద్భుతాలు!
- ఏపీ న్యూరోకాన్ సదస్సులో విజయ అధ్యక్షోపన్యాసం

గుంటూరు (మెడికల్) జూలై 20: సమీప భవిష్యత్తులో న్యూరాలజీ వైద్య రంగంలో మనిషి ఊహించలేని అద్భుతాలు సృష్టించే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ (ఏపీ ఎస్ఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షురాలు, గుంటూరుకు చెందిన ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ పి. విజయ తెలిపారు. గుంటూరులో జరుగుతున్న ఏపీ న్యూరోకాన్ 2024 రాష్ట్ర సదస్సులో శనివారం ఆమె 'బ్రెయిన్ నౌ అండ్ ఫ్యూచర్' అనే అంశంపై స్మారక అధ్యక్షోపన్యాసం చేశారు. తన ప్రసంగంలో ఆమె అనేక ఆసక్తికర అంశాలను ప్రస్తావించారు. అవి ఇలా ఉంటాయి!

- శంకర్‌దాదా ఎంబీబీఎస్ సినిమాలో హీరో చిరంజీవి, తన వైపు చూడాలంటూ మనసులో హీరోయిన్‌ను పిలుస్తాడు! ఆ మాట వినిపించినట్లుగా భ్రమపడిన హీరోయిన్ సోనాలి బింద్రే 'పిలిచావా శంకర్?' అని అడుగుతుంది. దీంతో హీరో ఉబ్బితబ్బిబ్బవుతాడు. ఇది సినిమాలో కేవలం సరదా సన్నివేశమే కావచ్చు.. కానీ సమీప భవిష్యత్తులో 'బ్రెయిన్ వేవ్ మ్యాచ్' అనే టెక్నాలజీ ద్వారా వాస్తవ రూపం దాల్చే అవకాశముంది.
- బ్రెయిన్ వేవ్ టెక్నాలజీ ద్వారా వివాహానికి ముందే యువతీ యువకులు తమ కాబోయే భాగస్వామి ఆలోచనలు, అభిరుచులు మెదడు సంకేతాల ద్వారానే తెలుసుకొని, తమ ఆలోచనకు 90 శాతం మ్యాచ్ అయ్యే వారిని పెళ్లికి ఎంచుకోవచ్చు. దాంపత్యంలో వీరి మధ్య ఎలాంటి గొడవలూ రావు!
- ఆదిత్య 369 సినిమాలో.. హీరో, ఇతర క్యారెక్టర్లు భవిష్యత్తు కాలానికి వెళతాయి. అక్కడ వారు మనస్సులో అనుకొనే మాటలు లౌడ్ స్పీకర్ ద్వారా బయటకు వినిపిస్తాయి. దీంతో వారు కంగారు పడతారు. ఇదెక్కడి దిక్కుమాలిన టెక్నాలజీ, మనస్సులో కూడా ఏమీ అనుకోకూడదా? అంటూ ఆయా క్యారెక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తాయి. ఇది సినిమాలో సరదా సన్నివేశంగా అనిపించినా.. భవిష్యత్తులో బ్రెయిన్ సంక్రోని అనే వినూత్న ప్రక్రియ ద్వారా నిజం కాబోతుంది. ముఖ్యంగా ఇది నేర పరిశోధనలో కీలక అంశంగా మారే అవకాశం ఉంటుంది.
- కోకిల సినిమాలో ఒక స్వామిజీ హత్యకు గురవుతాడు. అతడి కళ్లను హీరోకు అమరుస్తారు. దీంతో హీరోకు ఆ హంతకుడు కళ్లల్లో కనిపిస్తుంటాడు. ఇది సినిమాటిక్ సన్నివేశమే అయినా భవిష్యత్తులో బ్రెయిన్ మ్యాపింగ్ టెక్నాలజీ ద్వారా నిజమయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా హత్యకు గురయ్యే వారిని పోస్టుమార్టమ్ చేసే సమయంలో వారి మెదడులోని విషయాలను బ్రెయిన్ మ్యాపింగ్ టెక్నాలజీతో డీ కోడ్ చేసి నిజమైన హంతకులను తెలుసుకోవచ్చు.



ఏపీ న్యూరోకాన్-2024 రాష్ట్ర సదస్సులో ప్రసంగిస్తున్న న్యూరాలజిస్ట్ డాక్టర్ విజయ

- ఇంకా భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వర్చువల్ రియాలిటీ టెక్నాలజీ ద్వారా గాయపడిన రోగులను త్వరగా కోలుకొనేలా చేయవచ్చు. బ్రెయిన్ ఫింగర్ ప్రింట్ ద్వారా హంతకుడి మెదడులో ఆలోచనలను డీ కోడ్ చేసి హత్య చేసిన వివరాలను సులువుగా రాబట్టవచ్చు. న్యూరో జెనెటిక్స్ ద్వారా దెబ్బతిన్న మెదడు కణజాలం తిరిగి పునఃనిర్మించే అవకాశం ఉంటుంది.

మానవాళికి మేలు మలుపు

భవిష్యత్తులో న్యూరాలజీ వైద్య రంగంలో కొన్ని పరిశోధనలు మానవ జీవితాలను మలుపు తిప్పే గొప్ప ఆవిష్కరణలుగా నిలుస్తాయని డాక్టర్ విజయ వెల్లడించారు. ఈ సందర్భంగా పక్షవాతం, డిమెన్షియా, పార్కిన్‌సన్, ఫిట్స్, మైగ్రెయిన్ తదితర మెదడు సంబంధ వ్యాధుల తీవ్రత, వాటి చికిత్సలు, నివారణ వంటి అంశాలను వివరించారు. మన ఆలోచనలు మెదడును నియంత్రిస్తాయని, మెదడు నియంత్రణలో ఉంటే శారీరక, మానసిక ఆరోగ్యం బాగుంటుందని ఆమె తెలిపారు. తన ప్రసంగం అనంతరం డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ కోరుకొండ బాబ్జీ సూచనలతో హాజరైన వైద్యులందరూ స్టాండింగ్ ఒవేషన్‌తో అభినందనలు తెలిపారు. దీంతో డాక్టర్ విజయ భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు.

దేశ వ్యాప్తంగా
కులగణన అవసరం

- కానీ సమాచారాన్ని బహిర్గతం చెయ్యకూడదు: చిరాగ్ పాశ్వాన్

న్యూఢిల్లీ, జూలై 20: దేశ వ్యాప్తంగా కులగుణన చేపట్టాల్సిన అవసరముందని కేంద్ర మంత్రి, ఎల్‌జేపీ(రామ్ విలాస్) అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్ అభిప్రాయపడ్డారు. ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాల రూపకల్పనలో ఈ కుల గణన ప్రభుత్వానికి ఉపయోగపడుతుందని అన్నారు. అయితే, ప్రజల్లో అసమానతలు చెలరేగే అవకాశం ఉన్న నేపథ్యంలో కులగణన వివరాలను ప్రభుత్వం బహిర్గతం చేయకూడదని సూచన చేశారు. బిహార్‌లో తాము ఇప్పటికే కుల గణన చేపట్టామని, దేశ వ్యాప్తంగా ఆ కార్యక్రమం చేపట్టాల్సిన అవసరం ఉందని పాశ్వాన్ చెప్పారు. కులాల ప్రాతిపదికన కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు ఇప్పటికే అనేక పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. అందువల్ల ఏ కులానికి చెందిన వారు ఎంతమంది ఉన్నారనే సమాచారం తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు.

ఏమైంది నీకు.. మతి చెడిందా?

- కర్ణాటక ఎమ్మెల్యే ప్రదీప్‌పై స్పీకర్ తీవ్ర ఆగ్రహం

బెంగళూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో అవినీతి ఆరోపణలపై శాసనసభలో శనివారం చర్చ జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్.. బీజేపీ ప్రభుత్వంలో జరిగిన పలు అవినీతి అంశాలను ప్రస్తావించారు. ఒకానొక దశలో ఆవేశానికి లోనై ఏం మాట్లాడుతున్నారో అర్థం కాకుండా కేకలు వేస్తూ ఊగిపోయారు. స్పీకర్ యూటీ ఖాదర్ నాలుగైదుసార్లు జోక్యం చేసుకుని అలా మాట్లాడరాదని హితవు పలికారు. అయినా ప్రదీప్ వినకపోవడంతో తీవ్రంగా మందలించారు. 'నీకు ఏమైంది, మతి చెడిందా..? ఎవరైనా అతని చేతిలో ఇనుప ముక్క పెట్టండి' (మూర్ఛ వచ్చిన వారికి ఇచ్చిన తరహాలో) అంటూ ఆగ్ర హం వ్యక్తంచేశారు. అయినా పట్టించుకోని ప్రదీప్ ఈశ్వర్ అలా మాట్లాడుతూనే ఉన్నారు. చీఫ్ విప్ అక్కడికి వెళ్లి నమస్కరించి మాట్లాడవద్దని సూచించారు.

కాజకు మహర్దశ..!

- ఇక్కడ హాఫ్ క్లోవర్ జంక్షన్ ఏర్పాటుకు ఎన్‌హెచ్ ప్రతిపాదన
- బెజవాడ పశ్చిమ, తూర్పు బైపాస్‌లు కలిసే చోటు ఇక్కడే
- ఇది ఏర్పాటైతే మంగళగిరి నియోజకవర్గం వేగంగా అభివృద్ధి
- ద్వారకా ఎక్స్‌ప్రెస్ వే తరహాలో బటర్‌ఫ్లై క్లోవర్ జంక్షన్‌కు డిమాండ్

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)



మంగళగిరి నియోజకవర్గం కాజ వద్ద విజయవాడ పశ్చిమ, తూర్పు బైపాస్‌లు కలిసే అలైన్‌మెంట్

అమరావతి రాజధాని ప్రాంతం మంగళగిరి నియోజకవర్గంలోని కాజకు మహర్దశ పట్టనుంది. కాజ వద్ద ఎన్‌హెచ్-16పై బెజవాడ పశ్చిమ, తూర్పు బైపాస్‌లు కలిసేచోట హాఫ్ క్లోవర్ జంక్షన్ ఏర్పాటు చేసేందుకు జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్) ప్రతిపాదన సిద్ధం చే సింది. రెండు బైపాస్‌లు ఒకే దగ్గర కలిసేచోట హాఫ్ క్లోవర్ జంక్షన్ వల్ల ఈ ప్రాంతం కొత్త రూపును సంతరించుకోనుంది. రెండు బైపాస్‌ల మీదుగా వచ్చే ట్రాఫిక్, ఎన్‌హెచ్-16 మీదుగా రాకపోకలు సాగించే ట్రాఫిక్‌కు ఎక్కడా అవాంతరాలు కలగకుండా సాఫీగా సాగిపోవడానికి ఈ హాఫ్ క్లోవర్ జంక్షన్ దోహదపడుతుంది. దీని వల్ల కాజ, మంగళగిరి ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందనుంది. ప్రస్తుతం ఆరు వరసలతో కూడిన జాతీయ రహదారిగా ఉన్న ఎన్‌హెచ్-16కు చిన్న అవుటపల్లి నుంచి విజయవాడ పశ్చిమ బైపాస్ కాజ దగ్గర అనుసంధానమవుతుంది. చిన్న అవుటపల్లి నుంచి గొల్లపూడి వరకు ప్యాకేజీ-3లో 90 శాతం మేర, ప్యాకేజీ-4లో భాగంగా కృష్ణానది మీద బ్రిడ్జి, కాజ వరకు రోడ్డు పోర్షన్ పనులు 60 శాతం మేర పూర్తయ్యాయి. మరో ఆరు నుంచి తొమ్మిది నెలల్లో ఇది అందుబాటులోకి రానుంది. అలాగే పొట్టిపాడు నుంచి ప్రతిపాదిత తూర్పు బైపాస్ కూడా కాజ దగ్గర ఎన్‌హెచ్-16కు కలవనుంది. ఈ రెండు బైపాస్‌లూ ఆరు వరసలతో నిర్మిస్తున్న నేపథ్యంలో.. కాజ ప్రాంతంలో హాఫ్ క్లోవర్ జంక్షన్ కంటే కూడా బటర్‌ఫ్లై క్లోవర్ జంక్షన్ ఏర్పాటు చేస్తే బాగుటుందనే వాదన వినిపిస్తోంది.

బటర్‌ఫ్లై క్లోవర్ జంక్షన్ అయితే మేలు..

ఆరు వరసలతో కూడిన బైపాస్‌లను అనుసంధానం చేసే చోట భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని చూస్తే బటర్ ఫ్లై క్లోవర్ జంక్షన్ అవసరం తప్పకుండా ఏర్పడుతుంది. దేశ రాజధాని ఢిల్లీ నుంచి హరియాణా వరకు నిర్మించిన ద్వారకా ఎక్స్‌ప్రెస్ వేలో ఇలాంటి బటర్ ఫ్లై క్లోవర్ జంక్షన్లు కనిపిస్తాయి. ఏపీ రాజధాని అమరావతి.. రానున్న రోజుల్లో విస్తృతమైన రోడ్ నెట్‌వర్క్‌తో అనుసంధానం కానుంది. ఏపీలోనే అత్యంత భారీ వ్యయంతో కూడిన అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)కు కేంద్రం పచ్చజెండా ఊపింది. రాష్ట్ర ప్రభుత్వం ఇన్నర్ రింగ్ రోడ్డు దిశగా కూడా అడుగులు వేస్తోంది. హైదరాబాద్ నుంచి అమరావతికి ఆరు వరసల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేయగా.. కేంద్రం సానుకూలత తెలిపింది. బెంగళూరు-విజయవాడ ఎకనామిక్ కారిడార్, నాగ్‌పూర్-విజయవాడ ఎకనామిక్ కారిడార్ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఇవి రెండూ కూడా అమరావతి అవుటర్ రింగ్ రోడ్డుకు అనుసంధానమవుతాయి. వీటికి తోడు విజయవాడ-ఛత్తీస్‌గఢ్ (ఎన్‌హెచ్- 30), ఖమ్మం-విజయవాడ (ఎన్‌హెచ్-216 హెచ్), కత్తిపూడి-ఒంగోలు (ఎన్‌హెచ్-216) వంటి వాటితో పాటు ప్రధానంగా ఎన్‌హెచ్-16, ఎన్‌హెచ్-65లు అనుసంధానమవుతాయి. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డును తలపెడితే దీని నుంచి అవుటర్ రింగ్ రోడ్డుకు అనుసంధాన మార్గాలు ఉంటాయి. కాబట్టి విజయవాడ పశ్చిమ, తూర్పు బైపాస్‌లు అనుసంధానమయ్యేచోట హాఫ్ క్లోవర్ జంక్షన్ కంటే కూడా బటర్ ఫ్లై క్లోవర్ జంక్షన్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది. ఎందుకంటే రాజధాని ప్రాంతం కావడం వలన భవిష్యత్తులో ఈ ప్రాంతంలో భూసేకరణ అత్యంత ఖర్చుతో కూడుకున్న వ్యవహారంగా మారే అవకాశాలున్నాయి. భవిష్యత్తులో ఎనిమిది వరసలుగా చేయాల్సి వచ్చినపుడు కూడా హాఫ్ క్లోవర్ జంక్షన్ సమస్య కాకుండా ఉండాలంటే.. పూర్తిస్థాయి బటర్‌ఫ్లై క్లోవర్ జంక్షన్‌ను అభివృద్ధి చేయాలన్న డిమాండ్ స్థానికంగా వ్యక్తమవుతోంది. కాజ దగ్గర రెండు జాతీయ బైపాస్‌లు అనుసంధానం జరిగే చోట బటర్ ఫ్లై క్లోవర్ జంక్షన్‌ను అభివృద్ధి చేసేలా రాష్ట్రం కూడా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది.

సౌదీ ఎడారిలో చిక్కుకున్న మరో తెలుగోడు

- రక్షించాలంటూ ఇసుకపూడివాసి వీడియో.. వైరల్
- స్పందించిన లోకేశ్
- రెండ్రోజుల్లో ఇంటికి చేరుస్తామని భరోసా

అంబాజీపేట, జూలై 20: ఉమ్మడి చిత్తూరు జిల్లా వాయల్పాడు మండలానికి చెందిన శివ ఏడాది దేశంలో చిక్కుకుని నరకయాతన అనుభవించి.. ఎట్టకేలకు మంత్రి లోకేశ్ చొరవతో తిరిగి స్వదేశానికి వచ్చిన విషయం తెలిసిందే. ఈ సంఘటన మరువకముందే మరో తెలుగోడు సౌదీ ఎడారిలో చిక్కుకుని అష్టకష్టాలు పడుతున్న వైనం వెలుగులోకి వచ్చింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం ఇసుకపూడి మెరకపేటకు చెందిన సరెళ్ల వీరేంద్రకుమార్ బతుకుదెరువు కోసం సౌదీకి వెళ్లి.. ఏజెంట్ మోసంతో అక్కడి ఎడారిలో చిక్కుకుని నరకయాతన పడుతున్నాడు. వీరేంద్ర వంటమనిషిగా పనిచేసేందుకు ఈ నెల 9న మధ్యవర్తులు, ఏజెంటు ద్వారా ఖత్తర్ దేశానికి వెళ్లాడు. 10న ఖత్తర్‌లో దిగిన అతడిని అక్కడి నుంచి సౌదీ అరేబియాకు పంపించారు. తీరా ఇంటిలో పనులు, వంట పనులు కాకుండా.. వీరేంద్రకుమార్‌ను ఎడారిలో ఒంటెల కాపరిగా నియమించారు. అక్కడ ఎండల తీవ్రత, అధిక ఉష్ణోగ్రతల కారణంగా వీరేంద్రకు రక్తపు వాంతులబారిన పడ్డాడు. ఆ ప్రాంతంలో తాగేందుకు నీరు, ఆహారం దొరక్క నరకయాతన పడుతున్నాడు. దీంతో అతడి ఆరోగ్యం క్షీణించింది. దీంతో నత దయనీయ స్థితిని వివరిస్తూ తల్లిదండ్రులు సరెళ్ల సత్తిరాజు, మరియమ్మ, తమ్ముడు రవీంద్రకు వీరేంద్ర వాట్సాప్ ద్వారా వీడియో సందేశం పంపించాడు. దీంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు విషయాన్ని స్థానిక సర్పంచ్ తరపట్ల మోహన్‌సింగ్‌బాబూరావు, ఎంపీటీసీ ముత్తాబత్తుల ప్రశాంత్‌కు తెలిపారు. వారు ఈ నెల 19న అమరావతిలోని ఎన్ఆర్ టీఎస్ విభాగం (తెలుగు సొసైటీ) అధికారులకు వీరేంద్ర ఇబ్బందులను వివరిస్తూ ఫిర్యాదు చేశారు. అలాగే తల్లిదండ్రులు కుమారుడి వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వైరల్ అయింది. ఈ పోస్టుపై మంత్రి నారా లోకేశ్ స్పందించారు. రెండు రోజుల్లో స్వదేశానికి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని సోషల్ మీడియా వేదికగా ఆయన హామీ ఇచ్చారు. కాగా, తమను ఇబ్బందులు లేకుండా చూసుకుంటానని ఉపాధి కోసం విదేశాలకు వెళ్లిన తమకుమారుడు ఇప్పుడు చావుబతుకుల్లో ఉన్నాడంటూ వీరేంద్ర తల్లిదండ్రులు సరెళ్ల సత్తిరాజు, మరియమ్మ, తమ్ముడు రవీంద కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇల్లు కట్టి సెటిల్ అవుతానని, తమ్ముడ్ని ఉన్నత చదువులు చదివిస్తానని చెప్పాడంటూ కొడుకును తలచుకుని రోదిస్తున్నారు. వీరేంద్రకుమార్ కుటుంబ సభ్యులను నియోజకవర్గ టీడీపీ నాయకులు శనివారం పరామర్శించారు. వీరేంద్రను రెండు రోజుల్లో స్వదేశానికి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకుంటానని మంత్రి లోకేశ్ మాటిచ్చారని, అధైర్యపడొద్దని వారికి ధైర్యం చెప్పారు.



సోషల్ మీడియాలో ట్వీట్ చేసిన మంత్రి లోకేశ్

చట్టప్రకారం నిర్ణయం తీసుకోండి

- నందిగం సురేష్ నివాస విషయంలో హైకోర్టు ఆదేశం

అమరావతి, జూలై 20(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా, తుళ్లూరు మండలం, ఉద్దండరాయునిపాలెం పరిధిలోని సర్వే నం. 121-1బిలోని 1.07 ఎకరాలలో అనుమతులు లేకుండా చేపట్టిన ఇంటి నిర్మాణాన్ని కూల్చివేస్తామంటూ పంచాయతీ సెక్రటరీ ఈ నెల 10న ఇచ్చిన నోటీసులను సవాల్ చేస్తూ వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేష్ దాఖలు చేసిన వ్యాజ్యం శనివారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ప్రభుత్వ న్యాయవాది దిలీప్ వాదనలు వినిపిస్తూ.. ఇంటి నిర్మాణ స్థలం తనదేనని నిరూపించుకొనేందుకు పిటిషనర్ ఎలాంటి డాక్యుమెంట్‌ను కోర్టు ముందు ఉంచలేదన్నారు. అధికారుల నోటీసులకు పిటిషనర్ వివరణ ఇచ్చారన్నారు. దానిని పరిశీలించి తుది ఉత్తర్వులు జారీ చేస్తారన్నారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం, గ్రామపంచాయతీ నోటీసుల పై అదనపు వివరాలతో అధికారులకు వివరణ ఇచ్చేందుకు పిటిషనర్‌కు రెండువారాల గడువు ఇచ్చింది. ఆ తరువాత చట్ట నిబంధనలకు లోబడి నిర్ణయం తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేసింది. భవన నిర్మాణ అనుమతుల రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకొనేందుకు పిటిషనర్‌కు వెసులుబాటు కల్పించింది. అధికారుల అనుమతి లేకుండా ఇకపై నిర్మాణాలను కొనసాగించవద్దని పిటిషనర్‌కు తేల్చిచెప్పింది. నోటీసుల వ్యవహారంలో ముందుకెళ్లవచ్చని అయితే పిటిషనర్ వాదనలు వినాలని పంచాయతీ అధికారులకు స్పష్టం చేసింది. వ్యాజ్యాన్ని పరిష్కరించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అంతకముందు పిటిషనర్ తరఫు న్యాయవాది కాసా జగన్ మోహన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. భవన నిర్మాణానికి అనుమతిస్తూ 2014లోనే పంచాయతీ తీర్మానం చేసిందన్నారు. అయితే రాజకీయ కారణాలతో నిర్మాణానికి అవసరమైన అనుమతులు పిటిషనర్ పొందలేకపోయారన్నారు. 2019లో పంచాయతీ నుంచి భవన నిర్మాణానికి సంబంధించిన అనుమతుల ఉత్తర్వులు పొందిన తరువాత భవన నిర్మాణాన్ని ప్రారంభించారన్నారు. కోవిడ్ కారణంగా పనులు ఆగిపోయాయన్నారు. తాజాగా ప్రభుత్వం మారడంతో భవన నిర్మాణానికి అనుమతులు లేవంటూ అధికారులు నోటీసులు ఇచ్చారన్నారు.

'పుడా' తుది ఉత్తర్వులపై హైకోర్టుకు వైసీపీ

- కౌంటర్ దాఖలుకు అధికారులకు ఆదేశం
- వైసీపీ కార్యాలయ నిర్మాణంపై యథాతథస్థితి పాటించాలని స్పష్టీకరణ

అమరావతి, జూలై 20(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా, నరసరావుపేట మండలం, లింగంగుంట్ల గ్రామం పరిధిలో ఎలాంటి అనుమతులూ లేకుండా వైసీపీ జిల్లా పార్టీ కార్యాలయ భవనం నిర్మించారని నిర్ధారిస్తూ పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(పుడా) వైస్ చైర్మన్ ఈ నెల 9న ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ వైఎ‌స్ఆర్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి, పల్నాడు జిల్లా పార్టీ అధ్యక్షుడు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం శనివారం హైకోర్టులో విచారణకు వచ్చింది. దీనిపై పిటిషనర్ల తరఫున న్యాయవాది కాసా జగన్ మోహన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పార్టీ కార్యాలయం నిర్మాణం కోసం లింగంగుంట్ల గ్రామపంచాయతీ నుంచి అనుమతి తీసుకున్నామన్నారు. కానీ తమ వివరణను పరిగణలోకి తీసుకోకుండానే కోర్టు నిర్దేశించిన సమయం కంటే ముందుగానే పుడా తుది ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. పురపాలకశాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది దిలీప్ వాదనలు వినిపిస్తూ... పిటిషనర్లు ఏమీ తెలియని సాధారణ వ్యక్తులు కాదని, వారికి చట్టాల గురించి బాగా తెలుసని చెప్పారు. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటైందని తెలిసి కూడా భవన నిర్మాణ అనుమతి కోసం గ్రామ పంచాయతీకి దరఖాస్తు చేశారన్నారు. నివాసేతర భవనం విస్తీర్ణం కనీసం 300 చదరపు మీటర్లు ఉంటే అనుమతి కోసం పంచాయతీకి దరఖాస్తు చేసుకోవచ్చంటూ గతంలో ఉన్న నిబంధనను సవరిస్తూ 2017 ప్రభుత్వం జీవో 43 జారీ చేసిందన్నారు. పిటిషనర్ వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో చట్టనిబంధనల ప్రకారం తుది ఉత్తర్వులు జారీ చేశామని వివరించారు. వాదనలు నమోదు చేసిన ధర్మాసనం ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి, పుడా వైస్ చైర్మన్, లింగంగుంట్ల గ్రామ పంచాయతీ సెక్రటరీతో పాటు వ్యక్తిగత హోదాలో పుడా వైస్ చైర్మన్ సాంబశివరావుకు నోటీసులు జారీ చేసింది. భవనం విషయంలో యథాతథస్థితి పాటించాలని అధికారులను ఆదేశించింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ శనివారం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు.

మోహిత్‌రెడ్డి కేసు వివరాలు సమర్పించండి

- పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా ఎస్వీ యునివర్సిటీ పరిధిలో జరిగిన ఘర్షణకు సంబంధించి పోలీసులు నమోదు చేసిన కేసులో తన ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ చంద్రగిరి నియోజకవర్గ నేత చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యం శనివారం హైకోర్టులో విచారణకు వచ్చింది. పోలీసుల తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎస్.ప్రణతి స్పందిస్తూ.. వ్యాజ్యం మొదటిసారి విచారణకు వచ్చిందన్నారు. వివరాలు సమర్పించేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి విచారణను వచ్చే వారానికి వాయిదా వేశారు. అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయాలన్న పిటిషనర్ అభ్యర్థనను తోసిపుచ్చారు. ఎన్నికల సందర్భంగా ఎస్వీ యునివర్సిటీ పరిధిలో ఈ ఏడాది మే 14న చోటుచేసుకున్న ఘర్షణలో ప్రస్తుత ఎమ్మెల్యే పులివర్తి నాని ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ చంద్రగిరి నియోజకవర్గం నేత చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ తరఫున న్యాయవాది వెంకటేశ్ వాదనలు వినిపిస్తూ... ఫిర్యాదులో పిటిషనర్ పై నిర్దిష్ట ఆరోపణలు లేవన్నారు.

రేప్- హత్య కేసులో మరణశిక్షను నిలిపేసిన సుప్రీం

న్యూఢిల్లీ, జూలై 20: యువతిపై అత్యాచారానికి పాల్పడి, ఆపై హత్య చేసిన కేసులో కింది కోర్టులు నిందితునికి విధించిన మరణ శిక్ష అమలును సుప్రీంకోర్టు నిలుపుదల చేసింది. నిందితుడు ప్రస్తుతం దాఖలు చేసిన తుది అప్పీలుపై నిర్ణయం వెలువడే వరకు స్టే ఇస్తున్నట్టు ధర్మాసనం తెలిపింది. 2016లో ఓ న్యాయ విద్యార్థి (30 ఏళ్ల)నిపై అత్యాచారం జరిపి, ఆపై హత్య చేసిన కేసులో అస్సాంకు చెందిన వలస కూలీ మహమ్మద్ అమీర్ అల్ ఇస్లాంకు ట్రయల్ కోర్టు మరణశిక్ష విధించింది. హైకోర్టు కూడా దీన్ని సమర్థించింది. దీనిపై నిందితుడు సుప్రీంకోర్టులో అప్పీలు చేశాడు. పరిశీలించిన త్రిసభ్య ధర్మాసనం...జైలులో అతని ప్రవర్తన, మానసిక పరిస్థితి ఎలా ఉందో తేల్చడానికి నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేయాలని త్రిస్సూర్ ప్రభుత్వ వైద్య కళాశాలను ఆదేశించింది.



త్రిపురలోని ఓ చెక్‌పోస్టు వద్ద భారత విద్యార్థులు

బంగ్లాదేశ్‌లో కర్ఫ్యూ

- వెయ్యి మంది భారత విద్యార్థులు వెనక్కి
- చిక్కుకున్న మరో 4 వేల మంది

న్యూఢిల్లీ, జూలై 20: బంగ్లాదేశ్.. ఆందోళనలు, నిరసనలతో అట్టుడుకుతోంది. ప్రభుత్వ ఉద్యోగాల్లో స్వాతంత్ర్య సమరయోధుల వారసులకు కల్పించిన 30 శాతం రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ అక్కడి ప్రజలు చేస్తున్న పోరాటం తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీస్తోంది. ఆందోళనకారులు, అధికార అవామీ లీగ్ విద్యార్థి సంఘం కార్యకర్తలు బాహాబాహీకి దిగడంతో ఘర్షణలు హింసాత్మకంగా మారాయి. అలర్లలో శనివారం వరకు 115 మంది మరణించినట్లు తెలుస్తోంది. ఘర్షణలు హింసాత్మకంగా మారడంతో షేక్ హసీనా ప్రభుత్వం శుక్రవారం అర్ధరాత్రి నుంచి దేశం మొత్తం కర్ఫ్యూ విధించింది. ఆర్మీని రంగంలోకి దించింది. ఆటూ బంగ్లా నుంచి శనివారం నాటికి వెయ్యి మంది భారతీయ విద్యార్థులు స్వదేశానికి వచ్చారని, మరో నాలుగు వేల మంది వివిధ వర్సిటీ హాస్టల్స్‌లో చిక్కుకుపోయారని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. "విద్యార్థులు తిరిగి రావడానికి ఢాకాలోని భారత హై కమిషన్ అన్ని ఏర్పాట్లు చేస్తోంది" అని భారత విదేశాంగ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● ఆదివారం 21 జూలై 2024

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ)- వ్యవసాయ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి ఉద్దేశించిన అగ్రిసెట్ అండ్ అగ్రి ఇంజనీరింగ్ సెట్ 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అగ్రిసెట్-2024 ద్వారా బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్); అగ్రి ఇంజనీరింగ్ సెట్-2024 ద్వారా బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. వ్యవసాయ సంబంధిత విభాగాల్లో డిప్లొమా పూర్తి చేసిన తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

తెలంగాణ అగ్రిసెట్ అండ్ అగ్రి ఇంజనీరింగ్ సెట్



అగ్రిసెట్

- **అర్హత:** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ)/ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ (ఏఎన్‌జీఆర్ఏయూ) నుంచి డిప్లొమా(అగ్రికల్చర్/సీడ్ టెక్నాలజీ) పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులు. జయశంకర్ వర్సిటీ నుంచి ఆర్గానిక్ అగ్రికల్చర్ డిప్లొమా, ఎన్‌జీ రంగా వర్సిటీ నుంచి ఆర్గానిక్ ఫార్మింగ్ డిప్లొమా ఉత్తీర్ణులైన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **వయసు:** 2024 డిసెంబరు 31 నాటికి జనరల్, ఓబీసీ కేటగిరీల అభ్యర్థులకు 17 నుంచి 22 ఏళ్ల మధ్య; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య; దివ్యాంగులకు 17 నుంచి 27 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.
- **సీట్లు:** బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్) ప్రోగ్రామ్‌లో మొత్తం 92 సీట్లు ఉన్నాయి. వీటిలో అగ్రికల్చరల్ డిప్లొమా అభ్యర్థులకు 76, సీడ్ టెక్నాలజీ అభ్యర్థులకు 7, ఆర్గానిక్ అగ్రికల్చర్ అభ్యర్థులకు 9 సీట్లు ప్రత్యేకించారు. ఈడబ్ల్యూఎస్ కోటా కింద అగ్రికల్చరల్ డిప్లొమా అభ్యర్థులకు 7, సీడ్ టెక్నాలజీ అభ్యర్థులకు 1, ఆర్గానిక్ ఫార్మింగ్ అభ్యర్థులకు 1 చొప్పున మొత్తం 9 సీట్లు; సెల్ఫ్ ఫైనాన్స్ కోటా కింద అగ్రికల్చరల్ డిప్లొమా అభ్యర్థులకు 29, సీడ్ టెక్నాలజీ అభ్యర్థులకు 2, ఆర్గానిక్ అగ్రికల్చర్ డిప్లొమా అభ్యర్థులకు 3 చొప్పున మొత్తం 34 సీట్లు కేటాయించారు.

అగ్రి ఇంజనీరింగ్ సెట్

- **అర్హత:** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ)/ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ (ఏఎన్‌జీఆర్ఏయూ) నుంచి డిప్లొమా(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
- **వయసు:** 2024 డిసెంబరు 31 నాటికి జనరల్, ఓబీసీ కేటగిరీల అభ్యర్థులకు 17 నుంచి 23 ఏళ్ల మధ్య; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య; దివ్యాంగులకు 17 నుంచి 27 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.
- **సీట్లు:** బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లో 8 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ కోటా కింద ఒక సీటు, సెల్ఫ్ ఫైనాన్స్ కోటా కింద ఒక సీటు కేటాయించారు.

ఎంట్రెన్స్ టెస్ట్‌ల వివరాలు: ఇవి కంప్యూటర్ ఆధారిత పరీక్షలు. ఒక్కో టెస్ట్‌లో మొత్తం 100 'మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు' ఇస్తారు. అభ్యర్థులు డిప్లొమాలో ఎంచుకొన్న విభాగంలోనే సంబంధిత ఎంట్రెన్స్ టెస్ట్ రాయాలి. అగ్రిసెట్ అభ్యర్థులకు అగ్రికల్చర్/సీడ్ టెక్నాలజీ/ఆర్గానిక్ అగ్రికల్చర్ డిప్లొమా సిలబస్ నుంచి, అగ్రి ఇంజనీరింగ్ సెట్ అభ్యర్థులకు అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ డిప్లొమా సిలబస్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. వీటితోపాటు జయశంకర్ వర్సిటీ అభివృద్ధి చేసిన టెక్నాలజీ, నూతన ఉత్పత్తులు; జనరల్ అగ్రికల్చర్; వ్యవసాయానికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలు, జనరల్ ఇంగ్లీష్, బేసిక్స్ ఇన్ కంప్యూటర్స్ అంశాలనుంచి ప్రశ్నలు ఇస్తారు. అగ్రిసెట్‌ను తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో, అగ్రి ఇంజనీరింగ్ సెట్‌ను ఆంగ్ల మాధ్యమంలో నిర్వహిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1400; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.700
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 9
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** ఆగస్టు 17 నుంచి
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, ఖమ్మం, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్.
- **అగ్రిసెట్ 2024, అగ్రి ఇంజనీరింగ్ సెట్ 2024 తేదీ:** ఆగస్టు 24
- **వెబ్‌సైట్‌లో ప్రశ్న పత్రాలు, సంబంధిత కీ అందుబాటులో ఉండే తేదీలు:** ఆగస్టు 28 నుంచి 29 వరకు
- **వెబ్‌సైట్:** www.pjtsau.edu.in

ఈఎస్‌సీఐలో
పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్

హైదరాబాద్-గచ్చిబౌలీలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఈఎస్‌సీఐ)కి చెందిన స్కూల్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్, జనరల్ మేనేజ్‌మెంట్, ఇండస్ట్రియల్ సేఫ్టీ అండ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ విభాగాలు అందుబాటులో ఉన్నాయి. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఈ ప్రోగ్రామ్‌కు ఏఐసీటీఈ గుర్తింపు ఉంది. ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి ఎల్ అండ్ టీ, కార్వే, డెలాయిట్, టెక్ మహేంద్ర తదితర ప్రముఖ సంస్థల్లో ప్లేస్‌మెంట్స్ కల్పించేందుకు సహకారం అందిస్తారు.

ప్రోగ్రామ్ వివరాలు

- ప్రోగ్రామ్‌లో భాగంగా విభాగానికి నిర్దేశించిన ప్రకారం మేజర్, మైనర్ ఎలక్టివ్ సబ్జెక్టులు చదవాల్సి ఉంటుంది. ప్రతి విభాగంలో ఫైనాన్స్, మార్కెటింగ్, హ్యూమన్ రిసోర్సెస్, బిజినెస్ అనలిటిక్స్, టెలికాం అండ్ ఐటీ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ అనే మైనర్ ఎలక్టివ్ సబ్జెక్టులు ఉంటాయి.
- జనరల్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో హెచ్‌ఆర్ఎం, మార్కెటింగ్, ఫైనాన్స్; ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో సివిల్, పవర్, టెలికాం, ట్రాన్స్‌పోర్టేషన్, ఐటీ; ఇండస్ట్రియల్ సేఫ్టీ అండ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో మాన్యుఫాక్చరింగ్ ఇండస్ట్రీ సేఫ్టీ, సర్వీస్ అండ్ మెయింటెనెన్స్ సెక్టర్ సేఫ్టీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సేఫ్టీ మేనేజ్‌మెంట్, ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ అనే మేజర్ ఎలక్టివ్ సబ్జెక్టులు ఉంటాయి.

అర్హత: స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన మేరకు ఆర్ట్స్/కామర్స్/సైన్స్/మేనేజ్‌మెంట్/ఇంజనీరింగ్/టెక్నాలజీ విభాగాల్లో కనీసం 50 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. క్యాట్/మ్యాట్/ఎక్స్‌ఏటీ/సీమ్యాట్/ఐసెట్ అర్హత పొంది ఉండాలి.

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.5,30,000
- **దరఖాస్తు ఫీజు:** రూ.1,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 31
- **వెబ్‌సైట్:** esci.edu.in



సంస్కృత విశ్వవిద్యాలయంలో
పీజీ స్పాట్ అడ్మిషన్స్



తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం(ఎన్ఎస్‌కేటీయూ-సెంట్రల్ యూనివర్సిటీ)- పీజీ ఫుల్ టైమ్/రెగ్యులర్ ప్రోగ్రామ్‌లలో మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఆచార్య, ఎంఏ(శబ్దబోధ/హిందీ), ఎమ్మెస్సీ(కంప్యూటర్స్/యోగ థెరపీ), ఎంఏఐఎంటీ ప్రోగ్రామ్‌లలో సీట్లు ఉన్నాయి. సీయూఈటీ అర్హత పొందినవారు, నాన్ సీయూఈటీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రోగ్రామ్‌లు-విభాగాలు-సీట్లు

- ఆచార్య ప్రోగ్రామ్‌లో సాహిత్య(కావ్య వర్గ) 9, సాహిత్య(అలంకార వర్గ) 33, ఐకేఎస్ 19, పురాణేతిహాస 24, సామవేద భాష్యం 26, కృష్ణ యజుర్వేద భాష్యం 21, అథర్వ వేద భాష్యం 28, వ్యాకరణం 28, ఫలిత జ్యోతిషం 30, సిద్ధాంత జ్యోతిషం 28, వాస్తు 29, ధర్మ శాస్త్రం 28, న్యాయం 27, సంఖ్యా యోగ 28, మీమాంస 27, అద్వైత వేదాంతం 30, విశిష్టాద్వైత వేదాంతం 26, ద్వైత వేదాంతం 6, ఆగమం 11 సీట్లు ఉన్నాయి
- ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లో యోగ థెరపీ 11, కంప్యూటర్ సైన్స్ 20 సీట్లు ఉన్నాయి.
- ఎంఏ ప్రోగ్రామ్‌లో శబ్దబోధ 20, హిందీ 9 సీట్లు ఉన్నాయి.
- ఎంఏఐఎంటీ ప్రోగ్రామ్‌లో 33 సీట్లు ఉన్నాయి.

అర్హత

- ఆచార్య ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి మూడేళ్ల డిగ్రీ/శాస్త్రి కోర్సు పూర్తిచేసి ఉండాలి. డిగ్రీ స్థాయిలో సెకండ్ లాంగ్వేజ్‌గా సంస్కృతం చదివి ఉండాలి
- ఎంఏ హిందీకి ఏదేని డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. సెకండ్ లాంగ్వేజ్‌గా/ఒక సబ్జెక్ట్‌గా హిందీ చదివి ఉండాలి. లేదంటే హైదరాబాద్‌లోని హిందీ ప్రచారసభ నుంచి విద్వాన్ కోర్సు పూర్తిచేసి ఉండాలి.
- ఎంఏ శబ్దబోధ ప్రోగ్రామ్‌నకు సమ్మానిత శాస్త్రి కోర్సు ఉత్తీర్ణులు; కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్స్ ఒక సబ్జెక్ట్‌గా డిగ్రీ(న్యాయం/వ్యాకరణం/మీమాంస/దర్శన) పూర్తిచేసినవారు అర్హులు. సంస్కృతం, కంప్యూటర్ సైన్స్/మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా బీఏ/బీఎస్సీ/బీసీఏ ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.
- ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ ప్రోగ్రామ్‌నకు కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్స్ ఒక సబ్జెక్ట్‌గా ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఇంటర్/డిగ్రీ స్థాయిలో సంస్కృతం ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి.
- ఎమ్మెస్సీ యోగ థెరపీకి ఏదేని డిగ్రీ/సమ్మానిత శాస్త్రి కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
- ఎంఏఐఎంటీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ పూర్తిచేసి ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.300
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 31
- **సీయూఈటీ అభ్యర్థులకు దరఖాస్తు లింక్:** https://nsk-tucuet.samarth.edu.in/pg
- **నాన్ సీయూఈటీ అభ్యర్థులకు దరఖాస్తు లింక్:** https://nsktuadmission.samarth.edu.in
- **వెబ్‌సైట్:** www.nsktu.ac.in

జాబ్ కార్నర్

పుణె ఐఐటీఎంలో రీసెర్చ్ ఫెలో

ఖాళీలు: 30

పుణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటీయోరాలజీ(ఐఐటీఎం)... కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

అర్హతలు: పోస్టును బట్టి సంబంధిత స్పెషలైజేషన్‌లో మాస్టర్స్ డిగ్రీ, లేదా తత్సమాన కోర్సుల్లో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. నెట్/గేట్/ఎల్ఎస్ స్కోరుతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 2024 ఆగస్టు 10 నాటికి 28 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ, మహిళ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ, ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు మూడేళ్లు సడలింపు ఉంటుంది.

వేతనం: నెలకు రూ.37,000

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 10

వెబ్‌సైట్: www.tropmet.res.in/

సీఆర్‌పీఎఫ్‌లో జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్లు

ఖాళీలు: 22

సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్... కాంట్రాక్ట్ ప్రాతిపదికన సీఆర్‌పీఎఫ్ హాస్పిటల్స్‌లో జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

అర్హత: ఎంబీబీఎస్ ఉత్తీర్ణులై ఉండాలి

గరిష్ఠ వయోపరిమితి: 70 సంవత్సరాలు మించకూడదు

రెమ్యునరేషన్: నెలకు రూ.75,000

ఇంటర్వ్యూ తేదీ: జూలై 31

వేదిక: హైదరాబాద్, పుణె, శ్రీనగర్, ఇంఫాల్, గువాహటి, గాంధీనగర్‌లోని సీఆర్‌పీఎఫ్ కాంపోజిట్ హాస్పిటళ్లలో

వెబ్‌సైట్: rect.crpf.gov.in/

ఎండీఎస్ఎల్‌లో అప్రెంటిస్‌లు

ఖాళీలు: 518

ముంబయిలోని మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్... కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.



ట్రేడులు: డ్రాఫ్ట్‌మన్(మెకానికల్), ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, పైప్ ఫిట్టర్, స్ట్రక్చరల్ ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, వెల్డర్, కార్పెంటర్, రిగ్గర్, వెల్డర్ ఎలక్ట్రికల్ తదితరాలు

అర్హత: ఖాళీని అనుసరించి ఎనిమిదో తరగతి, పదో తరగతి, ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 2024 అక్టోబరు 1 నాటికి గ్రూప్-ఎ 15 నుంచి 19 ఏళ్లు; గ్రూప్-బి 16-21 ఏళ్లు, గ్రూప్ సి 14-18 ఏళ్ల మధ్య ఉండాలి.

స్టయిపెండ్: నెలకు గ్రూప్ ఎ -రూ.6600, గ్రూప్ బి-రూ.8050 - రూ.7700, గ్రూప్ సి-రూ.2500 - రూ.5500 వరకు చెల్లిస్తారు.

దరఖాస్తు రుసుము: జనరల్, ఓబీసీ, ఈబ్ల్యూఎస్ కేటగిరీకి రూ.100. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: కంప్యూటర్ ఆధారిత పరీక్ష, స్కిల్/ట్రేడ్ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా

దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 26

వెబ్‌సైట్: https://www.mazagondock.in/


లిటిల్స్

వంటవాడి సమయ స్ఫూర్తి



వందన గిరి రాజ్యాన్ని ప్రవీణుడు అనే రాజు పాలించే వాడు అతనికి చాలా ముక్కోపి అని పేరుండేది. అతని దగ్గర ధర్మయ్య అనే వంటవాడు ఉండేవాడు. అతను చేసే వంటకాలంటే మహారాజుకు చాలా ఇష్టం ఉండేది. ఒక రోజు ధర్మయ్య త్వరత్వరగా వంట పూర్తి చేసి, తన కొడుక్కి అనారోగ్యంగా ఉండటంతో మహారాజుకు వడ్డించే పనిని మరొక పనివాడికి అప్పగించి తాను ఇంటికి వెళ్లిపోయాడు. ఆ రోజు కూరల్లో కారం ఎక్కువ అయింది. మహారాజు రుచి చూడగానే కారం ఎక్కువయిందని తెలిసి, కోపంతో ఆ మర్నాడు ధర్మయ్యకి మరణ దండన విధించాలని నిర్ణయం చేశాడు. ఇది తెలిసిన ధర్మయ్య రాజు కొలువుకు వచ్చి 'మహారాజా చనిపోయే ముందు ఎవరికైనా చివరి కోరిక తీరుస్తారు కదా. అలాగే నా చివరి కోరిక కూడా తీర్చండి. నాకు ఓ ధనుస్సు, బాణం కావాలి తెప్పించండి. ఆ బాణంనేను మీ మీద వేయాలి అనుకుంటు న్నాను' అన్నాడు అదేమిటి? అని అడిగినరాజుతో ధర్మయ్య 'కేవలం కూరలో కారం ఎక్కువ అయినందుకే నా ప్రాణం తీశారనే అపకీర్తి మీకు వద్దు మహారాజా.. ఇపుడు ఇంత హాని మీకు తలపెట్టాను అని చెప్పి నన్ను ఉరి తీయించండి' అన్నాడు శిక్ష తప్పించుకోవడానికి వంటవాడు చూపిన సమయస్ఫూర్తికి నవ్వుకున్న రాజు అతనికి విధించిన మరణదండన రద్దు చేసి, క్షమించి పంపేశాడు అలా ధర్మయ్య ఉపాయంతో తనను కాపాడుకున్నాడు.

6 తేడాలను గుర్తించండి?




జోకర్ బొమ్మలు ఎన్ని



ఏ వాహనం ముందుగా చేరుతుంది



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 364

	2	1			
3	6		1		
				2	
	3				
		5		1	3
			4	6	

సుడోకు - 363 సమాధానం

5	6	9	7	1	3	4	8	2
2	1	8	5	9	4	3	7	6
4	7	3	8	2	6	5	9	1
7	3	1	2	5	8	6	4	9
6	9	4	1	3	7	8	2	5
8	2	5	6	4	9	1	3	7
3	4	2	9	6	5	7	1	8
9	8	6	3	7	1	2	5	4
1	5	7	4	8	2	9	6	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.